# కేనోపనిషత్తు

(సామవేదం నుండి)

వ్యాఖ్యాత

**'అభినవ వ్యాస'  'జ్ఞాన ప్రపూర్ణ' శ్రీ దేవిశెట్టి చలపతిరావు**

వ్యవస్థాపకులు

ఆధ్యాత్మిక జ్ఞాన పీఠం, చిలకలూరిపేట.

# పూజ్య గురుదేవులు



జ్ఞానప్రపూర్ణ

## శ్రీ దేవిశెట్టి చలపతిరావు గారు B.Sc., (Ag)

వ్యవస్థాపకులు : ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట

Contact : (Mobile) 80085 39770 / (Land Line) 08647 254716

Email : care@srichalapathirao.com

Visit www.srichalapathirao.com to listen Pravachanas

# గురుదేవుల పరిచయము

శ్రీ దేవిశెట్టి చలపతిరావు గారు 1946 సెప్టెంబర్ 12 వ తేదీన గుంటూరు జిల్లా తుర్లపాడు గ్రామంలో జన్మించారు. తండ్రి వీరరాఘువయ్య, తల్లి పుల్లమ్మ. వీరి నివాసం చిలకలూరిపేట. ప్రాధమిక విద్య తుర్లపాడు గ్రామంలోను, ఉన్నత విద్య చిలకలూరిపేట లోను అభ్యసించి, బాపట్ల వ్యవసాయ కళాశాల నుండి B.Sc. (Ag.) ప్రధమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు.

పూవు పుట్టగానే పరిమళిస్తుందనే నానుడి ప్రకారం 4 సంవత్సరాల వయస్సు నుండి 8 సంవత్సరాల వయస్సు వరకు వీరి నోటి నుండి ఏ వాక్కు వస్తే అలాగే జరిగేది. పూర్వ జన్మ సంస్కారం వల్ల వీరు 12 సంవత్సరాల వయస్సు నుండే రామాయణ, భారత, భాగవత గ్రంధాలను, పురాణాలు - ప్రబంధాలను అధ్యయనం చేయటం ప్రారంభించారు. ప్రత్యేకంగా మహాభారతంపై విశేషమైన ఆసక్తి కలిగి, 20 సంవత్సరాలకు పైగా ఆంధ్ర మహాభారతం, సంస్కృత మహాభారత గ్రంధాలపై తీవ్ర పరిశోధనలు గావించి, చిలకలూరిపేటలో 1988 నుండి 1992 వరకు ధారావాహిక ప్రవచనములు చేసి, శ్రోతల ప్రశ్నలకు అప్పటికప్పడే జవాబులిస్తూ వారికి సందేహనివృత్తి గావించారు.

1990 నుండి చిలకలూరిపేట చిన్మయ మిషన్ కార్యదర్శిగా అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను, హెూమాలను, పూజలను, గీతాజ్ఞాన యజ్ఞాలను, సత్సంగాన్ని నిర్వహించారు. 1994 లో *ఆధ్యాత్మిక జ్ఞాన పీఠాన్ని* స్థాపించి, ప్రసన్న బండ్లమాంబ శ్రీ రాజమాతాదేవి వారిచే ప్రారంభింపజేశారు. అప్పటి నుండి ప్రతిరోజు సత్సంగము, ప్రతి నెల గీతాపారాయణలతో బాటు శ్రీకృష్ణ జన్మాష్టమి, గీతాజయంతి, శంకరాచార్య జయంతి, రమణమహర్షి జయంతి, ఆషాఢ - కార్తీక – మాఘ - వైశాఖ పౌర్ణమిల యందు ఆధ్యాత్మిక సదస్సులు, జన్మదినోత్సవం, విజ్ఞానయాత్రలు, వనసమారాధనలు, ధ్యానతరగతులు, వార్షికోత్సవం మొదలగు అనేక కార్యక్రమాలను జరుపుకొనుటలోను, నిరంతర జప, ధ్యాన, ఆత్మవిచారణ, సాక్షీభావన, బ్రహ్మనిష్ఠ మొ||న సాధనలతో, పూర్తి ఆధ్యాత్మిక జీవితాలను గడుపుటలోను, మాకు సదా మార్గదర్శకులుగా ఉండి మా వెన్ను తట్టి, చేయిపట్టి ముందుకు నడిపిస్తున్న కర్మయోగులు, జ్ఞాన ప్రపూర్ణులు మా గురుదేవులు.

భగవంతుడు నిర్దేశించిన బాటలో పయనిస్తూ, తనలో నిక్షిప్తమైయున్న ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పదిమందికీ పంచాలనే సంకల్పంతో 1996 నుండి వివిధ పట్టణాలలో ఆధ్యాత్మిక జ్ఞాన యజ్ఞముల ద్వారా భగవద్గీత, ప్రకరణ గ్రంధాలైన శంకరాచార్యుల వారి భజగోవిందం, తత్వబోధ, ఆత్మబోధ, వివేకచూడామణి, అద్వైతసారం, దక్షిణామూర్తి స్తోత్రం, అపరోక్షానుభూతి, శ్రీ సదాశివ బ్రహ్మేంద్ర స్వాముల వారి ఆత్మవిద్యావిలాసం, శంభు నటనం, భగవాన్ శ్రీ రమణ మహర్షుల వారి ఉపదేశసారం, నారద భక్తిసూత్రములు, బ్రహ్మ సూత్రములు, ఇంకా రామాయణ, భారత, భాగవతములు, అలాగే ఈశ, కేన, కఠ, ముండక, కైవల్య, తైత్తి రీయ, సూర్య, మొదలగు ఉపనిషత్తుల పైనను ప్రవచనములు చేస్తూ జ్ఞాన సుగంధాలను నలువైపుల ప్రసరింపజేస్తున్నారు. ఇప్పటి వరకు చిలకలూరిపేట, విజయవాడ ధర్మల్ పవర్ స్టేషన్, రాయలసీమ ధర్మల్ పవర్ ప్రాజెక్ట్, వినుకొండ, శ్రీశైలం, కాశీ, తిరువణ్ణామలై, నెల్లూరు, బాపట్ల మొదలగు చోట్ల 145 ఆధ్యాత్మిక జ్ఞాన యజ్ఞములను చేశారు. 1998 లో వి.టి.పి.యస్.ఎ. కాలనీ యందు 108 హోమకుండాలతో వాసుదేవ మహాయజ్ఞాన్ని నిర్వహించారు.

1993 లో భగవద్గీత ముగింపు సందర్భంగాను, 2001 లో వివేక చూడామణి ముగింపు సందర్భంగా చిలకలూరిపేటలోను; 1999 లో భగవద్గీత ముగింపు సందర్భంగాను, 2002 లో వివేక చూడామణి ముగింపు సందర్భంగా వి.టి.పి.యస్.లోను శిష్యులందరూ గురుదేవులను ఘనంగా సన్మానించారు. 2006 లో 100 జ్ఞాన యజ్ఞాలు పూర్తిగావించిన సందర్భంగా శిష్యులందరూ కలసి 'జ్ఞానప్రపూర్ణ' బిరుదుతోను, 2011 లో మహాభారత పరిశోధనలో గురుదేవుల కృషికి 'అభినవ వ్యాస' బిరుదుతోను గురుదేవులను సత్కరించటం జరిగింది.

1994 లో సామాన్యులకు కూడా వేదాంత విషయాలు సులభంగా అర్థమయ్యే రీతిలో గురుదేవులు 'కర్మసిద్ధాంతం' అనే చిన్న గ్రంధాన్ని రచించి ప్రచురింపజేశారు. తిరిగి 2002 లోను, 2008 లోను, 2009 లోను పునర్ముద్రణ జరిగింది. 1998 లో శుక్ల యజుర్వేదమునందలి 'ఈశావాస్యోపనిషత్తు' పై అందరికి అర్థమయ్యే విధంగా సరళమైన, వాడుకభాషలో విపులమైన వ్యాఖ్యను వ్రాసి ప్రచురింపజేశారు. 1999 లో శంకరాచార్యుల వారి 'భజగోవిందం' పై అందరికీ అతి సులభంగా అర్థమయ్యే విధంగా, ఎంతో వివరంగా, వ్యాఖ్యను వ్రాసి ప్రచురింపజేశారు. తిరిగి 2009 లో ద్వితీయ ముద్రణ జరిగింది.

'భగవద్గీత' అనగానే "అమ్మో! అది మనలాంటి సామాన్యులకు కాదు" అనుకొనేవారు "భగవద్గీతను ఇంత తేలికగా అర్థం చేసుకోగలమా?" అనుకొనేటట్లు ప్రవచనములు చేస్తున్న

గురుదేవులు 2011 లో 1,2 అధ్యాయములను ప్రచురింపచేశారు. ఇప్పుడు 2012 లో భగవాన్ రమణ మహర్షుల "ఉపదేశసారము"నకు, సామవేదం నుండి గ్రహించబడిన కేనోపనిషత్తుకు విపులమైన వ్యాఖ్యను వ్రాసి ప్రచురింప చేశారు. ఇవిగాక ప్రస్తుతం నారదభక్తి సూత్రాలపై, శంకరాచార్యుల వారి ఆత్మబోధ, దక్షిణామూర్తి స్తోత్రంపై ఎంతో వివరణాత్మకంగా, సోదాహరణంగా, విపులమైన వ్యాఖ్యను వ్రాసి ప్రచురింప జేస్తున్నారు.

ఇవి గాక విజయవాడ నుండి వెలువడే *ద్యానమాలిక* మాసపత్రికలో 2008 నుండి భగవద్గీతను, 2009 నుండి మహాభారతమును ధారావాహికంగా ప్రచురిస్తున్నారు. ఇక దేశవిదేశాలలో నున్న తెలుగువారు ఈ జ్ఞానాన్ని గ్రహించటానికి వీలుగా www.srichalapathirao.com పేరుతో ఒక వెబ్ సైట్ ను ప్రారంభించటం జరిగింది. దీని ద్వారా ఆధ్యాత్మిక జ్ఞానపీఠం కార్యక్రమాలను, గురుదేవుల ప్రవచనాలను, గురుదేవుల వివిధ రచనలను, భజనలు, కీర్తనలను వినవచ్చును, చదువవచ్చును, డౌన్లోడ్ చేసుకొనవచ్చును. ఇక వివిధ గ్రంధాలపై గురుదేవుల ప్రవచనములను సి.డి.ల రూపంలోను, వీడియో DVD ల ద్వారా అందిస్తున్నారు.

ముందు ముందు మోక్షమార్గంలో పయనించే ఎందరికో మార్గ నిర్దేశనం చేయగల ఎన్నో గ్రంధాలు ముముక్షు జనావళిని తరింపజేయుటకు అందుబాటులోనికి రావాలని, అందుకు త్యాగధనులైన భక్తులు, సాధకులు, మోక్షార్ధులు ముందుకు రాగలరని భగవంతుని మనసారా ప్రార్ధిస్తున్నాను.

జ్ఞాన సూర్యునిలా ప్రకాశిస్తూ, నిస్వార్ధంగా తన సేవలను అందిస్తున్న కర్మయోగి, సనాతనమైన వైదిక ధర్మాన్ని ప్రచారం చేస్తూ, మాకు మార్గదర్శకులైన భగవంతుని ముద్దుబిడ్డ మా గురుదేవులను పరిచయం చేసే భాగ్యం నాకు కలిగించినందులకు భగవంతునికి శతసహస్ర వందనములు సమర్పించుకుంటున్నాను.

- శ్రీమతి రావూరి అన్నపూర్ణ

కార్య నిర్వాహక అధ్యక్షులు

ఆధ్యాత్మిక జ్ఞాన పీఠం

చిలకలూరిపేట

# కేనోపనిషత్తు

## తొలిపలుకు

ఈలోకంలో ప్రతి ప్రాణి - ప్రతి జీవి యొక్క యదార్థ స్వరూపం పరమాత్మయే. అయితే తాను పరమాత్మస్వరూపాన్ని అని మరచి జీవుడుగా వ్యవహరిస్తున్నాడు మానవుడు. అట్టి మానవుడు తిరిగి మాధవుడుగా, నరుడు నారాయణుడుగా, జీవుడు దేవుడుగా తన స్వస్థితిలో నిలిచి పోవాలంటే అందుకు మార్గం చూపేవే వేదాలు.

వేద అంటే తెలుసుకొనుట అని అర్థం. ఏమి తెలుసుకోవాలి ? దేనిని తెలుసుకున్న తరువాత ఇక తెలుసుకోవలసినది ఏమీ ఉండదో; దేనిని తెలుసుకుంటే సర్వమూ తెలిసినట్లో అట్టి  జ్ఞానాన్ని-ఆత్మ జ్ఞానాన్ని-నేను ఆత్మను అనే జ్ఞానాన్ని తెలుసుకోవాలి. కనుక మానవుడు తరించాలంటే, తన జన్మను సార్థకం చేసుకోవాలంటే, జీవిత పరమార్థమైన మోక్షాన్ని పొందాలంటే తప్పక తెలుసుకోవలసినది వేదవిజ్ఞానాన్నే.

దీనిని సృష్టికర్త బ్రహ్మదేవుడు మొదట దివ్యవాణిగా విన్నాడు. అందుకే దీనిని శ్రుతి అన్నారు. శ్రుతి అంటే విన్నది అని అర్థం. బ్రహ్మదేవుడు మొదటగా విని ఇతరులకు బోధించటం వల్ల దీనిని బ్రహ్మవిద్య అన్నారు.

మొదట  వేద మంత్రాలన్నీ కుప్పలు తెప్పలుగా ఒక్కటిగానే ఉండేవి. కలియుగంలోని మానవులు అల్పాయుష్కులు, అల్పజ్ఞానులుగ ఉంటారు గనుక; ఈ వేదమంత్రాలను చదవటానికి గాని, అధ్యయనం చేయటానికి గాని, అర్థం చేసుకోవటానికి గాని, ఆచరించటానికి గాని తగిన తెలివితేటలు, సమయము వారికి ఉండవు గనుక; కలియుగానికి ముందే ద్వాపరయుగంలో జన్మించిన వ్యాసమహర్షి ఒక్కటిగా ఉన్న ఈ వేదమంత్రాలను నాలుగుగా విభజించి వేదవ్యాసుడయ్యాడు.

అవే ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అధర్వణ వేదము.

ఇలా విభజించబడిన ప్రతివేదము తిరిగి ఒక్కొక్కటి నాలుగు భాగాలుగా విభాగించబడినవి. అవే 1. సంహిత (మంత్ర భాగం) 2. బ్రాహ్మణాలు (పూజలు, యజ్ఞయాగాదులు మొ॥న కర్మకాండ) 3. ఆరణ్యకాలు (ఉపాసనలు) 4. ఉపనిషత్తు (పరమాత్మ తత్త్వం).

మానవులకు మోక్షమార్గాన్ని చూపేవే ఉపనిషత్తులు. ఇవి వేదాలకు అంతంలో ఉండటం వల్ల వేదాంతం అంటారు. మానవ జీవితాన్ని తరింప జేసుకొనుటకు, మోక్షాన్ని అందుకొనుటకు కావలసిన అద్భుత జ్ఞానాన్ని ప్రసాదించే ఉపనిషత్తులు నాలుగువేదాల లోను మొత్తం 1180 ఉన్నవి. అయితే 108 ఉపనిషత్తులు మాత్రమే మంత్రాలతో సహా ఇప్పుడు మనకు లభిస్తున్నాయి. ఇందులో కూడా 10 ఉపనిషత్తులు అత్యంత ముఖ్యమైనవని మహాత్ములందరూ అంగీకరిస్తున్నారు. అవే ఈశ, కేన, కఠ, ప్రశ్న, ముండక, మాండూక్య, తైత్తిరీయ, ఐతరేయ, ఛాందోగ్య, బృహదారణ్యక అనే దశోపనిషత్తులు.

ఉపనిషత్తు అనే పదం మనచెవిన పడగానే ఒక సుందర మైన, ఆహ్లాదకరమైన, మనోహర దృశ్యం మన మనోఫలకంపై కదులుతుంది.

ప్రశాంతమైన ఒకవనవాటిక. పచ్చని చెట్లతో కళకళలాడుతున్న సుందర ప్రదేశం అది. అక్కడి చెట్లపై గల పక్షుల కిలకిల ధ్వానాలతోను, కోకిలల కుహూ కుహూ అనే కూజితాలతోను మనస్సుకు ఆహ్లాదం కలుగుతున్నది. బ్రహ్మచారుల వేద పఠనాలతో ఆ ప్రదేశమంతా పవిత్రతను సంతరించుకున్నది. ఆ ఆశ్రమ ప్రాంగణంలో ఒక చోట రావిచెట్టు, ఆ చెట్టు మొదలు వద్ద ఎత్తుగా ఉన్న అరుగు. ఆ అరుగుపై ఉచితాసనం.

దాని కెదురుగా సమీపంలో శుభ్రం చేసిన నేలపై దర్భాసనాలు వేసుకొని, సాధన చతుష్టయ సంపన్నులైన శిష్యులు వినయ విధేయతలతో గురుదేవుల అమృత వాక్కుల కొరకు ప్రశాంత మనస్కులై ఎదురుచూస్తున్నారు. సరియైన వేళకు శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడు ఐన సద్గురువు తన ఆసనంపై ఆశీనులయ్యారు. శిష్యులు గౌరవ సూచకంగా లేచి నిలబడి అభివాదం చేసి తమతమ స్థానాలలో ఆశీనులయ్యారు. శాంతి మంత్రం పఠించి, గురువు శాస్త్రాన్ని తన అనుభవంతో జోడించి, అనర్గళంగా ప్రవచనం చేస్తుంటే, శిష్యులు సూక్ష్మ బుద్ధితో తత్త్వాన్ని అవగాహన చేసుకుంటున్నారు. ఇదీ ఉపనిషత్తు అనే పేరు చెవినబడగానే కనులముందు కదలాడే దృశ్యం.

ఈ దృశ్యం అంతా ఉపనిషత్తు అనే పదంలో అంతర్లీనంగా దాగి ఉన్నది. ఎందుకంటే

ఉప అంటే సమీపంగా,

ని అంటే క్రింద,

షత్ అంటే కూర్చొనుట.

కనుక ఉపనిషత్ అంటే సమీపంగా క్రింద కూర్చొనుట అని.

అంటే శిష్యులు వేదాంత జ్ఞానాన్ని బోధించే గురువుకు సమీపంగా క్రింద కూర్చొని, ఉపనిషత్తుల జ్ఞానాన్ని తెలుసుకోవాలి. అంతేగాని ఎవరింటిలో వారు కూర్చొని న్యూస్ పేపరు తిరగవేసినట్లు తిరగేసేది కాదు ఉపనిషత్తు. ఎందుకంటే ఇది ఆత్మవిద్య-బ్రహ్మవిద్య. ఈ విద్య మానవునిలోని అజ్ఞానాన్ని పోగొట్టి, సమస్త దుఃఖాలను నివృత్తిచేసి, పరబ్రహ్మన్ని ఎరుకపరచి, ముక్తిని ప్రసాదిస్తుంది. కనుక దీనిని గురు సమ్ముఖంలో కూర్చొని, విని, మననం చేసి తెలుసుకోవలసినదే.

ఐతే సమీపంగా అంటే గురువు దేహానికి మరీ దగ్గరగా కూర్చోవాలని కాదు. గురువుయొక్క మనోభావాలను సరిగ్గా గ్రహిస్తూ, ఆయన మనస్సుతో నీ మనస్సును అనుసంధానం చేయాలి అని మాత్రమే. అలాగే క్రింద కూర్చొనుట అంటే శారీరకంగా, దేహ బాధలు ఎన్ని ఉన్నా క్రింద నేలమీద కూర్చోమని కాదు. తాను ఎంత తెలివిగలవాడైనా గురువు తనకన్నా ఎక్కువ తెలిసినవాడని, ఉన్నతుడని భావించి వినయవిధేయతలతో ఉండాలి. గంగ ఎప్పుడూ ఎత్తునుండి పల్లానికే ప్రవహిస్తుంది. ఈ జ్ఞానగంగ కూడా ఉన్నతులైన గురువుల నుండి అజ్ఞానంలో ఉన్న శిష్యులకు చేరాలి. అందుకే గురువుకన్నా తాను అధికుడనని భావించరాదు. అణకువ కలిగి ఉండాలి. ఇక కూర్చొనుట అనే పదం లోని అంతరార్థం శరీరం ఒకచోట కూర్చొనుట అని గాక మనస్సు అటూ ఇటూ పరుగులు తీయకుండా గురువాక్యాల యందే స్థిరంగా నిలిచి ఉండాలి అని.

ఉపనిషత్తులన్నీ వేదాలకు అంతంలో ఉన్నాయని, అందుకే వాటిని వేదాంతం అన్నారని, ఇంతకు ముందే చెప్పుకున్నాం. అయితే చాలా ఉపనిషత్తులు వేదాలకు అంతంలో ఉన్నప్పటికి కొన్ని మాత్రం వేదాలలోని మొదటి భాగమైన సంహితలోను, కొన్ని బ్రాహ్మణాలలోను, మరికొన్ని ఆరణ్యకాలలోను ఉన్నాయి.

మొట్టమొదటి ఉపనిషత్తు ఈశావాస్యోపనిషత్ శుక్లయజుర్వేదంలోని సంహితలో ఉండగా, రెండవదైన ఈకేనోపనిషత్ సామవేదంలోని బ్రాహ్మణాలలోనిది. తలవకార బ్రాహ్మణములోని 9వ అధ్యాయమే ఈకేనోపనిషత్తు. అందుకే దీనిని తలవకారోపనిషత్తు అని కూడా అంటారు. అయితే కేనోపనిషత్తు అన్నదే బహుళ ప్రచారంలో ఉన్నది. దీనికీ పేరు ఎలా వచ్చింది ?

‘‘ఈశావాస్యమిదగ్ం సర్వం యత్కించ జగత్యాం జగత్’’ అనే మొదటి మంత్రంలోని మొదటి వాక్యంలోని మొదటి పదాన్ని బట్టి మొదటి ఉపనిషత్తుకు ఈశావాస్యోపనిషత్తు అని పేరు వచ్చినట్లే ‘‘కేనేషితం పతతి ప్రేషితం మనః’’ అని మొదటి మంత్రంలోని మొదటి వాక్యంలోని మొదటి పదాన్ని బట్టి ఈ రెండవ ఉపనిషత్తుకు కేనోపనిషత్తు అనే పేరు వచ్చింది.

ఉపనిషత్తు అనే పదాన్ని చెవులారా వినటం కూడా పూర్వజన్మ సుకృత విశేషమే. అలాంటిది ఒక ఉపనిషత్తును మంత్రాలతోను, వాటి అర్థాలతోను, వివరంగా విపులంగా తెలుసుకోవటం గొప్ప అదృష్టం. ఇక ఉపనిషత్తును ఆమూలాగ్రంగా, కూలంకషంగా, అంతర్లీనంగా నిక్షిప్తమైయున్న సూక్ష్మ భావాలనుకూడా అవగాహన చేసుకోవటం ఇంకా ఇంకా అదృష్టం. ఇక ఈ జ్ఞానాన్ని సంపూర్ణంగా గ్రహించి, జీవితంలో ఆచరణ చేసి, అందుకనుగుణంగా జీవన విధానాన్ని మలుచుకోవటం అనేక జన్మల సుకృతం వల్లనూ, ఈ జన్మలోని ప్రయత్నం వల్లనూ మాత్రమే సాధ్యం. అట్టివారినే మహాత్ములుగా, మహాపురుషులుగా పరిగణించటం జరుగుతుంది. అలా సంపూర్ణంగా ఉపనిషత్తును అర్ధంచేసుకొని, ఆచరించుటకు వీలుగా ఎంతో వివరంగా, ఉపమానాలతో సహా, సులభమైన వాడుక భాషలో చెప్పటం జరిగింది ఈ గ్రంథంలో.

ఈ జ్ఞాన గంగలో మునిగి పునీతులమవుదాం. లభించిన ఈ మానవ జన్మను సార్ధకం చేసుకుందాం.

శాంతి పాఠంతో ప్రారంభించి ఉపనిషత్తులోనికి ప్రవేశిద్దాం. ఈ అధ్యయనం ద్వారా మన జీవితాన్ని సార్ధకం చేసుకొనేందుకు పరమాత్మ మనందరిపై తన అనుగ్రహవర్షాన్ని కురిపించాలని ఆశిస్తూ ఆశీర్వదిస్తూ

## దేవిశెట్టి చలపతిరావు
## వ్యాఖ్యాత.

# కేనోపనిషత్తు

### శాంతిపాఠము 1

ఓం సహనావవతు ! సహనౌభునక్తు ! సహవీర్యం కరవావహై!

తేజస్వినావధీతమస్తు ! మా విద్విషావహై ! ఓం శాంతిః శాంతిః శాంతిః॥

<u>ప్రతిపదార్థం</u> :- ఓం = పరమాత్మ; సహనౌ = మన ఇరువురిని; అవతు = రక్షించుగాక; సహనౌ= మన ఇరువురము; భునక్తు = ఆనందించెదముగాక; సహవీర్యం=ఇరువురము కలసి బాగా; కరవావహై = శ్రమించెదముగాక; నౌ=మన; అధీతం = అధ్యయనం; తేజస్వి అస్తు = ప్రకాశవంతమగుగాక; మా విద్విషావహై= పరస్పరము ద్వేషము లేకుండా ఉందుముగాక

<u>భావం</u> :- పరమాత్మ మన ఇరువురిని రక్షించుగాక! మన ఇరువురము ఆనందించెదము గాక! మనము ఇరువురము కలసి బాగా శ్రమించెదము గాక! మన అధ్యయనం ప్రకాశవంతమగుగాక! మన మిరువురము పరస్పరము ద్వేషము లేకుండా ఉందుముగాక.

ఆధిదైవిక, ఆధిభౌతిక, ఆధ్యాత్మిక తాపములు శాంతించుగాక!

<u>వ్యాఖ్య</u> :- ఉపనిషత్తును అధ్యయనం చేయుటకు కూర్చొగానే ముందుగా గురుశిష్యులిరువురూ కలిసి శాంతి పాఠాన్ని పఠించటం శిష్టాచార సాంప్రదాయం. చేసే అధ్యయనం ఎటువంటి ఆటంకాలు లేకుండా, శాస్త్రహృదయం బాగా

అవగాహన అయ్యేటట్లుగ, కొనసాగాలనే భావనతో భగవంతుని మనస్ఫూర్తిగా ప్రార్థించుటే ఈ శాంతి పాఠాన్ని చదవటంలో గల ఉద్దేశం.

సూర్యోదయానికి ముందే నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకొని, స్నానాదికాలు పూర్తిగావించి, జపధ్యానాదులను పూర్తిచేసి, ఉపనిషత్తును శ్రవణం చేయటానికి ఆశ్రమప్రాంగణంలోని గురుపీఠం వద్ద ఆశీనులవుతారు శిష్యులు. ఉపనిషత్తును వినిపించటానికి శ్రోత్రియుడు, బ్రహ్మ నిష్ఠుడు ఐన గురువు తన స్థానంలో ఆశీనుడవుతాడు. అప్పుడు ఇరువురుకలిసి శాంతి పాఠాన్ని చదువుతారు. ఆ విధంగా ఉపనిషత్తు అధ్యయనాన్ని ప్రారంభించటం సాంప్రదాయం.

ఓం సహనావవతు : - ఓం అంటే ప్రపంచానికి జీవుడికి ఆధారమైన నిరాకార నిర్గుణ సర్వవ్యాపక పరమాత్మ. సహనౌ అవతు అంటే అందరి హృదయాలలోను ఉన్న పరమాత్మ మా ఇరువురినీ రక్షించుగాక ! అని. దేని నుండి రక్షించాలి ? శాస్త్రాన్ని తెలుసుకోవటంలో-లక్ష్యార్థాన్ని గ్రహించటంలో వచ్చే ఆటంకాలనుండి రక్షించాలి. సాధకుడైనవాడు జీవభావంలో ఉండి తాను వేరు, పరమాత్మ వేరు అనే భావనలో (భ్రమలో) ఉంటాడు. ఆ భ్రమను పోగొట్టుకొనుటకు అట్టివాడు పరమాత్మ తత్త్వాన్ని తెలుసుకొని-ఉన్నది పరమాత్మ ఒక్కటేనని, నేను ఆ పరమాత్మనేనని గ్రహించాలి. అలాగ్రహించాలంటే పరమాత్మ తత్త్వాన్ని తెలియజెప్పే ఉపనిషత్తులను, శాస్త్రాలను ముందుగా సూక్ష్మ బుద్ధితో గ్రహించాలి. బుద్ధిసూక్ష్మంగా ఉండాలంటే మనస్సు ప్రశాంతంగా ఉండాలి. మనస్సు ప్రశాంతంగా ఉండాలంటే ప్రాపంచిక విషయాలగురించిన ఆలోచనలు గాని, భూతకాలపు జ్ఞాపకాలు గాని, భవిష్యత్తుకు సంబంధించిన భయాలు గాని, వర్తమానపు అవసరాల గురించిన ఆలోచనలుగాని

లేకుండా- రాకుండా ఉంటేనే సాధ్యం. అలా అన్నింటినుండి రక్షణపొందాలనే తపనతో భగవంతుని ఇలా ప్రార్థించాలి. అప్పుడే మనస్సు ప్రశాంతమై, బుద్ధి సూక్ష్మమై, గురువు చెప్పే జ్ఞానం సూటిగా అందుతుంది. శాస్త్రపు లోతులు పూర్తిగ తెలుస్తాయి. ఇలా శాస్త్రపు లోతులను గ్రహించటంలో వచ్చే ఆటంకాల నుండి రక్షించమని కోరటమే ఈ సహనావవతు యొక్క భావం.

సహనౌభునక్తు :- మేము ఇరువురము ఆనందించెదము గాక ! దేనికి ఆనందం? శాస్త్రాన్ని అధ్యయనం చేస్తుంటే, శాస్త్రం యొక్క లోతులను తెలుసుకుంటుంటే పరమాత్మ ఎక్కడో మనకన్న వేరుగా దూరంగా లేడని, ఆయన మనలోనే ఉన్నాడని, అసలు మనమే ఆయన అని మనం నిజంగా పరమాత్మ స్వరూపులమేనని తెలుస్తుంది. ఇలా తెలుస్తున్నకొద్దీ, పరమాత్మకు సన్నిహిత మవుతున్న కొద్దీ, పరమాత్మ తత్త్వమైన ఆనందాన్ని అనుభవిస్తుంటాం. ఇలా పరమాత్మతో తాదాత్మ్యం చెంది ఆనందించాలని ప్రార్థన.

సహవీర్యం కరవావహై :- ఇరువురము కలిసి శ్రమించెదము గాక ! ఆధ్యాత్మిక మార్గం చాలా కష్టసాధ్యమైన మార్గం, సోమరి పోతులకు ఏ మాత్రం ఈ రంగంలో అవకాశం లేదు. ప్రతిరోజూ సూర్యోదయానికి ముందే నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకొని, స్నానాదులు కావించి, జపధ్యానాలు పూర్తిగావించి, శాస్త్రశ్రవణానికి సిద్ధంకావాలి. ఉదయం 8 గంటల వరకో 9 గంటలవరకో దుప్పటి ముసుగు తీయనివానికి ఈ రంగంలో స్థానం లేదు. కేవలం శాస్త్రాన్ని శ్రవణంచేస్తే చాలదు. విన్న దానిని చక్కగా మననం చేయాలి. సందేహాలను గురువు ద్వారా తీర్చుకోవాలి. గురువు చెప్పిన విధంగా సాధనలు సాగించాలి. ఇవన్నీ చెయ్యాలంటే బాగా

శ్రమించాల్సిందే. అందుకే మేము బాగా శ్రమించెదముగాక ! అని ప్రతిజ్ఞాపూర్వకంగా ప్రమాణం తీసుకుంటున్నాం. అలా తీసుకోవాలి.

తేజస్వినావధీతమస్తు :- నౌ = మాయొక్క, అధీతం = అర్థం చేసుకొనేశక్తి, తేజస్వి అస్తు = తేజోవంతము అగుగాక !

గరుకు రాతి మీద రుద్దిన కొద్దీ కత్తికి, కొడవలికి పదును పెరుగుతుంది. అలాగే బుద్ధి పదునెక్కాలంటే జ్ఞానంతో బాగా రాపాడించాలి. అలా రాపాడించగా పదునెక్కిన బుద్ధితో శాస్త్రాన్ని అవగాహన చేసుకోవాలి. శాస్త్రాన్ని వింటూ వింటూనే అర్థం చేసుకోగలిగేటట్లు బుద్ధి తేజస్సుతో సూక్ష్మంగా ఉండాలి. అందుకే ఈ ప్రార్థన. తనలో ఇంతకు ముందే ఉన్న తప్పుడు భావాలతోకలుషితం కాకుండా గురువు చెప్పే విషయాలు, శాస్త్ర హృదయం తన ఆంతర్యంలో నిలిచేటట్లు చేయమని ఇక్కడి వేడికోలు.

మావిద్విషావహై: - మా ఇరువురి మధ్య ద్వేషము లేకుండుగాక ! ఇదొక విచిత్రమైన భావం. అసలు గురు శిష్యుల మధ్య ద్వేషం ఎందుకు కలుగుతుంది ? గురువు జ్ఞానసంపన్నుడు. కాని శిష్యుడు పరిమిత జ్ఞానం కలవాడు. ఇంతవరకు తాను ప్రవర్తిస్తున్న తీరుగాని, ఇంతవరకు తనకున్న భావాలు గాని తప్పని తెలిసినప్పుడు గురువును అపార్థంచేసుకోవచ్చు. గురువు చెప్పే విషయాలు ఒకరకంగాను, గురువు యొక్క ప్రవర్తన మరియొక రకంగాను ఉండి, గురువును అర్థం చేసుకోలేక పోవచ్చు. ఇలాంటి సందర్భాలలో గురువుపై ద్వేషం కలగవచ్చు. అలా ద్వేషం కలిగితే గురువుపై విశ్వాసం సడలిపోవచ్చు. అందువల్ల శాస్త్రం యొక్క హృదయాన్ని అర్థంచేసుకోవటం అసాధ్యం అవుతుంది. భగవత్స్వరూపుడైన గురువును అపార్థం చేసుకొని, ద్వేషం

పెంచుకొని శిష్యుడు అధఃపతనం చెందుతాడు. ఇది నివారించటానికే ఈ ప్రార్థన. అలాగే తెలియక అజ్ఞానంతో శిష్యుడు ద్వేషించినా, గురువు చెప్పినట్లు వినకపోయినా గురువులో మాత్రం ద్వేషబుద్ధి కలగరాదు. అందుకే గురువుకూడా శిష్యునితో శ్రుతికలుపుతున్నాడు.

ఆధిదైవిక - ఆధిభౌతిక - ఆధ్యాత్మిక - విఘ్న ములు కలగకుండా రక్షించమని 3మార్లు శాంతిః శాంతిః శాంతిః

## శాంతి పాఠం 2.

ఓం ఆప్యాయంతు మమాంగాని వాక్ ప్రాణః చక్షుః శ్రోత్రం అథోబల మింద్రియాణిచ సర్వాణి, సర్వం బ్రహ్మోపనిషదం, మాహం బ్రహ్మనిరాకుర్యాం, మా మా బ్రహ్మనిరాకరోత్, అనిరాకరణమస్తు అనిరాకరణం మేస్తు, తదాత్మని నిరతే, య ఉపనిషత్సుధర్మాః తేమయిసంతు తేమయిసంతు॥

ఓం శాంతిః శాంతిః శాంతిః॥

ప్రతిపదార్థం :- ఓం = పరమాత్మ; మమ అంగాని=నా అవయవములు; వాక్=వాక్కు; ప్రాణః=ప్రాణము, చక్షుః=కన్ను; శ్రోత్రం=చెవి, అథ=ఇక; బలం=బలము; సర్వాణి ఇంద్రియాణి=అన్ని ఇంద్రియాలు; ఆప్యాయంతు=వృద్ధిచెందునుగాక; సర్వం=ఇది అంతయు; ఔపనిషదంబ్రహ్మ=ఉపనిషత్తులకు చెందినబ్రహ్మమే; అహం=నేను; బ్రహ్మ= పరమాత్మను; మా నిరాకుర్యాం=నిరాకరించకుందునుగాక; మా=నన్ను; బ్రహ్మ= పరమాత్మ; మానిరాకరోత్=నిరాకరించకుండునుగాక; అనిరాకరణంఅస్తు=నాలో నిరాకరణం లేకుండుగాక; మే=నాకు; అనిరాకరణం అస్తు=నిరాకరణం లేకుండుగాక;

ఉపనిషత్సు= ఉపనిషత్తులలో; యేధర్మాః= ఏ ధర్మాలు చెప్పబడ్డాయో; తత్ ఆత్మని=ఆత్మలో; నిరతే=రమించే, తే= ఆధర్మాలు; మయినంతు= నాయందుశోభించుగాక; తేమయిసంతు= అవినాయందు శోభించుగాక.

భావం : ఓ పరమాత్మ! నా అవయవములు, వాక్కు, ప్రాణం, నేత్రం, చెవి-ఇక బలము- అన్ని ఇంద్రియములు వృద్ధి చెందునుగాక! ఇది అంతయు ఉపనిషత్తులలో చెప్పబడిన బ్రహ్మమే. ఆ బ్రహ్మమును నేను నిరాకరించకుందునుగాక! బ్రహ్మమునన్ను నిరాకరించకుండుగాక! నాకు నిరాకరణములేకుండుగాక! నాలో నిరాకరణము లేకుండుగాక! ఆత్మలో రమించునట్టి- ఉపనిషత్తులలో చెప్పబడిన ధర్మములు నాలో ప్రవేశించుగాక! అవి నాలో శోభించుగాక!

ఆధిదైవిక, ఆధిభౌతిక, ఆధ్యాత్మిక తాపములు శాంతించునుగాక!

వ్యాఖ్య :- ఇదం సర్వం ఔపనిషదంబ్రహ్మ :- ఉన్నదంతా పరమాత్మయే. ఉపనిషత్తులలో చెప్పబడిన బ్రహ్మమే. పరమాత్మకు అన్యమైనది వేరొకటి లేదు. ఒకవేళ ఈ ప్రపంచంగాని ఇందులోని వస్తువులు, విషయాలుగాని ఉన్నట్లు కనిపిస్తున్నా, అది మన భ్రమవల్లనే గాని నిజదృష్టితో చూస్తే ఇక్కడ కనిపించే సమస్తమూ బ్రహ్మమే. ఈ బ్రహ్మమునే ఉపనిషత్తులు ప్రతిపాదిస్తున్నవి. ఈ బ్రహ్మము నిర్వచించటానికి వీలులేనిదైనప్పటికి, చింతించటానికి వీలులేనిదైనప్పటికి మనం శుద్ధ బుద్ధితో దానిని తెలుసుకొనుటకు, విచారణ సాగించుటకు వీలుగా ఉపనిషత్తు అనేక పదాలతో, బ్రహ్మాన్ని నిర్వచించింది. ఉపనిషత్తులద్వారా తప్ప బ్రహ్మము యొక్క స్థితిని- స్వరూపాన్ని తెలుసుకొనుటకు, భావించుటకు మరొక మార్గం మనకు లేదు. మరి ఉపనిషత్తులను మనంతట మనం చదివి తెలుసుకోవాలనుకుంటే పదాలయొక్క

అర్థాలు తెలుస్తాయేగాని అనుభూతి కలగదు. ఉద్దేశించిన అసలైన భావం మనకు అవగతం కాదు. కనుక ఒక శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడు, కరుణాసముద్రుడు అయిన సద్గురువును సమీపించి, ఆయనను సేవించి, పూజించి, ఆయన అనుగ్రహాన్ని పొంది, వినయంతో దరిచేరి, సరియైన సమయంలో, తెలుసుకోవాలనే కాంక్షతో నీ సందేహాలను, భయాలను వెలిబుచ్చి ఆయన నుండి ఈ అనంతజ్ఞానాన్ని పొందాలి.

వాక్, ప్రాణ, చక్షు, శ్రోత్రం : ఉపనిషత్తులలో చెప్పబడిన బ్రహ్మన్ని ఈ ప్రపంచంలో చూడాలి. అలా చూడాలంటే ముందుగా మన అన్ని ఇంద్రియాలు చక్కగా పనిచేయాలి. చూడటానికి కన్ను,వినటానికి చెవి, నడవటానికి , కూర్చోవటానికి, సేవచేయటానికి కాళ్ళు చేతులు, అన్ని అవయవాలు ఆరోగ్యంగా ఉండి సరిగ్గా పనిచేయాలి. శాస్త్రాన్ని వినే శిష్యులకే గాదు, జ్ఞానాన్ని బోధించే గురువుకు కూడా అన్ని ఇంద్రియాలు సరిగ్గా పనిచేయాలి. వాక్కు శుద్ధంగా ఉండాలి. నేర్పు, నైపుణ్యం ఉండాలి. ఉపనిషత్తులలో చెప్పబడిన బ్రహ్మతత్వాన్ని గ్రహించటానికి కోరికలతో కలుషితం గాని శుద్ధమైన బుద్ధి ఉండాలి. ఇలా అన్ని ఇంద్రియాలు చక్కగా పనిచేస్తున్నప్పుడే ఉపనిషత్తులలోని జ్ఞానాన్ని పొందటానికి వీలు కలుగుతుంది.

అలా పొందిన జ్ఞానాన్ని మననం చేసుకోవాలన్నా, మననం చేసి స్థిరపరచుకొన్న జ్ఞానాన్ని నిధి ధ్యాసన చేయాలన్నా, మనో బుద్ధులు సక్రమంగా పనిచేయాలి. అవి బాగా శోభించాలి.

అథోబలం.. ఆప్యాయన్తు :- అన్ని సాధనలు చక్కగా నిర్వర్తించాలంటే, శరీర అవయవాలు చక్కగా పనిచేయాలంటే బలం ఉండాలి. బలం అంటే కేవలం కండబలమే కాదు ధైర్యం, పట్టుదల, ప్రయత్నం మొదలైనవి.

నాయమాత్మా బలహీనేన లభ్యః అని ముండకోపనిషత్తు స్పష్టం చేస్తున్నది.

ఆత్మ బలహీనులచేత పొందబడేది కాదు అని. బలహీనుడు, బద్ధకస్తుడు, పట్టుదలలేని వాడు, ఉత్సాహంలేనివాడు తన స్వరూపాన్ని తెలుసుకొని అందులో నిలవటానికి అర్హుడుకాదు.

మాహం బ్రహ్మనిరాకుర్యాం :- ఉపనిషత్తులలో వర్ణించబడిన-ప్రతిపాదించబడిన బ్రహ్మమును ఈ ప్రపంచంలో చూడగలగాలంటే మన మనోబుద్ధులు నిర్మలంగా స్వచ్ఛంగా శాంతంగా సూక్ష్మంగా ఉండాలి. ఎందుకంటే మనోబుద్ధులు పైపై నామరూపాలను చూడటానికి అలవాటు పడ్డాయేగాని, ఈ నామరూపాలకు ఆవల ఉన్న సూక్ష్మాతిసూక్ష్మమై, నిరాకారమై, నిర్గుణమైయున్న అపరిమితతత్త్వాన్ని- సత్యాన్ని చూడలేవు. అందుకే అవి సూక్ష్మం కావాలి. పైపైన కనిపించే ఆకారాలను రూపాలను నామాలను చూసి అసలు తత్త్వమైన- అసలు సారమైన ఆత్మను- బ్రహ్మాన్ని వదిలేస్తే మనం బ్రహ్మమును నిరాకరించినట్లే. నిజంగా మనం ఇప్పుడు చేస్తున్నది అదే. మనం పైపై రూపాలను చూస్తాం. లేదా మనోబుద్ధు లెలాంటి వో చూస్తాం. కాని వీటన్నింటికి ఆధారము అధిష్ఠానము అయిన ఆత్మను దర్శించలేకపోతున్నాం. శరీరమనోబుద్ధులు అనాత్మ. వీటికి ఆధారమైన సత్యం ఆత్మ. ఈ ఆత్మ అనాత్మల కలయికే జీవుడు. మనం జీవుణ్ణి అనాత్మగా చూస్తున్నాం. ఆత్మను పట్టించుకోవటంలేదు. అదే నిరాకరణం. అట్టి నిరాకరణం చేయకూడదని బ్రహ్మాన్ని నిరాకరించకుండా ఉండాలనే కోరికను వ్యక్తం చేస్తున్నాం ఈ మంత్రంలో.

మామా బ్రహ్మనిరాకరోత్ : మనం బ్రహ్మాన్ని నిరాకరించకుండా ఉండాలంటే, ఈ ప్రపంచం అంతటా ఉన్న ఆ బ్రహ్మాన్ని దర్శించాలంటే మనకు ఆపరమాత్మ యొక్క అనుగ్రహం కావాలి. ఆయన తనను తాను దాచుకుంటే మనను

నిరాకరించినట్లే. నిజంగా ఆయన ఈ నామరూపాల మాటున దాగి ఉన్నాడు. ఆయన అనుగ్రహం మనపై ఉంటే మనం ఈ అనిత్యమైన, మిథ్యయైన నామరూపాలను తొలగించి ఆ బ్రహ్మమును దర్శించగలం. ఆయన అనుగ్రహంకలగాలంటే నన్ను నిరాకరించవద్దని వినయంతో ప్రార్థించాలి. భగవంతుని అనుగ్రహంకొరకు తీవ్రంగా తపించాలి. గురువు అనుగ్రహాన్ని పొంది, శాస్త్ర హృదయాన్ని గ్రహించినప్పుడే భగవంతుని అనుగ్రహం సిద్ధిస్తుంది.

అనిరాకరణం అస్తు అనిరాకరణం మే అస్తు : నాలో నిరాకరణం లేకుండుగాక, నాకు నిరాకరణం లేకుండుగాక ! అని ఆర్తితో ప్రార్థించాలి. మనం గనక ఈ నామరూపాల ఆకర్షణలో పడిపోయినట్లైతే బ్రహ్మాన్ని దర్శించేయోగ్యత లేకుండా పోతుంది. అలా బ్రహ్మాన్ని నేను నిరాకరించకుండా ఉండాలి. మనం సినిమా చూస్తున్నంత సేపు, ఆ కథలో మైమరచి పోయినంతకాలం, సినిమాకు ఆధారంగా ఉన్న సత్యమైన తెరను దర్శించలేం. అంటే తెరపట్ల మనకు నిరాకరణం ఉన్నట్లు. అలాగే మనం ఈ ప్రాపంచిక వ్యామోహాలలో చిక్కియున్నంతకాలం పరమాత్మను దర్శించలేం. అంటే మనలో నిరాకరణం ఉన్నట్లు. అలాంటి నిరాకరణం లేకుండుగాక! అని వేడికోలు.

అలాగే పరమాత్మ తనను తాను దాచుకొంటే ఆయన మనను నిరాకరించినట్లు. కనుక ఆయన మనను అనుగ్రహించాలి. మనం దర్శించటానికి వీలుగా ఆయన మన మనోబుద్ధులకు శక్తి యుక్తులను ప్రసాదించాలి. అలా ఆయన మనను అనుగ్రహించాలంటే మనం ప్రేమతో, ఆర్తితో నన్ను నిరాకరించవద్దు అని ప్రార్థించాలి. భగవంతుని అనుగ్రహం, మన ప్రయత్నం రెండూ కలసి విజయపథం వైపు నడిపిస్తాయి.

తదాత్మని నిరతేయ ఉపనిషత్సు ధర్మా : తేమయిసంతు - ఆత్మలోనిరంతరము రమించేవానికి ఎట్టి లక్షణాలుండాలో వాటిని ఉపనిషత్తులలో తెలియజేశారు. అట్టి లక్షణాలు గలవారే నిరంతరం అత్మలో రమిస్తూ ఆత్మానందాన్ని పొందగలుగుతారు. కనుక అట్టి లక్షణాలు నాలో నిలకడగా ఉండాలని, నాలో వృద్ధి పొందాలని, శోభించాలని పరితాపంతో ప్రార్థించాలి. అప్పుడే అవి నిలుస్తాయి.

ఓం శాంతిః శాంతిః శాంతిః తాపత్రయాలు శాంతించుగాక !

# ప్రథమ ఖండం

## ప్రథమ మంత్రం

<u>మం</u> ॥ కేనేషితం పతతి ప్రేషితం మనః
కేనప్రాణః ప్రథమః ప్రైతియుక్తః।
కేనేషితాం వాచమిమాం వదన్తి
చక్షుః శ్రోత్రం క ఉ దేవోయునక్తి॥

<u>ప్రతిపదార్థం</u> :- మనః - మనస్సు; కేన - దేనిచేత; ప్రేషితం - పంపబడి, పతతి - (దాని విషయాలపై) పడుతుంది; కేన - ఎవనిచేత; యుక్తః - నియోగింపబడి; ప్రథమః - ముఖ్యమైన; ప్రాణః - ప్రాణం, ప్రైతి - (తన పనులపై) సంచరిస్తుంది; కేన - దేనిచేత; ఈషితామ్ - కోరబడి; ఇమామ్ - ఈ; వాచమ్ - వాక్కు (మాటలు); (మనుష్యాః - మానవులు); వదన్తి - పలుకుతారు?; చక్షుః - కన్ను; శ్రోత్రం - చెవి; ఉ - నిజానికి; కః -ఏ; దేవః - తేజో వంతుడు; యునక్తి - నియమించుతాడు?

<u>భావం</u> : - శిష్యుడు : మనస్సు దాని విషయాలమీద పడేటట్లు ఏది ప్రేరేపిస్తుంది?

దేనిచేత ప్రయోగించబడి ప్రాణం తన పనులను నిర్వర్తిస్తుంది? దేని ఇష్టాన్ని అనుసరించి మానవులు మాటలు పలుకుతారు? నిజంగా ఏ బుద్ధి కళ్లను చెవులను నియమిస్తుంది?

వ్యాఖ్య: - ఉపనిషత్తులోని ప్రధమ మంత్రము శిష్యుని ప్రశ్నతో ప్రారంభమవుతున్నది. భారతీయ వేదాంతం అంతా ప్రశ్నోత్తరాల రూపంలోనే ఉంటుంది. విషయాన్ని ఆజ్ఞాపించి చెప్పినట్లుగాక ; విన్నశ్రోత బాగా అర్థం చేసుకోవాలన్నా, భావాన్ని గ్రహించాలన్నా ఇలా సందేహాలను వ్యక్తం చేస్తూ తెలుసుకోవటం వల్ల ఎంతో ప్రయోజనం ఉన్నది.

ఇందులో శిష్యుడు వేసిన ప్రశ్నను బాగా అర్థం చేసుకుంటే ఈ శిష్యుడు సామాన్యుడు కాదని, తీవ్రముముక్షువని, ఆత్మకన్న అన్యమైన దానిని అభిలషించనివాడని, తీవ్ర వైరాగ్యవంతుడని, ప్రశ్నించి తెలుసుకొనే జిజ్ఞాసగల బుద్ధి శాలియని మనకు అవగత మవుతుంది.

శిష్యుని ప్రశ్న చాలా గాఢమైనదీ గూఢమైనదీ కూడా. ఈ ప్రపంచం ఎలా ఉన్నదీ అని విశ్లేషణ చేసినంతకాలం మన దృష్టి బాహ్యంగా ఉన్నట్లే. అలాగాక ఈ ప్రపంచాన్ని చూసే నేనెవరిని? అని ప్రశ్నించుకున్నామా? ఇక మనం అంతర్ముఖమైనట్లే.

కేనేషితం ప్రేషితం మనః పతితి : - దేని చేత కోరబడి, ప్రేరేపించబడి మనస్సు విషయవస్తువులపైన, విషయభోగాలపైన పడుతున్నది ? అని సూటిగా ఆత్మ విషయాన్ని అడుగుతున్నాడు శిష్యుడు.

అనేక వస్తువులతో, విషయాలతో, భోగాలతోకూడిన ప్రపంచం మన ముందు నిలిచి ఉన్నది. అలా నిలిచి ఉన్న ప్రపంచాన్ని, అందులోని వస్తువులను, విషయాలను,

భోగాలను మనం తెలుసుకుంటున్నాం. ఎలా తెలుసుకుంటున్నాం? ఇంద్రియాల ద్వారా- జ్ఞానేంద్రియాల ద్వారా. కన్ను చూస్తున్నది. ముక్కు వాసన చూస్తున్నది. చెవి వింటున్నది. చర్మం స్పర్శించి తెలుసుకుంటున్నది. నాలుక రుచి చూసి తెలుసుకుంటున్నది. నిజంగా ఈ ఇంద్రియాలను నిరోధిస్తే ఈ విషయాలగురించిన సమాచారం మనస్సుకు చేరదు. దానితో ఈ ప్రపంచం మనను ఏమీ చేయలేదు. కాని ఎల్ల వేళలా ఇంద్రియాలను నిరోధించటం-అంటే కళ్ళు, చెవులు, ముక్కు మూసుకొని ఉండటం సాధ్యమయ్యేపనికాదు. అంతేకాదు బాహ్యంలో అనేక వస్తువులున్నాయి. అయినా మనదృష్టి కొన్నింటి మీదనే పడుతుంది. కొన్నింటినే ఇష్టపడుతున్నది. కొన్నింటినే కోరుకుంటున్నది. ఎందువల్ల ? వాటికి మనకు ఏదో సంబంధం ఉంది. మనకు అంటే, మన మనస్సుకు ఆ వస్తువులకు మధ్య ఏదో సంబంధం ఉంది. మనస్సులో ఒక రకమైన భోగాసక్తి, కోరికలు ఉన్నాయి. ఆ కోరికలకు అనుగుణంగా ఉన్న వస్తువులపైకి, విషయాలపైకి, భోగాల పైకి మనస్సు పరుగులు తీస్తుంది. ఐతే స్వయంగా పరుగులు తీస్తుందా ? లేదు. ఇంద్రియాల ద్వారా పరుగులు తీస్తుంది. ఇంద్రియాలను ప్రేరేపిస్తుంది. కోరుతుంది. అంటే మనస్సు చేతకోరబడి, ప్రేరేపించబడి ఇంద్రియాలు ప్రపంచంలోనికి పరుగులు తీస్తున్నాయి. మరి మనస్సును ఎవరు కోరుతున్నారు అలా పరిగెత్తమని ? ఎవరు ప్రేరేపిస్తున్నారు ? ఇదీ ప్రశ్న.

ఇక్కడ ఈషితం ప్రేషితం అని రెండు పదాలను ప్రయోగించారు. ఎవనిచేత కోరబడి ఎవనిచేత ప్రేరేపించబడి మనస్సు ప్రపంచంపై పడుతున్నది ? అని ప్రశ్న. మనస్సు తనకు తానుగానే విషయ ప్రపంచంలోకి వెళుతున్నదా ? అలా తనకు

తానుగానే వెళ్ళటం లేదు. ఎవరో వెనుకనుండి నెడుతున్నారు. ప్రేరేపిస్తున్నారు.

మనస్సుకు స్వతంత్రం లేదు. స్వేచ్ఛలేదు. ఉన్నట్లైతే ఇష్టంలేని విషయాలలో చిక్కుకోదు. తప్పులు చేయటం, దుఃఖాన్ని అనుభవించటం స్వేచ్ఛ ఉంటే ఎలా జరుగుతుంది ? కనుక ఎవరో వెనుకనుండి నెడుతున్నారు. ఎవరు ?

పంచ భూతాలతో తయారైన ఈ శరీరం జడమైనది. జడమైన ఈ శరీరం కదలాలన్నా పనిచేయాలన్నా, ఇంద్రియాలు వాటి వాటి విధులను నెరవేర్చాలన్నా వీటిని కదిలించే శక్తి ఒకటి కావాలి. అదే ప్రాణశక్తి. ప్రాణం ఉన్నంతకాలమే కన్ను చూస్తుంది. చెవి వింటుంది. కాలు తిరుగుతుంది. వాక్కు పలుకుతుంది, మనస్సు ఆలోచిస్తుంది. ప్రాణం పోయినతర్వాత ఎక్కడి దొంగలు అక్కడే గప్‌చిప్ అన్నట్లు అన్నీ ఆగి పోతున్నాయి. జడమై పోతున్నాయి. మరి ఈ జడమైనదేహం లోనికి ఈ ప్రాణాన్ని ఎవరు పంపారు ? ఎవరి వల్ల ఇది వచ్చిచేరింది ? తల్లి గర్భంలో శరీరం రూపుదిద్దుకొనే ముందే ఈ ప్రాణం వచ్చిచేరింది. ప్రప్రధమంగా ఇది ఎవరి వల్ల వచ్చిచేరింది ? అని ప్రశ్న.

అన్నింటిలోకి సున్నితమైన అవయవం నాలుక. కాని దానికి కత్తి కన్న పదునెక్కువ. కత్తితో శరీరాన్ని కోస్తే కలిగే బాధకన్నా నాలుకతో పలికే పలుకు లక్షరెట్లు పదునైంది. లోకంలో మనకొచ్చే బాధల్లో సగానికి పైగా నోటి దురుసుతనం వల్ల వచ్చేవే. నోటిని నిరోధిస్తే చాలా బాధలు తగ్గుతాయి. కాని మనం ఎంత ప్రయత్నించినా అది ఏదో వాగుతూనే ఉంటుంది. ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతుంది. ఎవరు దానిని ఆడిస్తున్నారు ? ఎవరు ప్రేరేపిస్తున్నారు ?

కన్ను రూపాలను చూస్తుంది. వెంటనే అది ఏమిటో, దాని పేరేమిటో, అది

ఎందుకు పనికి వస్తుందో మనకు స్ఫురిస్తుంది. ఇక చెవి శబ్దాలను వింటుంది. అవి మంచి మాటలో, చెడు మాటలో బుద్ధి విశ్లేషణ చేస్తుంది. అంతేగాదు. చెవితో వినగానే ఆ వస్తువుల రూపాన్ని, ఆ విషయాల స్వరూపాన్ని కన్ను దర్శించగలుగుతుంది. తాజ్‌మహల్ అని వినగానే దాని రూపం కంటిముందు నిలుస్తుంది. చెవిని కంటినీ ఏ దేవుడు నిజంగా జోడిస్తున్నాడు ? ఇదీ శిష్యుని లోతైన ప్రశ్న.

ఈ ప్రశ్నలను బట్టి శిష్యుడు సామాన్యుడు కాదని, ఎంతో ప్రయత్నము చేసినవాడని, ఆత్మను తెలుసుకోవాలనే తపన గలిగిన వాడని తెలుస్తుంది. ఈ ఉపనిషత్ కేన తో ప్రారంభమైంది గనుక ఈ ఉపనిషత్తుకు ఆ పేరు స్థిరపడి పోయింది.

నిజంగా కేన అనే పదంలో ప్రశ్నేకాదు. సమాధానం కూడా ఉన్నది. విష్ణు సహస్రనామాలలో కః అంటే పరమాత్మ అని అర్థం ఉన్నది. అందువల్ల ఎవరిచేత అనే ప్రశ్నతో బాటు పరమాత్మచేతనే అనే సమాధానం కూడా ఈ రెండక్షరాల పదంలో ఇమిడి ఉన్నది.

ఈ ప్రశ్నకు శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడు అయిన గురువుఇచ్చిన సమాధానమే ఈ కేనోపనిషత్తు అంతా -

## ద్వితీయ మంత్రం

<u>మం</u>॥ శ్రోత్రస్య శ్రోత్రం మనసో మనో యద్
వాచో హ వాచం స ఉ ప్రాణస్య ప్రాణః।
చక్షుషశ్చక్షురతిముచ్య ధీరాః
ప్రేత్యాస్మాల్లోకా దమృతా భవన్తి॥

ప్రతిపదార్థం :-  యత్ - ఏదైతే; శ్రోత్రస్య - చెవియొక్క; శ్రోత్రమ్ - చెవియో; మనసః - మనస్సుయొక్క; మనః - మనస్సో; వాచః - వాక్కుయొక్క; హ - నిజంగా; వాచమ్ - వాక్కో; సః - అదే; ఉ - ఇంకా; ప్రాణస్య - ప్రాణంయొక్క; ప్రాణః - ప్రాణమో; చక్షుషః - కన్నుయొక్క, చక్షుః - కన్నో (ఏవం విదిత్వా  ఇలా తెలుసుకుని; అతిముచ్య - వదిలించుకుని; ధీరాః - బుద్ధిమంతులు, అస్మాత్ - ఈ; లోకాత్ - ఇంద్రియ జీవనం నుండి; ప్రేత్య - పైకివచ్చి; అమృతాః - అమరులు; భవన్తి - అవుతారు.

భావం :- ఆచార్యుడు : అది ఆత్మ. దాని శక్తిచేత చెవి వింటుంది. కన్ను చూస్తుంది. జిహ్వ మాట్లాడుతుంది. మనస్సు గ్రహిస్తుంది. ప్రాణాలు పనిచేస్తాయి. బుద్ధిమంతుడు ఆత్మను ఈ ఇంద్రియ వ్యాపారాలనుండి వివక్షిస్తాడు. ఇంద్రియ బద్ధమైన జీవితాన్ని దాటి అమరత్వాన్ని పొందుతాడు.

వ్యాఖ్య:- మొదటి మంత్రములో శిష్యుడు వేసిన ప్రశ్నకు ఈ మంత్రములో గురుదేవుడు సమాధానం ఇస్తున్నాడు. దీనిని బట్టి బ్రహ్మ విద్యను గురుసమ్ముఖంలో కూర్చొని నేర్చుకోవాలి అని తెలుస్తున్నది.

మనస్సు విషయ వస్తువులపై పడటానికి, ముఖ్యప్రాణము చలించటానికి, వాక్కు పలకటానికి, కన్ను చూడటానికి, చెవి వినటానికి ఏది కారణమని- ఏది ప్రేరణ కలిగిస్తున్నదని శిష్యుడు ప్రశ్నించాడు. దీనిని బట్టి ఇవన్నీ స్వతంత్రంగా కదిలేశక్తి లేనివని, జడమైన వీటి వెనుక ఏదో చైతన్య శక్తి ఉండి ఉండాలని శిష్యునికి తెలిసే ఉండాలి. కనుక అదేదో తెలుపమని శిష్యుడు అడుగుతున్నాడు. శిష్యుని ప్రశ్న చాలాలోతైనది. దానికి గురుదేవుని సమాధానం చాలా గూఢంగా ఉన్నది. సమాధానం

సూటిగా లేదు. బాగా మననం చేస్తేనే అర్థంమవుతుంది.

చెవికి చెవిగా, మనస్సుకు మనస్సుగా, వాక్కుకు వాక్కుగా ప్రాణానికి ప్రాణంగా కంటికి కన్నుగా ఆ చైతన్యము ఉన్నదని తెలియజేస్తున్నాడు. చైతన్యం అవ్యక్తమైనది, కంటికి కనిపించేది కాదు. ఇంద్రియ అగోచరం. పైగా అది ఇలా ఉంటుందని నిర్దేశించి చెప్పే వీలులేనిది. అనిర్దేశ్యం. అది అంతటా ఉన్న ఏక-అద్వయ-సత్యవస్తువు. ఇలా అగోచరమై, అచింత్యమై, అనిర్దేశ్యమై, అవ్యక్తమై, అనిర్వాచ్యమైన ఆత్మను - చైతన్యాన్ని నిర్వచించవలసిన క్లిష్టసమస్య గురుదేవుని ముందున్నది. అందుకే ఒక ప్రత్యేకమైన పద్ధతి ద్వారా విషయాన్ని తెలియజేస్తూ శిష్యుని యొక్క మనస్సును దృశ్యవస్తువునుండి దృక్కువైపుకు- ఆధారం వైపుకు- చైతన్యం వైపుకు త్రిప్పుతున్నాడు.

నిజంగా ఉన్నది ఒకే ఒక సత్యవస్తువు. అదే చైతన్యం. అదే పరమాత్మ. మనస్సును ప్రేరేపించేందుకు ఒకరు, ప్రాణం పోసేందుకు మరొకరు, వాక్కుచేత పలికించే వారొకరు, కంటికీ చెవికీ లంకెపెట్టే దేవుడు మరొకరు-ఇందరు లేరు. ఇక్కడకనిపించే అన్నింటికీ కారణమైనది ఆత్మ ఒక్కటే. అన్ని ఇంద్రియ, ప్రాణ, మనోబుద్ధుల వెనుక చైతన్యంగా ఉంటూ అన్నింటిని నడిపించే దివ్యశక్తి ఆత్మ ఒక్కటే.

చెవికి నిజంగా వినే శక్తి ఉన్నదా ? లేదు. చెవి వినుటకు కారణమైన చైతన్యశక్తియే చెవికి చెవిగా ఉన్నది. కన్ను చూడటానికి కారణమైన చైతన్యశక్తియే కంటికి కన్నుగా ఉన్నది. మనస్సు చలించటానికి కారణమైన చైతన్యశక్తియే మనస్సుకు మనస్సుగా ఉన్నది. అంటే జడమైన ఇంద్రియాలకు పనిచేసేశక్తినిస్తున్నది ఆత్మచైతన్యమే.

ఇలా ఇంద్రియాలు - ప్రాణాలు - మనస్సు మొత్తం అన్నీ అనాత్మ అనీ, జడమని తెలుసుకొని, వీటికి చైతన్యం కలిగించే ఆత్మయే అధిష్ఠానవస్తువని గ్రహించి

ఆత్మకారణంగానే ఇవన్నీ చలిస్తున్నాయని తెలుసుకోవాలి. మనస్సుతో ఆలోచించే వాడు, వాక్కుతో మాట్లాడేవాడు, చెవితో వినేవాడు, కంటితో చూచేవాడు అన్నీ ఆత్మయేనని తెలుసుకోవాలి.

మరి ఇంతకీ జీవుడెవరు ? ఈ ఇంద్రియాలను ఉపయోగించుకొనే వాణ్ణే జీవుడంటారు గదా ! ఐనప్పుడు జీవుడు ఆత్మ ఒక్కరేనా ? నిత్యమూ పుడుతూ గిడుతూ బాధలు పడుతూ సంతోషిస్తూ ఉండే జీవుడూ: పుట్టుకలేని, చావులేని, సుఖదుఃఖాలులేని ఆనందస్వరూప ఆత్మ ఒక్కరేనా ?

నిజంగా ఒక్కరే కాని, ఒక్కరుగా ఉండరు. ఈ దేహ, ఇంద్రియ, మనోబుద్ధులతో తాదాత్మ్యం పెట్టుకొని, విషయవస్తువులను పట్టుకొని, సుఖాలకై పరుగులు తీస్తూ, దుఃఖాలను కొనితెచ్చుకొనే వాడు జీవుడు. అతడే ఈ శరీర మనోబుద్ధుల తాదాత్మ్యాన్ని వదలి, ఈ ప్రపంచవిషయాలతో ఏ మాత్రం సంబంధం పెట్టుకోక, అన్నింటిని మనః పూర్వకంగా వదిలి, తాను తానుగా- ఆత్మగా- చైతన్యంగా కేవలంగా ఉండిపోయేవాడు పరమాత్మ. పట్టూ విడుపులలోనే జీవుడికి దేవుడికీ తేడా. అన్నీ పట్టుకున్నవాడు జీవుడు. వదిలిన నాడు అతడే పరమాత్మ. క్షణక్షణం మార్పులుచెందే ప్రపంచాన్ని చూస్తూ, మారిపోయే ఇంద్రియాలలో కూర్చొని మైమరచినవాడు- తన నిజస్వరూపాన్ని మరచిన వాడు తాను కూడా మారుతూ బాధలు పడాలి. అలాగాక వాటితో తాదాత్మ్యాన్ని వదలి ఈ లోకాన్ని దాటిన ధీరులు మృత్యువును అధిగమించి, అమృతత్వాన్ని పొందుతారు. జీవన్ముక్తులై ఆనంద సాగరంలో ఓలలాడుతారు. బిచ్చగాడి వేషం వేసుకున్న భాగ్యవంతుడు తనను తాను మరచి నటించటంలో లీనమైతే అనేకతిట్లూ శాపనార్థాలు పడాలి. అలాగాక నటుడిగా ఎలానటిస్తున్నా, తననుతాను గుర్తెరిగినవాడు-

తాను బిచ్చగాణ్ణికాదు, భాగ్యవంతుడనని ఎరుకగలవాడు అన్ని తిట్లలో శాపనార్థాలలో కూడా హాయిగా నవ్వుకో గలుగుతాడు. జీవుడికి దేవుడికి తేడా ఇదే.

## తృతీయ మంత్రం

<u>మం</u>॥ నతత్ర చక్షుర్గచ్ఛతి నవాగ్ గచ్ఛతి నోమనః।

న విద్మోన విజానీమో యథైత దనుశిష్యాత్ ॥

అన్యదేవ తద్విదితాత్ అథోఅవిదితాదధి

ఇతి శుశ్రుమపూర్వేషాం యేనస్తద్ వ్యాచచక్షిరే॥

<u>ప్రతిపదార్థం</u> :- తత్ర - అక్కడకు; చక్షుః - కన్ను, నగచ్ఛతి - పోజాలదు; నవాక్ - మాటలు (పోజాలవు); న ఉ మనః - మనస్సుకూడ (పోజాలదు); (తత్ -అది); న విద్మః - మాకు తెలియదు; యథా - ఎలాగ; ఏతత్ - దీనిని; అనుశిష్యాత్ - నేర్పించవచ్చునో; (తత్ అపి - అదికూడా); న విజానీమః - మాకు తెలియదు. తత్ - అది; విదితాత్ - తెలిసినదానికంటే; ఏవ - నిశ్చయంగా; అన్యత్ - భిన్నమైనది; అథో - ఆపైన; అవిదితాత్ - తెలియని దానికంటె; అధి - శ్రేష్ఠతరమైనది; యే - ఎవరైతే; నః - మాకు; వ్యాచచక్షిరే - వివరించారో; ఆ; పూర్వేషాం - పూర్వీకులనుండి; ఇతి - ఇలా; శుశ్రుమ - మేం విన్నాం.

<u>భావం</u>:- అక్కడికి కన్ను పోజాలాదు. మాటలుగాని మనస్సుగాని పోలేవు. కాబట్టి మాకు అది తెలియదు. దాన్ని ఎలాగ నేర్పించ వచ్చునో ఆ పద్ధతి కూడా మాకు తెలియదు. నిశ్చయంగా అది తెలసిన దాని కంటె భిన్నమైంది. ఆపై అది తెలియనిదానికంటే అతీతమైంది. దానిని మాకు వివరించిన పూర్వికులనుండి మేం

ఇలా విన్నాం.

వ్యాఖ్య :- ఇంద్రియాలు, ప్రాణాలు, మనస్సు అన్నీ అనాత్మ అని వీటికి చైతన్యాన్నిచ్చేది ఆత్మయని - ఆత్మయే అన్నింటికి ఆధారమని; కంటితోచూచేవాడు, చెవితో వినేవాడు, మనస్సుతో ఆలోచించేవాడు, వాక్కుతో పలికేవాడు ఆత్మయేనని తెలియజెప్పి, అట్టి ఆత్మ ఈ అనాత్మవస్తువులతో తాదాత్మ్యం పెట్టుకొని, మారేవాటిలో కూర్చొని తానూమారేవాడినని, నశించే వాటిలో కూర్చుని తానూ నశించే వాడినని భావిస్తూ జీవుడుగా బాధలు పడుతున్నాడని; మారేవి, నశించేవి ఐన అనాత్మ వస్తువులతో తాదాత్మ్యం విడిచినధీరులే ఆత్మగా- పరమాత్మగా- ఆనంద స్వరూపంగా ఉండిపోగలరని అమృతత్త్వాన్ని అందుకోగలరని క్రిందటి మంత్రంలో తెలుసుకున్నాం.

(అట్టి) ఆత్మను గురించి దాని ఔన్నత్యాన్ని గురించి దానిని అందుకోవటానికి మార్గాలగురించి ఈ మంత్రంలో తెలియజేస్తున్నారు.

ఆత్మను అందుకోవటం ఎంత కష్టమో తెలియజేస్తున్నారు. నతత్రచక్షుర్గచ్ఛతి, నా వాక్గచ్ఛతి, నోమనః అంటే కన్ను అక్కడకు చేరలేదు. వాక్కు చేరలేదు, మనస్సు ఆత్మను చేరలేదు. అంటే కంటితోచూడలేం, వాక్కుతో వర్ణించలేం, మనస్సుతో భావించలేం అని భావం.

ఈ ప్రపంచంలో మనం వస్తువులను కంటితో చూసి తెలుసుకుంటాం. ఇది ఫలానావస్తువు అని. కంటితో చూడలేని వాటిని తెలిసిన వారు వర్ణించి చెబితే విని తెలుసుకుంటాం. ఇక కొన్ని అనుభవాలను కంటితో చూచేవీలులేదు, వాటిని వర్ణించే వీలులేదు. అట్టి వాటిని మన మనస్సుతో అనుభవాన్ని జ్ఞప్తికి తెచ్చుకొని అనుభూతి చెందుతాం. ఒక పెయింటింగ్నో, ఒక శిల్పాన్నో మనం కొంత వరకు వర్ణించిచెబుతాం.

కాని మనకు కలిగిన సంతోషాన్ని దుఃఖాన్ని వర్ణించలేం. అబ్బ ఆసంతోషాన్ని మాటలతో చెప్పలేను అంటాం. కాని దానిని మనం జ్ఞప్తికి తెచ్చుకొని మళ్ళీ మళ్ళీ ఆనందించగలుగుతాం.

అయితే ఈ పద్ధతులేవీ ఆత్మను తెలుసుకోవటానికి పనికి రావు. ఎందుకంటే ఆత్మ స్థూలవస్తువూ కాదు, సూక్ష్మ విషయమూ కాదు, అనుభవంలోని విషయమూ కాదు. అందుకే ఈ పద్ధతులద్వారా ఆత్మను తెలుసుకోలేం. ఆత్మ కంటికీ, వాక్కుకూ, మనస్సుకు వెనకఉండి వీటన్నింటిని నడిపించేది, ప్రకాశింపజేసేది. ఆత్మయొక్క ఆధారంతో చైతన్యంతో పనిచేసే కన్ను, వాక్కు, మనస్సు మొ॥న ఇంద్రియాలు ముందుకు చూడగలుగుతాయేగాని, తమకు ఆధారంగా ఉండి చైతన్యాన్నిచ్చిన ఆత్మను ఎన్నటికీ చూడలేదు.

టార్చిలైటులోని బల్బు బ్యాటరీల సాయంతో అన్నింటిని చూడగలుగుతుందిగాని, తనకు శక్తి నిచ్చిన ఆ బ్యాటరీలను ఎన్నటికీ చూడలేదు. అలాగే జడమైన ఇంద్రియాలు కన్ను, వాక్కు, మనస్సు తమకు శక్తినిచ్చే ఆత్మను చూడలేవు. ఇవి ప్రపంచ విషయాలలో మునిగి పోయి ఉన్నాయి.

యధాఏతత్ అనుశిష్యాత్ నవిజానీమః - ఎలా శిష్యులకు బోధించాలో మాకు తెలియదు.

కళాశాలల్లో విద్యాబోధనకు కొన్ని పద్ధతులుంటాయి. స్థూలమైన వాటిని కొలతలతో తెలియజెపుతారు. సూక్ష్మమైన మనోభావాలను కవిత్వం ద్వారా వర్ణించి తెలియజేస్తారు. ఇక విజ్ఞాన శాస్త్ర విషయాలను ఫార్ములా ల ద్వారా వివరిస్తారు. కాని ఆత్మను గురించి చెప్పటానికి ఈ పద్ధతులేవీ పనికి రావు. నిజంగా తెలుసుకోబడవలసిన

ఆత్మ తెలుసుకొనే నాకన్నా వేరుగా లేదు. కనుకనే తెలుసుకొనే వీలులేదు. అందుకే న విద్మః అంటున్నారు. (మాకు తెలియదు అని). వెలుగుతున్న అగ్నిని మరొకటి ప్రకాశింపజేయలేనట్లు, అన్నింటిని తగులబెట్టే అగ్నిని మరొకటి తగులబెట్టలేనట్లు అన్నింటిని తెలుసుకొనే ఆత్మను మరొకటి తెలుసుకోలేదు- అని శంకరాచార్యుల వారు తమ భాష్యంలో తెలియజేశారు.

మరి ఎలాగూ తెలుసుకొనే వీలులేని ఆత్మను గురించి శిష్యులకు ఎలా బోధించాలి ? వారు ఎలా అర్థం చేసుకోవాలి? కళాశాలల్లో విద్యాబోధన చేసినట్లు చేసేవీలులేదు కదా! ఏ ఇంద్రియాలకు అందని ఆత్మను ఎలా వర్ణించి చెప్పాలి ? అందుకే ఎలా బోధించాలో మాకు తెలియదు - నవిజానీమః అంటున్నారు. తెలియనిదానిని ఎలాగో తెలుసుకోవాలి గదా. మరి ఎలా?

ఆత్మను తెలుసుకొనుటకు మన దగ్గరున్న పరికరాలలో ఉత్తమమైనది మనస్సే. కనుక ఎలాగైనా ఆ మనస్సుతోనే ముందుకు పోవాలి. దారిదొరకనిచోట ఎలాగో యుక్తితో బయట పడాలి. అందుకే గురువు మనను ముందుకు నడిపించే ప్రయత్నం చేస్తున్నాడు. నాయనా! కంటిద్వారా చూడటానికి వీలులేని, వాక్కుద్వారా వర్ణించ వీలులేని, మనస్సు ద్వారా ఆలోచించుటకు వీలుపడని ఆత్మను తెలుసుకొనుటకు నేను కొన్ని ఉపాయాలు తెలియజేస్తున్నాను. వాటిని ఆధారంగా చేసుకొని ముందుకు వెళ్ళు. ప్రత్యక్ష ప్రమాణాలకు అందని ఆత్మను శబ్ద ప్రమాణం ద్వారా వేదాలు అందించటం జరిగింది. అందుకే ఆత్మ నిగమ వచన సిద్ధం అన్నారు. అట్టి వేదం ఆత్మను ఇలా నిర్వచించినది ''తత్ విదితాత్ అన్యదేవ - అధః అవిదితాత్ అధిః.'' అంటే -అది తెలిసిన దానికన్న వేరైనది మరియు తెలియని దానికన్న అధికమైనది.

ఇంద్రియమనోబుద్ధుల స్థాయిలో ఆత్మ తెలియబడేది కానందున ఆత్మ తెలిసిన దానికన్న వేరైనది. సమస్త వస్తు జాలము, విషయములు- ఇంద్రియాలకు మనస్సుకు తెలుస్తాయి. ఇలా తెలిసే వాని కన్న ఆత్మవేరైనది. తెలిసిన వాటికన్నా వేరైనది అనగానే అది తెలియనిదేమో అనే సందేహం కలగ వచ్చు. అందుకే తెలియనిదీకాదు. తెలియని దాని కన్న అధికమైనది అంటున్నారు. తెలియటం తెలియకపోవటం అనేవి బుద్ధిలో సమాచారం ఉందా లేదా ? అన్నదాన్ని బట్టి నిర్ణయం అవుతుంది. కాని ఆత్మ బుద్ధికి అతీతం. ఇలా తెలిసినదీకాని తెలియనిదీకాని ఆత్మను- బ్రహ్మాన్ని బాహ్య ప్రమాణాల ద్వారా ఋజువు చేయలేం. తర్కం ద్వారా స్థిరపరచలేం. మరి ఎలా? దేనికీ అందని ఆత్మ గురూపదేశం ద్వారా మాత్రమే అవగతం. గురువు చేసే బోధ ద్వారా మాత్రమే మనం ఆత్మను చేరగలం- ఆత్మగా అనుభూతిచెందగలం. ఆత్మానుభూతి చెందటానికి తగిన ఉపదేశాలు గురుపరంపరలోనే లభిస్తాయి.

అలాగని వారి గురువులు వారికి తెలిపినట్లు ఋషి తెలియజేస్తున్నాడు. అందుకే అంటున్నారు ఇతిశుశ్రుమ పూర్వేషాం ఏనస్తద్వ్యాచచక్షిరే- దీనిని గురించి-ఆత్మను గురించి పూర్వం మాకు ఎవరైతే బోధించారో ఆ గురువులనుండి మేము విన్నాము. అంటే ఆత్మను గురించి- బ్రహ్మమును గురించి-స్వస్వరూపజ్ఞానమును గురించి గురువుల ద్వారా గ్రహించాల్సిందే. వేద ప్రమాణాన్ని అనుసరించి ఆత్మజ్ఞానాన్ని పొందాల్సిందే తప్ప చర్చల ద్వారా గాని, తర్కం ద్వారా గాని, కంటితో చూచిగాని, వర్ణిస్తుంటే వినిగాని, మనస్సుతో ఆలోచించిగాని తెలుసుకోవటం అసాధ్యం.

ఇంద్రియాలు మనస్సు ఆత్మ చైతన్యంతో అనాత్మను గురించి తెలుసుకోగలవే గాని ఆత్మను ఎన్నటికీ తెలుసుకోలేవు. ఇంద్రియాలద్వారా మనస్సు ద్వారా

తెలియబడేది బ్రహ్మము కాదు.

ఐతే ఈ లోకంలో ఎవరైనా ఆత్మను గురించి ఉపన్యాసాల ద్వారా వింటారు. గ్రంథాలను అధ్యయనం చెయ్యటంద్వారా తెలుసుకుంటారు గదా. ఆ బ్రహ్మమును ఇంద్రియాల ద్వారా పూజిస్తారు గదా. మనస్సుద్వారా ఉపాసనలు చేస్తారు గదా. వాక్కుద్వారా స్తోత్ర పాఠాలు చదువుతారు గదా. ఈ పద్ధతుల ద్వారా ఆత్మను తెలుసుకోలేక పోతే ఇవన్నీ వ్యర్థమేగదా! అనే శంకరావచ్చు. ఇవన్నీ ఆత్మను పొందటానికి డైరక్టుగా సహకరించవు. కాని మన మనస్సును అంతర్ముఖం చెయ్యటానికి సహకరిస్తాయి. ఈ ఉపాసనలద్వారా తెలుసుకొనేది చూచేది బ్రహ్మాన్ని కాదు. పరమాత్మను కాదు అని రాబోయే 5 మంత్రాల ద్వారా తెలియజేస్తున్నారు.

## చతుర్థమంత్రము

<u>మం</u>॥ యత్ వాచా నభ్యుదితం యేన వాగభ్యుద్యతే।
తదేవ బ్రహ్మత్వం విద్ధి నేదం యదిద ముపాసతే॥

<u>ప్రతిపదార్థం</u>: - యత్ - ఏదైతే, వాచా - మాటలచేత; అనభ్యుదితమ్ - ప్రకటింపబడజాలదో, యేన - దేనిచేత; వాక్ - మాటలు; అభ్యుద్యతే - ప్రకటింపబడుతాయో; తత్ ఏవ - అది మాత్రమే; బ్రహ్మ - బ్రహ్మం (అని); త్వమ్ - నీవు; విద్ధి - తెలసుకో; యత్ - ఏదైతే; ఇదమ్ - ఈ (లోకః - జనులు); ఉపాసతే - పూజిస్తూ ఉన్నారో; ఇదమ్ - ఇది; న - కాదు.

<u>భావం</u>:-మాటలు దేన్ని ప్రకటించలేవో మాటలనే ఏది ప్రకటిస్తుందో అది మాత్రమే

బ్రహ్మం అనీ, ఈ ప్రజలు పూజించేది బ్రహ్మము కాదనీ తెలుసుకో.

వ్యాఖ్య:- ఈ లోకంలో పరమాత్మ ఉపాసనకు అనేక మార్గాలున్నాయి 1. కొందరు ఎదురుగా ఒక విగ్రహాన్ని పెట్టుకొని స్తోత్ర పాఠాలు, అష్టోత్తరాలు , సహస్రనామాలు పఠిస్తూ ఉంటారు. లేదా పరమాత్మ తత్త్వం గురించి చక్కగా వివరించి చెబుతారు, ఉపన్యాసాలిస్తారు. 2. మరొక రకం వారు మౌనంగా పరమాత్మ గురించి విచారణ చేయటమో నామ జపమో చేస్తూ ఉంటారు. 3. మరికొందరు పరమాత్మ దివ్య స్వరూపాన్ని ఆపాదమస్తకం తన్మయంతో తిలకిస్తూ ఉంటారు. 4. కొందరు పరమాత్మను గురించి చెప్పే వాక్యాలను వింటూ ఆతత్త్వాన్ని గ్రహించేందుకు ప్రయత్నిస్తారు. 5. కొందరు ప్రాణంతో కదలాడే మహాత్ములను పెద్దలను గురువులను దర్శిస్తూ, పూజిస్తూ ఉంటారు. ఇవన్నీ సక్రమంగా ఆచరిస్తే పరమాత్మను తెలుసుకొనేందుకు ఉపకరించే సాధనాలు అవుతాయేగాని అవే పరమాత్మ కాదు. ఇవి మార్గములేగాని లక్ష్యం కాదు. ఈ మార్గాలన్నీ చివరకు లక్ష్యంలో విలీనమై పోతాయి. ఇదే సమస్త సాధనల యొక్క, ఉపాసనల యొక్క ఆశయం-ఉద్దేశం.

వాక్కు ద్వారా అనేక స్తోత్ర పాఠాలు వల్లిస్తాం, పారాయణలు చేస్తాం, కథలు కథలుగా పరమాత్మను గురించి చెప్పుకుంటాం. అసలు నిరాకార పరమాత్మ తత్త్వాన్ని గురించి శాస్త్ర విషయాలను బోధిస్తుంటాం. ఇవన్నీ వాక్కుద్వారా వెల్లడి అయ్యే విషయాలు. వాక్కు నిజంగా పరిమితమైనది. అది అనాత్మను గురించి వెల్లడించగలదేగాని పరమాత్మను వెల్లడించలేదు. తనకు తెలిసిన విషయాలను మాత్రమే వాక్కు వెల్లడి చేస్తుంది. అసలు ఏ విషయాలనైనా వాక్కు వెల్లడిచేస్తున్నదీ అంటే అది అంతా వాక్కు వెనుక ఉన్న ఆత్మచైతన్యం కారణంగానే. ఆత్మచైతన్యం వల్లనే వాక్కు పలుక గలుగుతున్నది. అట్టి వాక్కు తనకు చైతన్యాన్నిచ్చే ఆత్మను

పలుకలేదు.

ఆత్మ వల్ల నడిచే వాక్కు ఆత్మను గూర్చి ఎలా నిర్వచించగలుగుతుంది ? పరిమితమైన వాక్కు అపరిమిత తత్వాన్ని ఎలా తెలియజేయగలుగుతుంది? కనుక వాక్కుతో పలికే స్తోత్రపాఠాలు, ప్రార్ధనలు, పారాయణలు, ఉపన్యాసాలు అన్నీ కూడా బ్రహ్మము కాదు. పరమాత్మకాదు. అయితే బ్రహ్మమును చేరుటకు మార్గములవుతాయి. మరి బ్రహ్మము ఎవరు ? తదేవ బ్రహ్మ త్వం విద్ధి యత్ ఇదం ఉపాసతే ఇదం న- అదియే బ్రహ్మము అని నీవు తెలుసుకో. ఏది ఇది అని ఉపాసించబడుతున్నతో ఇది బ్రహ్మము కాదు- అని అంటున్నారు. అంటే వాక్కుద్వారా పలికిన పలుకులేవీ బ్రహ్మము కాదు. వాక్కు అలాపలకటానికి కారణమైనది- ఆధారమైనది ఏదో అది మాత్రమే బ్రహ్మము అని నీవు తెలుసుకో అంటున్నాడు ఉపనిషత్ ఋషి.

దీనితో మన దృష్టి పలికే పలుకుల వైపు కాకుండా అలా పలకటానికి కారణమైన వాక్కు వెనకాల ఉన్న బ్రహ్మము వైపుకు మన దృష్టి మళ్ళాలి. అంతర్ముఖం కావాలి. బహిర్ముఖం అయినంత కాలం బ్రహ్మానికి దూరంగా వెళ్తాం.

వాక్కుతో పరమాత్మను తెలుప వీలులేదు అనటంతో ఇక పరమాత్మను గూర్చి పలకటం మాట్లాడటం చెప్పటం వ్యర్థం అని భావించరాదు. ఎప్పటికైనా వాక్కుకు వెనకాల ఉన్న అనంత సత్యం వైపుకు దృష్టి అంతర్ముఖం కావాలి అని తెలుసుకోవాలి. మార్గాన్ని పట్టుకో కుండా గమ్యాన్ని చేరలేం గదా ! అలాగని మార్గమే గమ్యమని భావించి అక్కడే నిలిచి పోరాదు. మార్గంలో  ప్రయాణించి గమ్యం చేరాలి.

# పంచమమంత్రం

మం॥ యన్మనసాన మనుతే యేనాహుర్మనో మతమ్।
తదేవ బ్రహ్మత్వం విద్ధినేదం యదిద ముపాసతే॥

ప్రతిపదార్థం: - మనసా - మనస్సుచేత; యత్ - ఏది, న మనుతే - గ్రహించబడదో; యేన - దేనిచేత; మనః - మనస్సు; మతమ్ - గ్రహించబడుతుందో; (బ్రహ్మవిదః - ఋషులు) ఆహుః - చెపుతారో తత్ ఏవ = అదియే, బ్రహ్మ=బ్రహ్మము అని, త్వం విద్ధి =నీవు తెలుసుకో, యత్=దేనిని, ఇదం=ఇక్కడ, ఉపాసతే=ఉపాసిస్తారో, ఇదం న=ఇది బ్రహ్మముకాదు.

భావం:- మనస్సుచేత గ్రహించ శక్యం కానిదీ, ఐతే దేనిచేత మనస్సు గ్రహింపబడు తున్నదో అది మాత్రమే బ్రహ్మం అనీ, ఈ జనులు ఇక్కడ పూజించేది ఇది కాదనీ తెలుసుకో.

వ్యాఖ్య:- భగవంతుని ఉపాసనను కొందరు మనస్సుద్వారా చేస్తారు. పరమాత్మ తత్త్వాన్ని విచారణ చేసుకుంటారు. లేదా శాస్త్రాలలో చెప్పిన విషయాలను మళ్ళీ మళ్ళీ మననం చేస్తూ ఆ పరమాత్మను తెలుసుకొనుటకు ప్రయత్నిస్తారు. అయితే మనస్సు బ్రహ్మమును తెలుసుకోగలదా? లేదు. ఎందువల్ల? బ్రహ్మము వల్లనే మనస్సు ఆలోచనలు చేస్తుంది. మనస్సేమో జడం. దానికి స్వయంగా ఆలోచించే శక్తిలేదు. అది ఆలోచన చేస్తున్నదీ అంటే దాని వెనక ఉన్న బ్రహ్మము వల్లనే. తనకు శక్తి నిచ్చే ఆ బ్రహ్మమును మనస్సు ఎన్నటికీ తెలుసుకోలేదు.

బ్రహ్మమును గురించి ఆలోచించటం వేరు. బ్రహ్మమును తెలుకోవటం వేరు. మనస్సు ఆలోచించగలదు కాని తెలుసుకోలేదు. ఆలోచనలు సాగుతున్నంతకాలం

బ్రహ్మానికి దూరంగా మనస్సు పోతున్నట్లు. ఆలోచనలు ఆగిపోతే బ్రహ్మము తెలిసిపోతుంది. బ్రహ్మమును గురించి ఆలోచిస్తున్నంతకాలం మనస్సు చలిస్తూనే ఉంటుంది. ఆలోచనలు ఆగిపోతే తానే బ్రహ్మము అని తెలిసిపోతుంది. ఆలోచనలు ఆగినపుడు మనస్సుకు వెనకాల ఉన్న బ్రహ్మమే తానుగా తెలిసిపోతుంది.

తదేవ బ్రహ్మ త్వం విద్ధి-అదియే బ్రహ్మము అని నీవు తెలుసుకో. మనస్సు ద్వారా సాగించిన ఆలోచనలు బ్రహ్మము కాదు. మనస్సు ఆలోచించటానికి కారణమైనది, ఆధారమైనది ఏదో అది మాత్రమే బ్రహ్మము. దీనితో మనదృష్టి మనస్సు చేసే ఆలోచనల నుండి, ఈ ఆలోచనలు కదలటానికి కారణమైన, మనస్సు వెనకాల ఉన్న బ్రహ్మము వైపుకు మన దృష్టి అంతర్ముఖ మవుతుంది. ఆలోచనల వెంటపడ్డంత కాలం బ్రహ్మానికి దూరమై పోతూనే ఉంటాం. ఆలోచనలు ఆగితే బ్రహ్మము బట్టబయలు - "భ్రాంతులుడిగిన బ్రహ్మంబు బట్టబయలు."

## షష్ఠమంత్రం

<u>మం॥</u> యచ్చక్షుషా న పశ్యతియే న చక్షూంషి పశ్యతి।
తదేవ బ్రహ్మత్వం విద్ధి నేదం యదిద ముపాసతే॥

<u>ప్రతిపదార్థం</u> :- యత్ - దేనినైతే; చక్షుషా - కన్నులచేత; న పశ్యతి - (మానవుడు) చూడడో; యేన - దేనిచేత; చక్షూంషి - కన్నులను; పశ్యతి - చూస్తాడో; (మిగతా ఐదవ మంత్రంలో లాగనే)

<u>భావం</u> :- దృషి చూడజాలనిది, కాని దృష్టిని చూచేది - అది మాత్రమే బ్రహ్మం అనీ, ఈ జనులు ఇక్కడ పూజించేది ఇదికాదనీ తెలుసుకో.

వ్యాఖ్య:-  మరి కొందరు భగవంతుని ఉపాసను ఒక విగ్రహాన్ని ముందుంచుకొనో, ఒక పఠాన్ని పెట్టుకొనో చేస్తారు. అంటే ఒక రూపాన్ని దర్శిస్తూ చేస్తారు. ఇలా చేయటంలో ఆ విగ్రహమే పరమాత్మ అనే భావం అనుకోకుండానే వచ్చేస్తుంది. ఆ విగ్రహాన్ని భగవంతునిగా భావించి సేవలు చేస్తారు. ఇలాంటి భావం వస్తుందనో ఏమో ! భగవంతుని విగ్రహం ముందుకు వెళ్ళగానే నమస్కారం పెట్టడానికి రెండు చేతులు జోడించటంతో బాటు రెండు కన్నులు మూసుకుంటాం. ఎందుకు ? నిజంగా భగవంతుడు ఆ విగ్రహం కాదు. ఆయన నీలోనే ఉన్నాడు. కనుల్ కన్నుల ముందున్న విగ్రహాన్ని గాక నీలోనే ఉన్న ఆ పరమాత్మ తత్వాన్ని తెలుసుకోవటానికి - గ్రహించటానికి కన్నులు మూసుకొని బుద్ధిని తెరువు అని చెప్పటమే.  (జ్ఞాననేత్రాన్ని)

మనం కొలిచే రూపమే పరమాత్మయనే నమ్మకం ప్రబలటంతో కొన్ని రూపాలను ద్వేషించే స్థితి కూడా వస్తుంది. మూఢత్వం పెరిగిపోతున్నది. నిజంగా పరమాత్మకు ఆకారంలేదు. రూపంలేదు. అది నిరాకారం. నిరాకార తత్త్వాన్ని కన్నులు చూడలేవు గనుక కన్నులు చూడగల రూపాన్ని కన్నుల ముందుంచుకొని ఉపాసన చెయ్యటం ఒక ఉపాయంగా మనకు పురాణాలలో సూచించారు. కాని ఎల్లకాలం అదే పట్టుకు ప్రాకులాడ కూడదు. మనం నదిని దాటటానికి పడవను ఏర్పాటు చేశారు. కాని ఎల్లకాలం ఆ పడవను మనతో తీసుక వెళ్ళాలనుకోరాదు. నది దాటేంత వరకే దాని అవసరం. అలాగే నిరాకార నిర్గుణ పరమాత్మ తత్త్వాన్ని గ్రహించేంత వరకే ఈ సాకారోపాసన చెయ్యాలి గాని అదే లక్ష్యంగా చెయ్యరాదు. నీ దృష్టి విగ్రహం మీద నుండి నిరాకార పరమాత్మ వైపుకు మళ్ళాలి. అలా మళ్ళటానికే కొన్ని పండగ సాంప్రదాయాలు.

వినాయకచవితినాడు నిరాకారమైన మట్టికి ఒక ఆకారం కల్పిస్తాం. ఆ విగ్రహాన్ని పత్రితో పూజిస్తాం, మరునాడు జల్దిలో కలుపుతాం. ఎందుకు ? నిరాకార తత్త్వాన్ని సాకారం చేసి పూజించి, తిరిగి నిరాకారంగా మార్చేందుకే. నిరాకారమే నిత్యం, సత్యం.

అందుకే ఇక్కడ ఉపనిషత్ ఋషి స్పష్టంగా చెబుతున్నారు. ఈ రూపాలు విగ్రహాలు ఆకారాలు బ్రహ్మము అని భ్రమసిపోతావేమో ఇవేవీ బ్రహ్మము కాదు. తదేవ బ్రహ్మ - అదియే బ్రహ్మ అని చెబుతున్నారు. ఏది బ్రహ్మం?

దేనిని కన్నులు చూడలేవో దేని ప్రభావం వల్ల కన్నులు చూడగలుగుతున్నాయో అదే బ్రహ్మము. అంటే కంటితో చూడగలిగేది ఏదీ బ్రహ్మము కాదు. కాని కన్ను అలా చూడటానికి కావలసిన శక్తిని, చైతన్యాన్ని ఇచ్చేది ఏదో అదియే బ్రహ్మము.

దీనిని బట్టి ఎవరైనా నేను నా కళ్ళతో భగవంతుణ్ణి చూచాను అంటే అది పచ్చి అబద్ధమని అలా ఎవ్వరూ చూడజాలరని, ఒక వేళ అలా చూశాము అంటే ఆ చూసినది బ్రహ్మమును - పరమాత్మను కాదని స్పష్టంగా అర్థమై పోతుంది. భగవంతుణ్ణి నాకు చూపించు అనే నాస్తికులు గాని, భగవంతుణ్ణి చూపిస్తాను అని చెప్పే ఆస్తికులు గాని ఇద్దరూ మూర్ఖ శిఖామణులే. రూపం ఉంటే పరిమితమై పోతుంది. పరిమితమైనది నాశనమైపోతుంది. నాశనమయ్యేది పరమాత్మ ఎలా అవుతుంది ?

ఇలా మనం కంటితో చూచేది పరమాత్మ కాదని చూడటానికి కావలసిన శక్తిని కంటికి ఇచ్చేదే పరమాత్మయని తెలుసుకోవటంతో మన దృష్టి కంటి ముందున్న వస్తువుపైకి కాక కంటి వెనుక నున్న ఆత్మ వైపుకు మరలుతుంది. అలా దృష్టి అంతర్ముఖమైతే మనం పరమాత్మను సమీపించినట్లే. పరమాత్మకు దగ్గరైనట్లే. అలాగాక రూపాల వెంట పరుగులు తీస్తున్నంత కాలం మనం పరమాత్మకు దూరమై పోతున్నట్లే.

# సప్తమ మంత్రం

<u>మం౹౹</u> యచ్ఛ్రోత్రేణ న శృణోతి యేన శ్రోత్రమిదం శ్రుతమ్।
తదేవ బ్రహ్మత్వం విద్ధి నేదం యదిద ముపాసతే॥

<u>ప్రతిపదార్థం</u> :- యత్ - దేనిని; శ్రోత్రేణ - చెవిద్వారా; నశృణోతి - (మానవుడు) వినజాలడో, యేన - దేనిచేత; ఇదం - ఈ; శ్రోత్రం - వినికిడి; శ్రుతం - వినబడుతుందో (గ్రహించబడుతుందో) (మిగతా ఐదవ మంత్రంలో లాగనే)

<u>భావం</u> :- మానవుడు చెవిద్వారా వినజాలనిదీ, దేనిచేత వినికిడి గ్రహించ బడుతున్నదో - అది మాత్రమే బ్రహ్మం అనీ, ఈ జనులు ఇక్కడ పూజించేది ఇది కాదనీ తెలుసుకో

<u>వ్యాఖ్య</u>:- చెవి శబ్దాలను గ్రహిస్తుంది. పరమాత్మకు చెందిన అనేక విషయాలను ఉపన్యాసాల రూపంలో వింటూ ఉంటాం. అంతమాత్రాన ఆ విషయాలు పరమాత్మ కాదు. బ్రహ్మము కాదు. వినే విషయాలన్నీ అనాత్మకు చెందినవి. కనుక వినే విషయాలు పరమాత్మ కాదు. ఆ విషయాలను చెవి వినగలుగుతున్నది అంటే దానికి కారణం ఏమిటి? అదే చైతన్యం. ఆత్మ చైతన్యం. ఆత్మ చైతన్యం వల్లనే చెవి దేనినైనా వినగలుగుతున్నది. ఆ ఆత్మచైతన్యమే బ్రహ్మం. తదేవ బ్రహ్మ త్వం విద్ధి - అదియే బ్రహ్మము. కనుక చెవిద్వారా వినేది ఏదీ బ్రహ్మము కాదు. చెవి అలా వినటానికి తగిన శక్తిని, చైతన్యాన్ని ఇచ్చేది ఏదో అదే బ్రహ్మము అని తెలుసుకో.

చెవిచేత వినగలిగేది చెవికన్న అల్పమైన దానినే. కాని బ్రహ్మము చెవికే చైతన్యానిచ్చే గొప్ప వస్తువు. శ్రేష్ఠవస్తువు. తనకు చైతన్యాన్నిచ్చే ఆ శ్రేష్ఠవస్తువును చెవి వినలేదు.

భగవంతుని నామాలుగా చెప్పబడేవిగాని, పరమాత్మ తత్వాన్ని గూర్చి వర్ణించే ఉపనిషత్ పదాలుగాని, శ్రుతులు గాని ఇవి ఉపాసనలో భాగమే గాని అవి బ్రహ్మము కాదు. కానీ శ్రుతులను, ఉపనిషత్తులను, ఆత్మ జ్ఞానాన్ని వినటం ద్వారా అనేక సూక్ష్మ విషయాలను గ్రహించి దాని ద్వారా సూక్ష్మాతి సూక్ష్మ ఆత్మను గ్రహించే వీలవుతుంది. అందుకోసం శ్రుతివాక్యాలను, ఉపనిషత్ వాక్యాలను, సాధనారీతులను విని తెలుసుకోవాలి. నిరంతరము మన దృష్టిని విన్న విషయాల మీద గాక అలా వినటానికి శక్తి నిచ్చిన చైతన్యంపై ఉంచాలి. అంతర్ముఖం చేయాలి. ఇలా నిరంతరము దృష్టిని బాహ్యం నుండి మరలించి అంతర్ముఖంచేసి ఆత్మకు దగ్గరకావాలి.

## అష్టమ మంత్రం

<u>మం</u>॥ యత్ప్రాణేన నప్రాణితి యేన ప్రాణః ప్రణీయతే।

తదేవబ్రహ్మత్వం విద్ధి నేదం యదిదముపాసతే ॥

<u>ప్రతిపదార్థం</u> :- యత్=ఏది; ప్రాణేన=ప్రాణముచేత; నప్రాణితి=జీవించదో; యేన=దేనివల్ల; ప్రాణః=ప్రాణం, ప్రణీయతే=శ్వాసిస్తుందో; తత్ఏవ=అదియే; బ్రహ=బ్రహ్మము; త్వం విద్ధి=నీవుతెలుసుకో, ఇదం=ఇక్కడ; యత్ ఉపాసతే=ఏది ఉపాసించబడుతున్నదో; ఇదం న=ఇది కాదు.

<u>భావం</u>:- ఏది ప్రాణం వల్ల జీవించదో, దేనివల్ల ప్రాణం శ్వాసిస్తున్నదో అదే బ్రహ్మము. ఇక్కడ ఏది ఉపాసించబడుతున్నదో అది బ్రహ్మము కాదని తెలుసుకో.

<u>వ్యాఖ్య</u>:- రూపాలు కదలాలంటే ప్రాణం ఉండాలి. ప్రాణం ఉన్నదని ఎప్పుడంటాం?

ముక్కు శ్వాసించగలిగితే ప్రాణం ఉన్నది అంటాం. ఇలా శ్వాసించగలిగే వన్నీ ప్రాణంతోఉన్నట్లే. ప్రాణంతో ఉన్న వన్నీ కదులుతూ జీవనక్రియలు సాగిస్తూ ఉంటాయి. ఐతే ఈ రూపాలన్నింటికీ ప్రాణం ఉండాలి. కాని పరమాత్మకు ప్రాణం అక్కరలేదు. ప్రాణానికి ప్రాణం ఆయన. అంటే ప్రాణం కూడా జడమే. ఆ ప్రాణానికి శక్తి నిచ్చేది పరమాత్మ.

మనం ప్రాణంతో కదిలాడే రూపాలను చూస్తూ ఉంటాం. అందులో కొందరిని మహాత్ములని, గురువులని పూజిస్తూ ఉంటాం. అలాగే ప్రాణంతో ఉన్న చెట్లను, గోవులను, పాములను కూడా పూజిస్తూ ఉంటాం. నిజంగా ఇవన్నీ ఉపాసనలో భాగం మాత్రమే. ప్రాణానికి అతీతమైన శక్తియే పరమాత్మ. ప్రాణానికి ప్రాణం పోసేదే పరమాత్మ.

మనం ప్రాణంతో ఉన్న జీవులను చూస్తుంటాం. మన దృష్టి వాటి ఆకారం మీద, అందచందాల మీద గాక, వాటి యొక్క కదలికలమీద ఉండాలి. ప్రాణం ఉండబట్టి కదా కదులుతున్నది. ప్రాణం లేకపోతే కదలాడవు గదా అని చూడాలి. ఆ ప్రాణానికి ఆ శక్తి ఎలా వచ్చింది ? అని ప్రశ్నించుకోవాలి. దానితో దృష్టి అంతర్ముఖమై ప్రాణానికి ప్రాణమైన ఆత్మ వైపుకు తిరుగుతుంది. ఈ అంతర్ముఖ దృష్టి లేనంతకాలం-బాహ్యంగా చూస్తున్నంత కాలం మనం బ్రహ్మానికి దూరమైనట్లే.

ఏది ప్రాణం వల్ల జీవించదో దేని వల్ల ప్రాణం కదులుతుందో అదే బ్రహ్మము. అంటే ప్రాణంతో ఉన్నదేదీ బ్రహ్మం కాదు. ప్రాణానికి ఆధారమైనదే బ్రహ్మం. ప్రాణంతో ఉన్నవన్నీ ఉపాసనకు అనుకూలమైనవే.

ఇక్కడితో మొదటి అధ్యాయం ముగిసింది. ఆత్మను వాక్కుద్వారా గాని, మనస్సు

ద్వారాగాని, కంటిద్వారా గాని, చెవిద్వారా గాని, ప్రాణం ద్వారాగాని తెలుసుకోలేమని, చూడలేమని; ఈ ఇంద్రియాలు, మనస్సు ఎలా పనిచేస్తున్నవో గ్రహించినప్పుడు, అవి పనిచేయటానికి కావలసిన శక్తి ఎక్కడి నుండో వస్తున్నదని, ఆ శక్తియే ఆత్మయని- పరమాత్మయని, తెలుస్తుంది. అది అంతటా సర్వవ్యాపకమై ఉన్నది. కనుక ఆయా ఇంద్రియాల వెనక మనస్సు వెనక ఉండి వాటికి శక్తి నిస్తున్నదని తెలుసున్నది. ఇక్కడ కంటితో చూచేది గాని, చెవితో వినేదిగాని, వాక్కుద్వారా పలికేదిగాని, మనస్సుతో భావించేది గాని, ప్రాణంతో కదిలేది గాని బ్రహ్మము కాదని, అవన్నీ ఉపాసనకు అనుగుణమైనవేనని: వాక్కు పలకటానికి, చెవి వినటానికి, కన్ను చూడటానికి, మనస్సు భావించటానికి, ప్రాణం కదలటానికి కారణమైనది- ఆధారమైనది ఆత్మయని- బ్రహ్మమని- తదేవ బ్రహ్మ అని చెప్పారు.

దీనితో ఇంద్రియాలను, మనస్సును ప్రేరేపించి బయటకు పంపేది ఎవరు ? అన్న శిష్యుని ప్రశ్నకు సమాధానంగా ఇంద్రియాలను మనస్సును వాడుకొనేవాడు, వాటి వ్యాపారాలను తెలుసుకొనేవాడు, వాటికి వెనకాల ఉండి శక్తినిచ్చేవాడు సర్వమూ బ్రహ్మమేనని చెప్పటం జరిగింది.

అంతా తానే అయిన ఈ బ్రహ్మము ఎవరి వల్ల తెలుసుకోబడుతుంది ? కేన? అనే మరో ప్రశ్నకు సమాధానం రెండవ అధ్యాయంలో ఇవ్వబడుతున్నది.

## ద్వితీయఖండం

### ప్రథమ మంత్రం

<u>మం</u>॥ యది మన్యసే సువేదేతి దభ్రమేవాపి

నూనం త్వం వేత్థ బ్రహ్మణో రూపమ్।

యదస్యత్వం యదస్య దేవేష్వథను

మీ మాంస్య మేవతే మన్యే విదితమ్॥

<u>ప్రతిపదార్థం</u> :- యది - ఒకవేళ, సువేద ఇతి - నాకు బాగా తెలుసును అని; మన్యసే - అనుకున్నట్లయితే; నూనం - నిశ్చయంగా; త్వం - నీవు; దభ్రమ్ ఏవ - చాలా కొంచెం మాత్రమే; ఆపి - బహుశా; బ్రహ్మణః - బ్రహ్మం యొక్క; రూపమ్ - రూపం; వేత్థ - తెలుసుకున్నావు; త్వమ్ - నీవు; (భూతేషు - ప్రాణులలో) అస్య - ఈ బ్రహ్మం యొక్క, యత్ - ఏ; రూపమ్ - రూపం; వేత్థ - తెలుసుకున్నావో; అపిచ - ఆపైన, దేవేషు - దేవతలలో; అస్య - దానియొక్క; యత్ - ఏ; (రూపమ్ - రూపం; వేత్థ - తెలుసుకున్నావో) (తత్ సర్వం అల్పమేవ - నిజంగా అదంతా చాలా కొంచెమే) అథను - అందుచేత ఇక; తే - నీకు; (బ్రహ్మ - బ్రహ్మం); మీ మాంస్యమ్ ఏవ - తెలుసుకోవలసిన విషయమే; విదితం - (నాకు బ్రహ్మం) తెలిసిందని; మన్యే - అనుకుంటూన్నాను.

<u>భావం</u> :- ఆచార్యుడు : నేను బ్రహ్మాన్నిగూర్చి బాగానే తెలుసుకున్నాను అని ఒకవేళ అనుకున్నట్లయితే నువ్వు తెలుసుకుంది చాలా అల్పం; ఎందుకంటే నీవు చూచే ప్రాణులలో, దేవతలలో పరిచ్ఛిన్నమైన బ్రహ్మం రూపం చాలా స్వల్పం. కాబట్టి బ్రహ్మాన్ని గూర్చి నువ్వు ఇంకా విచారించవలసి ఉంది.

శిష్యుడు : (మళ్లా చింతనచేసి బ్రహ్మం సాక్షాత్కరించుకొని) బ్రహ్మం తెలుసుననే అనుకుంటున్నాను.

<u>వ్యాఖ్య</u>:- దేని చేత కోరబడి లేదా ప్రేరేపించబడి మనస్సు విషయ ప్రపంచంలోనికి దూకుతున్నది ? ప్రాణానికి, కంటికి, వాక్కుకు చెవికి ఏది ఆధారము ? అని శిష్యుడు ప్రశ్నించాడు. దానికి సమాధానంగా గురువు అది (ఆత్మ) చెవికి చెవిగా, కంటికి

కన్నుగా , ప్రాణానికి ప్రాణంగా , మనస్సుకు మనస్సుగా ఉన్నదంటూ ఉపదేశం ప్రారంభించాడు. దానిని వాక్కుద్వారా గాని, మనస్సు ద్వారాగాని, కంటిద్వారాగాని, చెవిద్వారాగాని తెలుసుకోలేమని, చూడలేమని, వినలేమని- ఇవన్నీ- ఈ ఇంద్రియాలన్నీ పనిచేయటానికి ఆధారమైనది, కారణమైనది ఏదో అదే ఆత్మయని, అది అంతటా వ్యాపించి యున్న సూక్ష్మాతి సూక్ష్మ చైతన్యమని తెలియజేశారు. ఇక్కడ కంటితో చూచేది గాని, చెవితో వినేదిగాని వాక్కుద్వారా పలికేదిగాని, మనస్సుతో భావించేది గాని, ప్రాణంతో కదిలేది గాని ఆత్మకాదని- బ్రహ్మము కాదని, ఇవన్నీ ఉపాసనకు అనుగుణమైనవేనని, అయితే కన్ను చూడగలగటానికి, చెవి వినగలగటానికి, వాక్కు పలకగలగటానికి, మనస్సు భావించగలగటానికి ఆధారమైనది, కారణమైనది, శక్తి నిచ్చేది ఆత్మ లేక బ్రహ్మము అని చెప్పారు. తదేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం యదిద ముపాసతే అని స్పష్టం చేశారు.

పురాతన గురుకులాలలో గురుశిష్యుల మధ్య జరిగే వేదాంతగోష్ఠి ఎలా ఉంటుందో మన కన్నుల ముందు ప్రత్యక్షం చేస్తున్నదీ మంత్రం. ఒక్కసారి ఈ మంత్రాన్ని పరిశీలించబోయే ముందు అప్పటి ఆ దృశ్యాన్ని మన కన్నులముందు ప్రత్యక్షం చేసుకోవాలి. అలా చేద్దాం. అప్పుడే ఈ ద్వితీయఖండం అవగతమౌతుంది.

అది ఒక సుందర ప్రశాంత వనవాటిక. దూరంగా ఒక అందమైన పర్ణ కుటీరం. సమీపంలో ఒక చెట్టునీడన అరుగు. దానిపై ప్రశాంత వదనంతో శ్రోత్రియుడు, ఆత్మ నిష్ఠుడు, కరుణా సముద్రుడు ఐన గురువు. ఆయనకు సమీపంలో క్రిందుగా కొద్దిమంది శిష్యులు తమతమ స్థానాలలో ఆశీనులై అత్యంత భక్తి శ్రద్ధలతో, వినయవిధేయతలతో, గురుబోధను ఆలకిస్తున్నారు. బోధ పూర్తి కాగానే ప్రతిరోజూ

శిష్యులు తమ తమ స్థానాలకు వెళ్ళి ఆ బోధను మననం చేసుకుంటూ నిధిద్యాసన చేస్తారు. వారిలో వారు చర్చించుకుంటారు. ఎవరికి వారు ఆత్మ విచారణ గావించుకుంటారు. మరునాటి బోధకోసం మరల శిష్యులు గురువు దరిచేరి వారి వారి స్థానాలలో కూర్చుంటారు.

అయితే ఇంత వరకు ఇంద్రియాల ద్వారా వ్యక్తమయ్యేది కాదు ఆత్మ. అది ఇంద్రియాల కదలికలకు వృత్తులకు ఆధారమైనచైతన్యము; అదే తనలో ఉన్న సూక్ష్మాతి సూక్ష్మ చైతన్యము అని తెలుసుకొని, నిధిధ్యాసన చేసి తాను ఆత్మనని స్పష్టంగా గ్రహించిన ఒక శిష్యుని ముఖంలో పరిపూర్ణమైన సంతృప్తి కనిపిస్తున్నది. ఏదైనా అనుకున్నది సాధించినప్పుడు ముఖంలో సంతృప్తి కనిపిస్తుంది. విజయదరహాసం మెరుస్తుంటుంది. అలాంటి సంతృప్తిని ఒక శిష్యుని ముఖంలో స్పష్టంగా గ్రహించాడు గురువు. అట్టి సంతృప్తిని గమనిస్తే సాధారణంగా ఏ గురువైనా ఆనందంతో పొంగిపోతాడు. తన బోధ సఫలమైనందుకు, తనను ఆశ్రయించిన శిష్యుడు కృత కృత్యుడైనందుకు గురువు ఎంతో ఆనందిస్తాడు.

ఐతే ఈ ఉపనిషత్తులోని గురువు కేవలం శ్రోత్రియుడు బ్రహ్మనిష్ఠుడే గాదు, మనస్సులు చదవటంలో కూడా ఉద్ధండుడని గ్రహించవచ్చు. శిష్యులయొక్క మంచిచెడ్డలను మనోభావాలను పట్టించుకొనే అతి జాగ్రత్త పరుడు కూడా. శిష్యుని ముఖంలోని ప్రసన్నతను జూచి అతడు నిజంగా పూర్ణ జ్ఞానాన్ని పొందాడా ? లేక మధ్యలో కలిగిన కొద్దిపాటి అనుభవంతో సంతృప్తి చెంది సాధన ఆపివేస్తున్నాడా ? అతడు బుద్ధితో విషయాన్ని గ్రహించి ఆనందిస్తున్నాడా ? లేక బుద్ధికి అతీతంగా ఆత్మానుభూతిని పొందాడా ? అనే సంశయం గురువులో కలిగింది. ఈ సంశయంకలగ

గానే భయం వేసింది గురువుకు. అందుకే శిష్యుని స్థితిని తాను పూర్తిగ తెలుసుకోవాలనుకున్నాడు. శిష్యునిది పరోక్ష జ్ఞానమో? అనుభవ జ్ఞానమో తెలుసుకోవాలనుకున్నాడు. అందుకే సూచన ఇస్తున్నాడు గురువు.

'యది మన్యసే సువేద ఇతి- ఒక వేళ నీవు బాగా తెలిసినది అని అనుకుంటున్నావేమో నిజంగా అతి స్వల్ప మైనదే తెలుసుకున్నావు అని శిష్యుని ఆత్మపరిశీలన చేసుకొనేట్లు సూచననిస్తున్నాడు.

బ్రహ్మము నిజంగా తెలియబడే వస్తువుకాదు. ఎందుకంటే అది నీకన్నా వేరుగా నున్న వస్తువుకాదు. తనకన్నా అన్యంగా దేనిని దర్శించినా అది తనను పరిమితంచేస్తుంది. పరిమితమైన తాను బ్రహ్మము అయ్యేవీలు లేదు.

నీ కన్నా వేరుగా నున్న దానిని నీ దృష్టి పథంనుండి తొలగించుకొనేంతవరకు ఆత్మానుభవం కలగదు. బ్రహ్మమును తెలుసుకున్నాను అన్నట్లుగా శిష్యుని ముఖం ప్రసన్నంగా ఉన్నది. అయితే అది అనుభూతియా ? లేక బుద్ధితో గ్రహించిన జ్ఞానమా?

పరమాత్మ సూక్ష్మాతి సూక్ష్మము, సర్వవ్యాపకము అని గ్రహించాడు శిష్యుడు. అన్ని ఇంద్రియాలకు శక్తినిస్తూ ఆ యింద్రియాల, మనోబుద్ధుల వెనుక ఆత్మ చైతన్యం ఉన్నదని కూడా ఇప్పటికే గ్రహించాడు. కనుక ఆ పరమాత్మ నా దేహంలో, అన్ని ఇంద్రియాల వెనుక ఉన్నట్లు నిశ్చయానికొచ్చాడు.

నాలో ఆత్మ ఉన్నది అని బుద్ధితో తెలుసుకుంటే అది ఆత్మానుభూతి కాదు. అది కొద్దిపాటి జ్ఞానమే. అలాగే కంటికి వెనక ఉండి చూచేందుకు శక్తినిచ్చేది ఆత్మయని, మనస్సుకు వెనక ఉండి ఆలోచించేందుకు శక్తి నిచ్చేది ఆత్మయని, చెవికి వెనక ఉండి వినేందుకు శక్తి నిచ్చేది ఆత్మయని, ఇలా ఇంద్రియాలకు వెనుక ఉండి అవి

వాటి వాటి పనులు చేయటానికి శక్తి నిచ్చేది ఆత్మయని బుద్ధితో తెలుసుకున్నంత మాత్రాన చాలదు. అది కొద్ది పాటి జ్ఞానమే. బుద్ధిని అధిగమించి అనంతమైన ఆత్మ విచారణ సాగాలి. ఇదే గురువు సూచిస్తున్నాడు. నీవు బుద్ధి ద్వారా గ్రహిస్తే చాలదు. నీవే బ్రహ్మము అనే ఏకత్వాను భూతి కలగాలి. అప్పటిదాకా విచారణ సాగాలి అని సూచిస్తూ దానికి మార్గాన్ని తెలియజేస్తున్నాడు.

అధను మీమాంస్యం ఏవ - ఇంకా నీవు విచారణ చేయవలసినదే. కేవలం శాస్త్రాన్ని శ్రద్ధతో శ్రవణం చేసి అర్ధం చేసుకుంటే చాలదు. మననం చేసి బుద్ధితో నిశ్చయం చేసుకుంటే చాలదు. విచారణ చేసి నిధిధ్యాసన చేసి ఆత్మయే నేనని అనుభూతి చెందాలి. మనస్సుగా బుద్ధిగా కాకుండా ఆత్మగా ఉండిపోవాలి. అప్పుడే పరిపూర్ణత.

గురువాక్యాన్ని విన్న శిష్యుడు తిరిగి ఏకాంతానికి వెళ్ళాడు. శుద్ధమైన, నిర్మలమైన మనస్సుతో గురువుయొక్క ఉపదేశాన్ని విచారణ చేశాడు. తాను బ్రహ్మముననే అనుభూతిలో నిలిచాడు. తిరిగి గురుదేవుని సమీపించి మన్యేవిదితం- నాకు తెలిసినదనే అనుకుంటున్నాను- అని వినయంతో పలికాడు.ఇంకా అంటున్నాడు. ఏమని?

## ద్వితీయమంత్రం

మం॥ నాహం మన్యే సువేదేతి నో న వేదేతి వేద చ।

యోనస్తత్ వేద తద్వేదనో న వేదేతి వేద చ॥ 2

ప్రతిపదార్థం :- అహం - నేను; సువేద - బాగా తెలుసును; ఇతి - అని, నమన్యే - అనుకోను; నవేద - తెలియదు; ఇతి - అని, న - కాదు, వేదచ - తెలుసుకూడా; నః - మనలో, యః - ఎవరు; తత్ - దానిని; వేద - తెలుసుకున్నాడో; తత్ - దానిని (ఆ బ్రహ్మమును) వేద - తెలుసుకున్నాడు, నః=మాలో, నవేద ఇతి=తెలియదు అన్నాడో; వేదచ=(అతడుకూడా) తెలుసుకున్నాడు.

భావం :- నాకు బాగా తెలుసును అని నేను అనుకోను. నాకు తెలియదు అని కూడా కాదు. తెలుసుకూడా. మనలో తెలుసునన్నవాడికీ అది తెలుసు. తెలియదన్నవాడికీ తెలుసు.

వ్యాఖ్య:- గురువు సూచించిన విషయాలను చక్కగా మననం చేసి, విచారణచేసి గురుదేవులను సమీపించి నాకు తెలుసుననే అనుకుంటున్నాను అని శిష్యుడు చెప్పగానే అది కేవల పరోక్ష జ్ఞానమో లేక అనుభవజ్ఞానమో అనే శంక గురుదేవుల ముఖంలో ప్రస్ఫుటమైనది. నీవింకా విచారణ చేయవలసినదే అని చెప్పినప్పటికీ శిష్యుడు నేను తెలుసుననే అనుకుంటున్నాను అంటున్నాడు ఏమిటా? అనే సందేహం గురుదేవుల ముఖంలో కనిపించటంతోనే శిష్యుడు తన అనుభవాన్ని ఇంకా స్పష్టంగా తెలియజేయాలనుకున్నాడు. అందుకే అహం సువేద ఇతి న మన్యే- నేను బాగా తెలుసుకున్నాను అని అనుకోవటం లేదు అన్నాడు. ఈ మాట వినగానే గురువులో ఆశ్చర్యం వ్యక్తమైంది. ఇంతకాలం శాస్త్రాన్ని చక్కగా విని, అర్థం చేసుకున్న శిష్యుడు నాకు తెలియదు అంటున్నాడేమిటి ? ఇప్పుడేగదా ! మన్యే విదితం- నాకు తెలుసుననే అనుకుంటున్నాను అన్నది!

గురువు యొక్క సంశయాత్మక మైన చూపులను గమనించినశిష్యుడు వెంటనే

అంటున్నాడు; అంటే తెలియదనికాదు తెలుసుకూడాను.

ఇలా పరస్పర విరుద్ధమైన వాక్యాలతో శిష్యుడు ఎందుకు మాట్లాడుతున్నాడు?

శిష్యునిలో కలిగిన జ్ఞానము బుద్ధిద్వారా తెలుసుకున్నదా అనుభవంద్వారా తెలుసుకున్నదా ? అని గురువుకు గలిగిన సందేహాన్ని తీర్చాలనుకున్నాడు శిష్యుడు. తనకు కలిగిన జ్ఞానం అనుభవంద్వారా పొందినదేగాని, బుద్ధి ద్వారా తెలుసుకున్నది కాదని చెప్పాలని ప్రయత్నం.

ఆత్మను గురించి బుద్ధి ద్వారా తెలుసుకోవటానికి, అనుభూతి చెందటానికి తేడా ఉన్నది. బుద్ధి బయటి విషయాలను తెలుసుకొని జ్ఞానం సంపాదించుకుంటుంది. అయితే ఆత్మ బయటి విషయం కాదు. అది బుద్ధికి లోపలది. బుద్ధికి అతీతమైనది. బుద్ధికే చైతన్యాన్నిచ్చేది ఆత్మ. ఆత్మవల్లనే బుద్ధిపనిచేసి అన్నింటిని తెలుసుకుంటుంది. అందువల్ల తనకు శక్తినిచ్చే ఆత్మను  మాత్రం బుద్ధి ఎన్నటికీ తెలుసుకోలేదు. కనుక తెలుసును అనే పదం వాడరాదు.

మరి తెలుసును అనే పదం వాడకుండా, ఆత్మానుభవాన్ని తెలియజేసేదెలా?

అందుకే శిష్యుడు ఇక్కడ పరస్పర విరుద్ధ పదాలను వాడి నాకు కలిగిన అనుభవం బుద్ధికి సంబంధించినది కాదు, బుద్ధికతీతమైన ఆత్మానుభవమే అని గురువుకు నివేదిస్తున్నాడు.

నాకు తెలుసు ననే అనుకుంటున్నాను. (బుద్ధి ద్వారా అనుకుంటావేమో..)

నాకు బాగా తెలుసునని అనుకోవటం లేదు. (బుద్ధిద్వారా తెలియటం కాదు)

అలాగని తెలియదని కాదు. తెలుసుకూడాను. (ఆత్మానుభవం కాదనుకుంటా వేమో) (ఆత్మానుభవమే)

తెలుసును తెలియదు అనే పదాలకు ప్రాధాన్యత లేదని చెప్పటానికి మాలో తెలుసునన్న వాడికీ తెలుసును తెలియదన్నవాడికీ తెలుసును అంటున్నాడు. బ్రహ్మతత్వం వాక్కుకు అతీతమైనది. అందువల్ల పరస్పర విరుద్ధ వాక్యాల ద్వారానే వ్యక్తం చేయాల్సివచ్చింది. దీనిని అన్వయ వ్యతిరేక పద్ధతి (Analytic and synthetic reasoning) అంటారు.

బ్రహ్మము తెలియబడేది కాదు. తెలుసుకొనే నీవు వేరుగా లేవు. అది నీ స్వరూపమే అయినందున నాకు తెలుసు అనే వీలు లేదు. తెలియదు అని చెప్పే వీలూ లేదు. అంటే బ్రహ్మము వస్తువులలాగా తెలుసు తెలియదు అని చెప్పటానికి వీలులేదు. ఒక విషయం నీకు తెలుసో తెలియదో ఎలా చెబుతావు ? ఆ విషయం గురించిన సమాచారం నీ బుద్ధిలో ఉంటే తెలుసు అంటావు. ఒక వేళ ఆ సమాచారం నీ బుద్ధిలో లేకపోతే తెలియదు అంటావు. మరి బ్రహ్మము వస్తువుల లాగా విషయాలలాగా బుద్ధికి తెలిసేదీ కాదు. తెలియనిదీ కాదు. అందుకే తెలుసు-తెలియదు అనే రెండు పదాలను వాడింది. అన్నింటిని తెలుసుకొనేది ఆత్మ. ఆత్మను తెలుసుకొనే మరొకటి ఏదీ లేదు. కనుక తెలుసునన్నా తెలియదన్నా తేడా ఏమిలేదు. అనుభవం ఉంటే సరి. అందుకే మాలో తెలుసునన్న వాడికీ తెలుసు. తెలియదన్న వాడికీ తెలుసు అని చెప్పి తనకు కలిగినది ఆత్మానుభవమే అని స్పష్టం చేశాడు శిష్యుడు.

## తృతీయమంత్రం

<u>మం</u>॥ యస్యామతం తస్య మతం మతం యస్య న వేద సః।

అవిజ్ఞాతం విజానతాం విజ్ఞాతమవిజానతామ్॥

ప్రతిపదార్థం :- (బ్రహ్మ - బ్రహ్మం); యస్య - ఎవనికి; అమతమ్ - తెలియదో; తస్య - అతనికి; మతమ్ - తెలుసును; యస్య - ఎవనికి; మతమ్ - తెలుసునో; సః - అతడు, న వేద - తెలుసుకోలేదు; (యస్మాత్ - ఎందుకంటే) విజానతాం - తెలిసినవారికి; (పండితులకు) (బ్రహ్మ - బ్రహ్మం) అవిజ్ఞాతం - తెలియదు; అవిజానతాం - అజ్ఞానులకు (తెలియని వారికి); విజ్ఞాతం - తెలిసినది.

భావం:- తెలియదన్నవాడికి తెలుసును. తెలుసన్నవాడికి అది తెలియదు. విజ్ఞానవంతులకు అది తెలియదు. అజ్ఞానులకు అది తెలుసు.

వ్యాఖ్య:- శిష్యుని యొక్క పలుకులను బట్టి అతనికి పరిపూర్ణ అనుభవం కలిగినదని; మాటలకందరాని మహాసత్యాన్ని పరస్పర విరుద్ధ పదాల ద్వారా తెలియజేస్తున్నాడని గ్రహించిన గురువు, ఆ శిష్యుని స్థితికి సంతృప్తి చెంది, మిగతా శిష్యులకోసం ఆ శిష్యుని పరిస్థితిని మరొక పద్ధతిలో వివరిస్తున్నాడు.

బ్రహ్మము వాక్కుకు మనస్సుకు అందేది కాదు. అది అవ్యక్తం, అచింత్యం, అనిర్దేశ్యం. అట్టి బ్రహ్మమునకు, ఉపాధిని తగిలించి ఉపాధి సహిత బ్రహ్మమును మాకు తెలుసు అంటుంటారు అజ్ఞానులు. వారికి ఉపాధితో కలిపిచూడటమే తెలుసు. అయితే ఉపాధులన్నీ మిథ్యగనుక, నశించి పోయేవి గనుక బ్రహ్మము ఉపాధి రహితము అని తెలుసుకొని, అట్టి బ్రహ్మము ఇంద్రియాలకు, మనస్సుకు అగోచరం గనుక తెలియదు అంటుంటారు జ్ఞానులు. అంటే మనస్సు ద్వారా తెలుసుకొనే వీలులేదు గనుక, అది అనుభవైక వేద్యం తప్ప మరొక విధంగా గ్రహించలేం గనుక, బుద్ధికి తెలిసేది కాదు గనుక తెలియదు అంటున్నారు. అంటే జ్ఞానులైన వారికి అది తెలియటం లేదు. అజ్ఞానులకు అది చక్కగా తెలియును. అని.

అసలు ఉన్నది బ్రహ్మ మొక్కటే. అదే ప్రపంచంగా భ్రమగొల్పుతున్నది. ఈ ప్రపంచ భ్రమలో ఉన్నంతకాలం బ్రహ్మం తెలిసేది గాదు. ప్రపంచ భ్రమపోతే మిగిలేది బ్రహ్మమే గనుక తెలుసుకొనేందుకు వేరే ఏమీ లేదు. తెలుసుకొనే వాడొకడు వేరే ఉండడు.

ఎవరికైనా ఏదైనా తెలిసిందీ అన్నాడా ? అది అధ్యాస- భ్రమయే తప్ప బ్రహ్మము కానేకాదు.

అసలు తెలుసు తెలియదు అనే మాటలు బుద్ధిస్థాయిలోనివి. ఆత్మస్థాయిలో వాటికి విలువలేదు. ఆత్మగా అనుభవం ఉన్నదా? లేదా? అనేదే ప్రధానం. అనుభవంలో ఉన్నవాడు తెలియదన్నా తెలిసినట్లే. అనుభవంలో లేక బుద్ధితో గ్రహించినవాడు తెలుసన్నా తెలియనట్లే. అందుకే తెలియదన్నవారు దానినెరుగుదురు. తెలుసన్నవారు దానినెరుగరు అని చెప్పటం.

ఆత్మ జ్ఞానాన్ని అనుభవంద్వారా పొందినవాడు ఆత్మయే. ఆత్మయైన తాను అనంతుడు, సర్వవ్యాపకుడు, అద్వయుడు. కనుక రెండవ వస్తువుగోచరించదు.

''యత్రనాన్యత్ పశ్యతి నాన్యత్ శృణోతి నాన్యత్ విజానాతి స భూమా'' (ఛాందోగ్య)

-ఎక్కడ అన్యమైన దానిని చూడడో, అన్యమైనదానిని వినడో, అన్యమైనదానిని తెలుసుకోడో - అదే భూమానందస్థితి.

అట్టి అఖండమైన ఆత్మను తెలుసుకొని అనుభూతి పొందిన జ్ఞాని మనోబుద్ధులను దాటి పోయి ఆత్మగా ఉండిపోతాడు. తాను అనుభవించే ఆనందము మనస్సు ద్వారా గ్రహించేదీ కాదు, వ్యక్తం చేసేదీ కాదు గనుకను, అతడు మనస్సు ద్వారా

చూచేవాడు కాదు గనుకను, మనోస్థాయిని దాటినవాడు గనుకను అతడు తనకు తెలియదు అంటాడు. అలా తెలియదు అన్నా అతడే నిజంగా తెలిసినవాడు. మనోబుద్ధుల ద్వారా ఆత్మను తెలుసుకొన్నవాడు ఆత్మలక్షణాలను గ్రహించి బుద్ధితో విచారణ చేసి నిశ్చయానికి వచ్చినవాడు తెలుసునంటాడు. అలా అన్నాకూడా అతడు నిజంగా తెలియనివాడే. అతడికి తెలిసింది ఆత్మను గురించేగాని అతడు ఆత్మగా అనుభూతి చెందడు. ఆత్మకన్న తనను వేరుగా భావిస్తాడు. కనుక తెలిసింది అన్నా తెలియని వాడే.

అందుకే తెలియదన్న (అజ్ఞానులకు) వానికి తెలుసు. తెలుసన్నవానికి (విజ్ఞానులకు) తెలియదు అని గురువు బోధించటం.

ఇంతకు ముందు అనుభూతి పొందిన శిష్యుడు తెలుసు తెలియదు అని పరస్పర విరుద్ధ వాక్యాలను చెప్పి తనకు కలిగినది ఆత్మాను భూతి యేనని స్పష్టం చేశాడు. తెలుసు తెలియదు అనే పదాలు బుద్ధి స్థాయిలోనివే గాని ఆత్మస్థాయిలోనివి గావని; ఆత్మ లేదా బ్రహ్మము ఒక్కటేనని, అదే తానని, తనకన్న అన్యమైనది మరొకటి లేదని కనుక తాను తెలుసుకోవటానికి తెలుసుకోలేక పోవటానికి వేరే ఏదీ లేదని తెలియజెప్పాడు. దానినే గురువు విడమరచి మిగతా శిష్యులకు అందలి భావాన్ని తెలియజెప్పి వారు కూడా ఎలా ఆత్మను తెలుసుకొని అనుభూతి చెందాలో ఆ ఉపాయాన్ని తెలియజేయబోతున్నారు.

## చతుర్ధమంత్రం

<u>మం</u>॥ ప్రతిబోధవిదితం మత మమృతత్వం హి విన్దతే।
ఆత్మనా విన్దతే వీర్యం విద్యయా విన్దతేఽమృతమ్ ॥

ప్రతిపదార్థం :- ప్రతిబోధ విదితం మతం (యస్య) - ఎవడు అన్ని మనోవికారాల ద్వారానూ దాన్ని స్ఫూర్తి గోచరం చేసుకున్నాడో (సః - అతడు); అమృతత్వం - అమరత్వాన్ని; హి - నిశ్చయంగా; విన్దదే - పొందుతాడు; ఆత్మనా - ఆత్మచేత; వీర్యం - నిజమైన బలం; విన్దతే - లభిస్తుంది; విద్యయా - (పరమాత్మను గూర్చిన) జ్ఞానం ద్వారా; అమృతమ్ - అమరత్వం; విన్దతే - పొందుతాడు.

భావం :- మనస్సుచెందే ప్రతి వికారం ద్వారానూ దాన్ని స్ఫూర్తిగోచరం చేసుకున్నవాడు అమరత్వాన్ని పొందుతాడు. ఆత్మద్వారా అతడు నిజమైన బలాన్ని పొందుతాడు. జ్ఞానం ద్వారా అమరత్వాన్ని పొందుతాడు.

వ్యాఖ్య:- ప్రాపంచిక విషయ వాసనలనుండి మనస్సును పూర్తిగ మళ్ళించలేక వస్తువుల యొక్క, విషయాల యొక్క ఆలోచనలలోనే ఉండి పోయిన శిష్యుల కోసం గురువు ఆత్మజ్ఞానాన్ని, ఆత్మాను భవాన్ని పొందే ఉపాయాన్ని- ఉపాసనా విధానాన్ని తెలియ జేస్తున్నాడీ మంత్రంలో.

ఆత్మ తెలియబడదు అనగానే దానిని తెలుసుకొనే అవకాశం ఎన్నటికీ లేదు అని అర్థం కాదు. కాకపోతే దానిని ప్రత్యక్షంగా తెలుసుకొనే వీలు లేదు అనియేభావం. మనం కంటితో మన ఎదుట నున్న వస్తువును- దృశ్యాన్ని చూస్తున్నట్లుగా ఆత్మను చూడలేం. ఎందుకంటే ఆత్మ నీకన్నా వేరుగా నున్న వస్తువుకాదు, దృశ్యం కాదు. అలాగే ఆత్మను ప్రత్యక్షంగా ఒక శబ్దాన్ని విన్నట్లు వినలేము. ఆత్మను ఒక సంఘటనను భావించినట్లు భావించలేం. అయితే

మనం తెలుసుకొనే ప్రతి విషయజ్ఞానంతోను ఆత్మ తెలియబడుతూనే ఉంటుంది. మనం ఏ వస్తువును చూచినా ఆ చూడటం వెనుక ఆత్మయే ఉన్నది. దేనిని విన్నా ఆ

వినటం వెనుక ఆత్మయే ఉన్నది. మనం ఏ విషయాలను భావించినా ఆ భావనలవెనుక ఆత్మయే ఉన్నది. మనస్సు విషయ వస్తువులమీదకు పరుగెడుతున్నప్పటికీ ఆత్మను తెలుసుకోవటం సాధ్యమే. ప్రతి విషయ జ్ఞానంలోను తెలియబడేది ఆత్మ చైతన్యమే. అయితే మనదృష్టి విషయం మీదకు గాక దానికి ఆధారమైన చైతన్యం మీదకు మళ్ళాలి.

అందుకే ప్రతిబోధ విదితం మతం అమృతత్వం హి విందతే అన్నారు. ప్రతి మనోవృత్తి ద్వారా- ప్రతి విషయ జ్ఞానం ద్వారా ఆత్మ తెలియబడుతుంది. అలా తెలుసుకున్న వాడు ఆత్మనే పొందుతాడు అని.

అక్కడొక పుస్తకం ఉన్నది. దానిని కన్ను చూచింది. అది పుస్తకము అని మనస్సు నిర్ధారించింది. అదే విషయాన్ని వాక్కు ద్వారా చెబుతున్నాం. అది ఒక పుస్తకం అని. పుస్తకం విషయవస్తువు. అది పుస్తకం అని తెలుసుకున్న తెలివి విషయజ్ఞానం. ఈ తెలివి (విషయజ్ఞానం) ఎలా కలిగింది? కన్ను చూచి మనస్సు కు చెబితే. కన్ను ఎలా చూడగలిగింది? కంటికి వెనక ఉన్న చైతన్యం వల్ల కన్ను చూడగలిగింది. అలాగే మనస్సు వెనకనున్న చైతన్యం కన్ను చూపిన వస్తువుపైబడి ఆ వస్తువుతో కలిసి విషయజ్ఞానమైంది. కనుకనే ఆత్మ ప్రతిబోధ విదితం అన్నారు. మనస్సులో వృత్తులు (ఆలోచనలు) కదులుతున్నాయంటే ప్రతివృత్తి వెనుక ఉన్నది ఆత్మచైతన్యమే. ఆత్మచైతన్యం యొక్క ఆధారంతోనే మనోవృత్తులు కదులుతున్నాయి. చైతన్యం లేనివానిలో ఏ వృత్తులు కదలవు. అయితే మనం మనస్సులో కదిలే వృత్తులపై దృష్టినుంచక, ఈ కదిలే వృత్తులు దేని ఆధారంగా కదులుతున్నాయి ? దేని కారణంగా- ఏది ఉండటం వల్ల ఈ వృత్తులు కదులుతున్నాయి ? అని ధ్యానపూరిత హృదయంతో

అవగతం చేసుకొనుటకు ప్రయత్నించాలి. అప్పుడే సత్యం స్పష్టంగా అవగతమౌతుంది.

ఈ మంత్రానికి భాష్యం వ్రాస్తూ శంకరాచార్యుల వారు ఒక చక్కని ఉపమానాన్ని అందరికీ అవగతమయ్యే ఉదాహరణను ఇచ్చి మనకు మార్గం చూపారు. మన దృష్టిని కనిపించే వస్తువుపైనుండి కనిపించని ఆధారంవైపుకు ఎలా మరలించాలో తెలియజేస్తున్నారు.

చెట్టు యొక్క కొమ్మలు, ఆకులు కదిలాడుచున్నాయి. దానిని మనం కంటితో చూచి తెలుసుకుంటున్నాం. అలా అవి కదిలాడుతున్నాయంటే గాలి వీస్తున్నదని మన బుద్ధికి తెలుస్తుంది. అలాగే మనస్సులో వృత్తులు కదిలాడు తున్నాయి. దానిని మనం బుద్ధితో గ్రహించి తెలుసుకుంటున్నాం. అలా వృత్తులు కదిలాడుతున్నాయంటే దానివెనుక ఆత్మకారణమై ఉన్నదని మన బుద్ధికి తెలుస్తుంది.

గాలి- కొమ్మలూ, ఆకులూ కాదు. కాని కొమ్మలు ఆకులు కదలటానికి కారణం గాలి వీచుటయే. కదిలే కొమ్మలు ఆకులు మనకు గాలిని గుర్తు చేస్తున్నాయి. అలాగే ఆత్మ మనోవృత్తులుకాదు. కాని మనోవృత్తులు కదలటానికి కారణం ఆత్మచైతన్యమే. కదిలే మనోవృత్తులు మనకు ఆత్మచైతన్యాన్ని గుర్తు చేస్తున్నాయి. కనుక మనోవృత్తుల కదలికను మనం జాగ్రత్తగా గమనించినట్లైతే వాటికదలికలకు ఆధారమైనదేది ? అని ప్రశ్నించుకొని దాని సమాధానాన్ని రాబడితే అది ఆత్మచైతన్యమే నని తెలిసిపోతుంది. ఇదే ప్రతిబోధ విదితం అంటే.

చెట్టుకొమ్మలు వాటంతటవి కదలాడవు. వాటి కదలికకు స్ఫూర్తి గాలియే. అలాగే వృత్తులు వాటంతటవి కదలవు. వాటి కదలికకు స్ఫూర్తి ఆత్మ చైతన్యమే. కనిపించే సమస్తానికి ఆధారం ఆత్మయే.

వస్తువులుండటం వల్ల ఆత్మ ద్రష్టగా (చూచేవానిగా) తెలుస్తున్నది.

ఆత్మనావిందతేవీర్యం :- ఆత్మవల్లనే బలాన్ని పొందుతాడు.

ఆత్మ శుద్ధమైనది, స్థిరమైనది, నిశ్చలమైనది, నిర్లిప్తమైనది. కేవలసాక్షియైనది. ఈ ఆత్మయే సత్యం. ఇట్టి సత్యజ్ఞానాన్ని పొందితరించాలంటే వ్యక్తి శక్తి వంతుడు కావాలి. ఈ శక్తి కూడా ఆత్మ వల్లనే వస్తున్నది. అందుకే ఆత్మ నా విందతే వీర్యం- ఆత్మ వల్లనే వ్యక్తి శక్తి గలిగిన వాడవుతున్నాడు. మన ప్రతి కదలికా ఆత్మ ఇచ్చే బలం వల్లనే. నిజమైన శక్తి ఆత్మ వల్లనే లభిస్తుంది. అనాత్మ వల్ల లభించే శక్తి అనిత్యమైనది. అట్టి అనిత్యమైన శక్తి నిత్యమైన ఆత్మను పొందేందుకు సహాయపడదు.

విద్యయావిందతేఽమృతం- జ్ఞానం వల్లనే- ఆత్మ జ్ఞానం వల్లనే ఆత్మ లభిస్తుంది. అమృతత్వం లభిస్తుంది.

మన జీవితంలోని ప్రతి కదలికా ఆత్మ మీదనే ఆధారపడి ఉన్నప్పటికీ మనకు ఆత్మను గురించిన జ్ఞానం లేకపోతే ఈమృత సంసారంలో మునిగితేలుతూ ఉండాల్సిందే.

అలాగాకుండా ప్రతి సంఘటన వెనుకా, ప్రతికదలిక వెనుకా, ప్రతి అనుభవం వెనుకా, ప్రతి ఆలోచన వెనుకా, ఆధారంగా ఉన్న ఆత్మను గురించి తెలుసుకుంటూ ఆత్మతో తాదాత్మ్యం చెందుతూ అదే నేను అనే ఆత్మ జ్ఞానంతో ఉన్నప్పుడే ఈ మృత్యురూప సంసారసాగరం నుండి తరించి పోతాం. అమృతత్వాన్ని అందుకుంటాం. ఆత్మగా నిర్లిప్తంగా కేవలంగా ఉండగలిగినపుడే అమృతత్వం.

అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయాఽమృతమశ్నుతే- అని చెప్పిన ఈశావాస్య మంత్రం యొక్క ఆంతర్యం కూడా ఇదే. కనుక జీవిత మంతా ప్రపంచంలోకి పరుగు

లెత్తటం కాక, ఆ పరుగుల వెనుక ఆధారంగా ఉన్న చైతన్యం వైపుకు దృష్టిసారించాలి. ఆ చైతన్యాన్ని తెలుసుకోవాలి. అదే ఆత్మజ్ఞానం.

అట్టి ఆత్మజ్ఞానం వల్లనే అమృతం (మోక్షం). మరి మన కర్తవ్యం ఏమిటి ?

## పంచమ మంత్రం

<u>మం</u>॥ ఇహ చేద వేదీ దథ సత్యమస్తి
న చేదిహావేదీ న్మహతీ వినష్టిః।
భూతేషు భూతేషు విచింత్య ధీరాః
ప్రేత్యాస్మాల్లోకా దమృతా భవన్తి॥

<u>ప్రతిపదార్థం</u> :- ఇహ - ఇక్కడ; అవేదీత్‌చేత్ - తెలుసుకున్నట్లయితే, అథ - ఆపైన; సత్యమ్ - (నిజమైన జీవనం) సత్యం; అస్తి - ఉన్నది; ఇహ - ఇక్కడ; న అవేదీత్‌చేత్ - తెలుసుకోనట్లయితే; (తదా - అప్పుడు); మహతీ - గొప్ప; వినష్టిః - వినాశమే, (తస్మాత్ - అందుచేత); ధీరాః - ప్రజ్ఞావంతులు; భూతేషు భూతేషు - అన్ని జీవాలలో; (ఆత్మ తత్త్వమ్ - ఆత్మను); విచింత్య - సాక్షాత్కరించుకుని, అస్మాత్ లోకాత్ - ఇంద్రియ జీవనం నుండి (లేదా ఈ లోకం నుండి); ప్రేత్య - లేచి (నిష్క్రమించి); అమృతాః - అమరులు; భవన్తి - అవుతారు.

<u>భావం</u> :- ఇక్కడ ఈ ప్రపంచంలో జీవించి ఉండగానే దాన్ని సాక్షాత్కరించుకున్నట్లయితే ఆపైన నిజమైన జీవితం ఉన్నది. ఇక్కడ సాక్షాత్కరించుకోనట్లయితే సర్వనాశనమే. ప్రతి జీవిలోనూ ఆత్మను వివక్షించుకుంటూ ప్రజ్ఞాశాలి ఇంద్రియ జీవనాన్ని

అతిక్రమించి అమరత్వాన్ని పొందుతాడు.

వ్యాఖ్య:- విద్యయా విందతేஉమృతం- ఆత్మజ్ఞానం వల్లనే అమృతత్వసిద్ధి- మోక్షప్రాప్తి. అయితే ఈ మోక్షప్రాప్తిని ఎప్పుడు పొందాలి? ఈ లోకంలో జీవించి ఉండగానే అనుభూతి చెందాలి. బ్రహ్మాను భూతి చెందాలి. నేను బ్రహ్మమునే అనే అనుభూతి చెందాలి. అసలు మానవ జన్మ వచ్చిందే అందుకోసం. అట్టి మానవజన్మను అందుకోసమే ఉపయోగిస్తే సార్థకమైనట్లు. లేకపోతే నిరర్థకమైనట్లే. ఇలా ఈ జన్మలోనే బ్రహ్మాన్ని తెలుసుకొని బ్రహ్మానుభూతి చెందకపోతే ఎంతో నష్టం. మహతీవినష్టిః గొప్పనష్టం.

కనుక బ్రహ్మాన్ని ఈ జన్మలోనే- జీవించి ఉండగానే తెలుసుకోవాలి. ఎలా తెలుసుకోవాలి ? ఎక్కడ దర్శించాలి బ్రహ్మాన్ని ? బ్రహ్మం సూక్ష్మాతి సూక్ష్మమై, సర్వవ్యాపకమై ఉన్నది. అంతటా ఉన్న బ్రహ్మాన్ని దర్శించటానికి ఎక్కడికీ పరుగులెత్తాల్సినపనిలేదు. ఉన్నచోటనే ఉండి దర్శించవచ్చు. అలానే దర్శించాలి. హిరణ్య కశిపుడు విష్ణువుకోసం ఎక్కడెక్కడో వెతికాడు. ముల్లోకాలు గాలించాడు. అయినా ఎక్కడా కనిపించలేదు. చివరకు తనకుమారుని వల్ల తన ఇంటనే స్థంభంలో దర్శించాడు. స్థంభమే దేహం. స్థంభాన్ని బ్రద్దలు గొట్టటమంటే దేహభావాన్ని ఛేదించటమే. హిరణ్యకశిపుని చీల్చివేయటమంటే జీవభావాన్ని చీల్చివేయటమే. ఇక్కడ ప్రహ్లాదుడేభగవంతుని చూపిన గురువు. హిరణ్యకశిపుడే భగవంతుని కొరకు అన్వేషించే శిష్యుడు. భగవంతుడెక్కడ ఉన్నాడు? అని మూర్ఖుడు ప్రశ్నిస్తాడు. భగవంతుడు ఎక్కడలేడు ? అని తెలివిగలవాడు సమాధానమిస్తాడు. భగవంతుని ఎప్పుడు దర్శించాలి ? అనే ప్రశ్న కూడా మూర్ఖత్వంతో కూడుకున్నదే. ఎప్పుడూ అంతటా ఉన్నవాణ్ణి ఇప్పుడే ఇక్కడే దర్శించాలి. ఇదే విజ్ఞత. మోక్షమనేది మరణం తర్వాత

లభించేది గాదు. అన్ని మతాలు మరణించిన తర్వాత వచ్చే అయోమయ ముక్తి గురించే చెబుతుంటాయి. ఉపనిషత్తులజ్ఞానం మాత్రం జీవన్ముక్తిని తెలియజేస్తున్నది.

అట్టి జీవన్ముక్తిని జీవించి ఉండగానే సాక్షాత్కరించుకొన్న వారే తరిస్తారు. వారి జీవితాలే సార్థకం. అలా సాక్షాత్కరించుకోలేనివారు జనన మరణ రూప సంసార సాగరంలో పడిపోయి, మునుగుతూ తేలుతూ ఉంటారేగాని ఒడ్డు చేరరు. తరించరు.

అట్టి జీవన్ముక్తిని ఎలా పొందాలి ? ఎలా సాధించాలి ?  అనే ప్రశ్నకు ఈ మంత్రం రెండవ పాదం సమాధానం ఇస్తున్నది.

భూతేషు భూతేషు విచింత్య ధీరాః- సమస్త భూతాలలోను - మనుష్యులు, పశువులు, పక్షులు, క్రిమికీటకాలు, చెట్లు, చేమలు అన్నింటా అందరియందు గల ఏకమైన ఆత్మను దర్శించాలి.

అందరిలోను ఆత్మను దర్శించు అంటే అందరిలోను ఉన్న ఆత్మను నీవు వేరుగా ఉండి చూడమనికాదు.

అందరిలోను ఉన్న ఆత్మను నేనేనని చూడగలగాలి. లైటులో ఉన్న కరెంటు ఫ్యానులోని కరెంటును, ఫ్రిజ్‌లోని కరెంటును, హీటరులోని కరెంటును తన కన్న వేరుగా చూడరాదు. అన్నింటిలో ఉన్నది నేనే నని చూడాలి. అలా చూడగలిగినప్పుడే అంతటా ఆత్మ తప్ప- నేను తప్ప అన్యమేమీ లేదని గ్రహించగలం. అప్పుడు మాత్రమే నిన్ను నీవు ఆత్మగా చూడగలవు. అందరినీ ఆత్మగా - నీవుగా (నీ స్వరూపంగా) చూడగలవు. అసలు దేనినీ ఎవరినీ చూడకుండా ఆత్మనే చూడు పైపైనామరూపాలను వదలి నిన్ను నీవే చూడు.

నీకు సర్పంగా కనిపిస్తున్నది భ్రమ. అసలు నిజంగా సర్పం లేనే లేదు. అక్కడ

ఉన్నది త్రాడే. మరిసర్పంలోని త్రాడును చూడు అంటే అర్థం ఏమిటి ? సర్పాన్ని, సర్పంలోని త్రాడును చూడమనియా ? కాదు. సర్పాన్ని చూస్తున్నంతకాలం అసలు త్రాడు కనిపించదు. త్రాడును చూస్తున్నావంటే సర్పం అనేది లేనేలేదు. కనుక చూడవలసింది త్రాడును మాత్రమే.

అలాగే ఈ జగత్తు జీవుళ్ళు అంతా భ్రమ. సమస్త భూతాలు భ్రమ. నిజంగాదు. ఉన్నది సర్వవ్యాపక ఆత్మ చైతన్యమే. మరి సమస్త భూతాలలోను ఆత్మను దర్శించు అంటే భూతాలను చూస్తూ అందులోని ఆత్మను చూడమనియా ? కాదు. భూతాలను చూస్తున్నావంటే ఆత్మచైతన్యం కనిపించదు. ఆత్మచైతన్యాన్ని దర్శిస్తే ఇక భూతాలు జగత్తు అనే భ్రమ నశించిపోతుంది. కనుక చూడవలసింది ఆత్మను మాత్రమే. జగత్తు భ్రమ. కనుక మన దృష్టినుండి జగత్తు తొలగాలి.

బొమ్మలనుండి దృష్టి తొలగితేనే సినిమాతెర కనిపించేది. కనుక కేవలం ఆత్మచైతన్యాన్నే దర్శించి, ఆత్మగానే ఉండిపోవాలి.

కాని సామాన్యమానవులు జగత్ భ్రమలో ఉంటారు. నామరూపాల మాయలో ఉంటారు. కనుక ఆత్మను దర్శించలేరు. ధీరులైన వారే ఇక్కడి ప్రాపంచిక విషయ భోగాలనుండి విరక్తి చెంది, నామరూపాలనుండి దృష్టి మరల్చి, లౌకికమైన వాటినన్నింటిని వదలి అమరులౌతారు. వారే ధీరులు.

ధీరులు అని ఎందుకన్నారు ? ధైర్యవంతులు గనుకనే. ఈ ప్రపంచ వ్యామోహాలను ధైర్యంగా విడిచిపెట్ట గలగాలి. ఇవన్నీ నిజంగా విలువలేని వేనని బుద్ధితో గ్రహించి వదలాలి. అజ్ఞానంతో వదిలితే మళ్ళీ పట్టుకుంటావు. అందుకే ధీరులు అన్నారు.

ఇక్కడ చూడవలసినదీ, అనుభవించవలసినదీ ఆనందించవలసినదీ ఏమీలేదని, అంతా స్వప్న తుల్యమైనదని, భ్రమాత్మకమైనదని తెలుసుకొని, స్వేచ్ఛగా ఈ బంధనాలనుండి, ఈలోకం నుండి, ఈ ఆకర్షణల విషవలయం నుండి నిష్క్రమించి అమరులౌతారు. త్యాగేనైకే అమృతత్వమానశు : (కైవల్య)

అన్నీ వదలగలిగినవాడే అమృతత్వానికి అర్హుడు.

ఈ ప్రకారంగా రెండవ అధ్యాయంలో దేని వల్ల ఆత్మను తెలుసుకోవచ్చును ? అనేప్రశ్నకు ఆత్మ ఇంద్రియాలద్వారాగాని, మనోబుద్ధుల ద్వారాగాని తెలియబడేది గాదు. ఆత్మను తెలుసుకునేది ఆత్మయే అని సమాధానం ఇచ్చారు.

ఇంద్రియాలను మనస్సును ప్రేరేపించి బయటి విషయవస్తువులపైకి పంపేదెవరు? కేన? అనే ప్రశ్నకు ఇంద్రియాలను వాడుకొని వాటి వ్యాపారాలను తెలుసుకొనేవాడు, వాటికి వెనకాల ఉండి శక్తినిచ్చేవాడు, అన్నీ పరబ్రహ్మమే అని మొదటి అధ్యాయంలో చెప్పారు.

అంతటా తానే అయిన ఈ బ్రహ్మము ఎవరివల్ల తెలుసుకోబడుతుంది? కేన? అనే మరో ప్రశ్నకు ఆత్మ ఆత్మవల్లనే తెలుసుకోబడుతుంది. బుద్ధి వల్ల తెలుసుకోబడదు- అని రెండవ అధ్యాయంలో చెప్పారు.

అసలు బ్రహ్మన్ని తెలుసుకోవాలనే జిజ్ఞాస దేనివల్ల, ఎవరివల్ల కలుగుతుంది? కేన? అనే మరో ప్రశ్నకు మూడవ అధ్యాయంలో సమాధానం దొరుకుతుంది.

# తృతీయఖండం

## ప్రథమమంత్రం - ద్వితీయమంత్రం

<u>మం</u>॥ బ్రహ్మ హ దేవేభ్యో విజిగ్యే, తస్యహ

బ్రహ్మణో విజయే దేవా అమహీయన్త।

త ఐక్షన్తాస్మాకమేవాయం విజయోఽ

స్మాకమేవాఽయం మహిమేతి॥ 1

<u>ప్రతిపదార్థం</u> :- బ్రహ్మ - బ్రహ్మం; దేవేభ్యః - దేవతలకొరకు; విజిగ్యే - జయం సంపాదించింది; హ - అని కథ; తస్యబ్రహ్మణః - ఆ బ్రహ్మంయొక్క; విజయే - జయంలో; దేవాః - దేవతలు; అమహీయన్త - ఉప్పొంగి పోయారు; తే - వారు; అయమ్ - ఈ; విజయః - జయం, ఏవ - నిజంగా; అస్మాకం - మాదే; ఏవ - నిజంగా; అస్మాకం - మాదే; అయమ్ - ఈ; మహిమా - ఘనత; ఇతి - అని; ఐక్షన్త - అనుకున్నారు.

<u>మం</u>॥ తద్ధైషాం విజజ్ఞౌ, తేభ్యోహ ప్రాదుర్బభూవ

తన్న వ్యజానత కిమిదం యక్షమితి 2

<u>ప్రతిపదార్థం</u>:- (బ్రహ్మ - బ్రహ్మం) హ - అప్పుడు; ఏషామ్ - వారి; తత్ - ఆ (గర్వం); విజజ్ఞౌ - తెలుసుకున్నది; తేభ్యః - వారి కొరకు; ప్రాదుర్భభూవ - ఆవిర్భవించింది; తత్ - ఆ; ఇదమ్ - ఈ; యక్షమ్ - అద్భుత శక్తి; కిమ్ - ఏమిటో; ఇతి - అని; నవ్యజానత - (వారికి) తెలియలేదు.

<u>భావం</u> :- పరబ్రహ్మము దేవతల కొరకు విజయాన్ని సాధించగా దేవతలు ఆ విజయమూ, మహిమా అంతా తమదేనని ఉప్పొంగి పోయారు, గర్వపడ్డారు. (1)

ఆదేవతల యొక్క గర్వాన్ని తెలుసుకొని పరబ్రహ్మం, ఆ దేవతల మేలుకోరి, వారి ఎదుట అద్భుతమైన యక్ష రూపంలో కనబడింది. ఆ అద్భుత రూపం ఏమిటో వారికి తెలియలేదు. (2)

వ్యాఖ్య:- ఈ ఖండం ఒక చక్కని కథతో ప్రారంభమవుతున్నది. వేదాంత విషయాలు అర్థం చేసుకోవటానికి ఎంతో కష్టంగా ఉంటాయి. అలాంటి సందర్భాల్లో ఉపమానాలను చెప్పి, లేదా ఆ వేదాంత విషయాన్ని ఒక కథారూపంలో చెప్పి అర్థం కాని దానిని సులభంగా అర్థమయ్యేట్లు చేయటమే శాస్త్ర సాంప్రదాయం.

ఈ కథను చెప్పటంలో అంతరార్థం ఏమిటి?

1. పరమాత్మ యొక్క అస్థిత్వాన్ని తెలియజెప్పటం;

2. పరమాత్మ యొక్క మహిమను, ఆధిక్యతను తెలియజెప్పటం;

3. పరమాత్మ వల్లనే మన ఇంద్రియాలు, మనస్సు పనిచేస్తున్నాయని తెలియజెప్పటం. జీవితంలో మన విజయాలకు- గొప్పతనానికి కారణం పరమాత్మ అనుగ్రహమేనని చెప్పటం.

4. పరమాత్మను సులభంగా తెలుసుకొనటం ఎవ్వరికీ సాధ్యపడదని, దేవతలు కూడా ఆయనను తెలుసుకోలేక పోయారని తెలియజెప్పటం;

5. అన్నింటికి మించి మానవునిలో జిజ్ఞాసను కలిగించేది కూడా ఆ పరమాత్మే అని నిర్ధారించటం - ఇవి.

దేవదానవ సంగ్రామాలు జరుగుతుంటాయి. దేవతలంటే వివేకం గలవారు, మంచివారు, తమ పని తాము చూచుకునేవారు. రాక్షసులంటే వివేక హీనులు, దుర్మార్గులు, ఇతరులను పీడించేవారు. వారిద్దరి మధ్య సామరస్యం కుదరదు.

అందువల్ల దేవదానవ సంగ్రామాలు జరుగుతుంటాయి. సాధారణంగా దానవులు ఇంద్రునిపై యుద్ధానికి వెళ్ళి వారి స్వర్గ రాజ్యాన్ని స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నిస్తారు. దానితో యుద్ధం జరుగుతుంది.

ఒకసారి అలాగే దేవదానవ యుద్ధం జరుగుతున్నది. ఆ యుద్ధంలో దానవులదే పైచేయిగా కనిపిస్తున్నది. దేవతలు బలహీనపడి పోతున్నారు. అట్టి స్థితిలో దేవతల యొక్క రక్షణకోసం పరబ్రహ్మం - లేదా పరమాత్మ రహస్యంగా - వారికి తెలియకుండా సహాయం చేశాడు. దానితో దానవులంతా పరాజయం పాలయ్యారు. దేవతలు విజయం సాధించారు. అయితే తమ విజయానికి వెనుక పరమాత్మ యొక్క దివ్యశక్తి ఉన్నదని, ఆయన కారణంగానే విజయం సాధించామని వారికి తెలియదు. ఈ విజయానికి, ఈ వైభవానికి తామే కారణమని అహంకరించారు.. గర్వించారు. విజయోత్సవాన్ని జరుపుకుంటున్నారు. వారిలో వారు ఒకరినొకరు ప్రశంసించుకుంటు న్నారు. విజయానికి విర్రవీగుతున్నారు.

పరమాత్మ అందరి హృదయాలలో ఉన్న వాడే గనుక అందరి భావాలు తెలుసుకునే వాడే గనుక వారి యొక్క గర్వాన్ని, అహంకారాన్ని తెలుసుకున్నాడు. అహంకారం, గర్వం పతనానికి దారి తీస్తాయి కనుక దేవతలను ఆ పతనం నుండి రక్షించాలనుకున్నాడు. అందుకే ఒక భయంకరమైన యక్షుని రూపంలో వారి ముందు ప్రత్యక్షమయ్యాడు.ఆ రూపాన్ని చూచి దేవతలు విస్మయం చెందారు. ఆశ్చర్యపోయారు, భయపడ్డారు. ఆ ఆకారం ఏమిటో - అతడెవరో తెలుసుకోలేకపోయారు. దానితో అదేమిటో తెలుసుకోవాలనే జిజ్ఞాస గలిగింది వారిలో. అందుకోసం ప్రయత్నం ప్రారంభించారు.

ఆధ్యాత్మికంగా చూస్తే మనందరిలో - ప్రతివారిలోను దైవగుణాలు - ఆసురీగుణాలు ఉంటాయి. దైవం వైపుకు త్రిప్పేవి దైవీగుణాలు, ప్రపంచం వైపుకు త్రిప్పి వ్యామోహంలో పడవేసేవి ఆసురీగుణాలు. ఈ రెండు గుణాలకు మధ్య సంగ్రామం జరుగుతూనే ఉంటుంది. ఇదే గజమకరుల సంగ్రామం. ఒడ్డుకురావాలని ఏనుగుతాపత్రయం. నీటిలోపలికి ఈడ్చుకుపోవాలని మొసలి తాపత్రయం. ఈ పోరాటంలో విజయం సాధించాలంటే దైవీగుణాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. నిజంగా మనలో జరిగే ఈ పోరాటంలో పరమాత్మ అనుగ్రహం ఉంటే విజయం తప్పక దైవీగుణాలదే. పరమాత్మను మరచినవాడు, తానే గొప్ప అని అహంకరించిన వాడు, తనకన్న అధికుడు లేడని విర్రవీగేవాడు పతనం చెందుతాడు. అహంకారం మామూలు కారం కన్న చాలా ఘాటైనది. కళ్ల వెంట నీరు తెప్పించేది. ఈ పతనం నుండి ఉద్ధరింపబడాలంటే పరమాత్మ యొక్క అనుగ్రహం ఉండాలి. పరమాత్మ అనుగ్రహం వల్లనే మనకు విజయం లభిస్తున్నదనే నమ్రత, వినయం ఉండాలి. పరమాత్మను ఒక్కక్షణం కూడా మరువరాదు. మన ఇంద్రియాలే దేవతలు. ఈ ఇంద్రియాలకు శక్తినిచ్చే అధిష్టాన దేవతలకు శక్తి నిజంగా బ్రహ్మము నుండే వస్తున్నది. పరమాత్మ శక్తిలేకపోతే ఇంద్రియాలు పనిచేయలేవు.

ఈ విషయం మనం మరిచినప్పుడు పరమాత్మ మననెత్తినమొట్టి, మన బలహీనతలను తెలియజెప్పి, ఆయనవైపుకు త్రిప్పుకుంటాడు. అందుకే కథలో యక్షరూపం. తరువాత ఏం జరిగిందో చూద్దాం.

# తృతీయమంత్రం

<u>మం॥</u> తేஉగ్ని మబ్రువన్, జాతవేద; ఏతద్

విజానీహి కిమేతద్ యక్షమితి; తథేతి॥ 3

<u>ప్రతిపదార్థం</u> :- తే - వారు; (దేవతలు); అగ్నిమ్ - అగ్నితో (వ్యుత్పత్తి అర్థంచేత నాయకుడు అని); అబ్రువన్ - అన్నారు; జాతవేదః - ఓ జాతవేదుడా!; (వ్యు అ: దాదాపు సర్వజ్ఞుడు); కిమ్ ఏతత్ యక్షమ్ ఇతి - ఈ శక్తి ఏమిటో అని; ఏతత్ - దీనిని; విజానీహి - తెలుసుకో; తథా - అలాగే; ఇతి - అని (అగ్ని అన్నాడు).

<u>భావం</u> :- దేవతలు అగ్నిని సమీపించి ఇలా అన్నారు. "ఓ జాతవేదుడా! ఈ అద్భుత మైన యక్షరూపం ఏమిటో పరిశీలించి తెలుసుకో" - అని. అలాగే అన్నాడు అగ్ని.

<u>వ్యాఖ్య</u>:- దేవతలంతా ముందు అగ్నిని సమీపించారు. ఆ విస్మయంగొలిపే ఆకృతి - పూజనీయమైన ఆ రూపం ఏదో తెలుసుకో అని కోరారు. అగ్ని దేవతలకు బాగా సాయం చేసే వాడు. యజ్ఞక్రియలలో దేవతలకిచ్చే ఆహూతులను ఆయా దేవతలకు చేర్చేవాడు అగ్నియే. అగ్ని శక్తివంతుడని ప్రతీతి. తమకెప్పుడూ సాయం చేసే అగ్నిని; గొప్ప శక్తి కలిగిన అగ్నిని ఈ సాయం కూడా చేసిపెట్టమని దేవతలు ప్రార్థిస్తున్నారు.

జాతవేదుడా! అని ప్రశంసిస్తున్నారు. జాతవేదుడంటే వేదాల నుండి పుట్టినవాడు అని అర్థం. అంటే సర్వము తెలిసినవాడు - అని.

మరొక అర్థం శుభాశుభములను గ్రహించువాడు అని. మంచీలేదు చెడూ లేదు.వరుసబెట్టి దహించుకుంటూ పోవటమే. ఇది ప్రాణంలేని శవమా? ప్రాణం ఉన్న జీవియా? ఎందుకూ పనికిరాని ఎండు కట్టెయా? నలుగురికి నీడనిచ్చే వృక్షమా? అనే భేదదృష్టి లేదు. అన్నింటిని గ్రహిస్తాడు. కనుక జాతవేదుడన్నారు.

అన్నింటిని తెలుసుకోగలవాడు గనుక జాతవేదుడన్నారు. ఇలా అడగటంతో పొంగిపోయాడు అగ్ని. తనకింత గొప్ప గౌరవం కలగటంతో అహంకరించాడు. సరే, అలాగే తెలుసుకుంటాను అన్నాడు. తన శక్తి ఏమిటో ఎదుటి వాని శక్తి ఏమిటో తెలుసుకొని రంగంలోకి దిగేవాడే వివేకి. పొగడ్తల వల్ల వివేకం నశించినవాడు అగ్ని. నిజంగా తనకు గల శక్తి ఎవరి వల్ల వచ్చిందో తెలుసుకోలేకపోయిన అగ్ని ఆ దివ్యశక్తిని తెలుసుకొనేందుకు బయలుదేరాడు.

## చతుర్థమంత్రం

మం॥ తదభ్యద్రవత్, తమభ్యవదత్ కోసీతి, అగ్నిర్వా
అహమస్మీత్య బ్రవీజ్జాతవేదా వా అహమస్మీతి॥ 4

ప్రతిపదార్థం :- (అగ్నిః - అగ్ని) తత్ - దానివద్దకు; అభ్యద్రవత్ - త్వరగా వెళ్లాడు; తమ్ - అతనిని; (యక్షః - శక్తి); కః - ఎవరు; అసి - నువ్వు (ఉన్నావు); ఇతి - అని; అభ్యవదత్ - అడిగింది; అహమ్ - నేను, అగ్నిః వైఅస్మి - అగ్నిని కదా; ఇతి - అని; అహమ్ - నేను; జాతవేదాః అస్మి - జాతవేదుడను; ఇతి - అని; అబ్రవీత్ - అన్నాడు.

భావం :- అగ్నిదేవుడు ఆ రూపం వైపుకు పరుగుతీశాడు. అప్పుడు ఆ రూపమే ఎవరునీవు? అని ప్రశ్నించింది. “నేను అగ్నిని- నన్ను జాతవేదుడంటారు” అని అగ్ని సమాధానం ఇచ్చాడు.

వ్యాఖ్య:- అగ్ని సరేనని దేవతలతో చెప్పి ఆ రూపము వైపుకు పరుగుతీశాడు. అంతే ఏ మాత్రం ఆలోచించలేదు. తన శక్తిపై సందేహం లేదు. దేనినైనా తెలుసుకోగలననే అహంకారం, గర్వం. అహంకారం ప్రదర్శించిన వాడు అవమానం పాలుగాక తప్పదు.

అలా పరుగెత్తిన అగ్ని ఆ రూపాన్ని సమీపించి ప్రశ్నించలేదు. యక్షుడే నీవెవరు? అని ప్రశ్నించాడు. అంటే ఆ రూపాన్ని చూడగానే అగ్నికి నోట మాట పెగలలేదు. తెలుసుకోవటానికి వచ్చిన వాడే ప్రశ్నించాలి నీవెవరు? అని. ఎందుకు ప్రశ్నించలేదు? భయంతో. అంతే. ధైర్యం చాలక అలా నిలబడి పోయాడు. అందువల్ల యక్షుడే ప్రశ్నించాడు.

నీవెవరు? అని అడగ్గానే ధైర్యం కూడగట్టుకొని, అహంకారం తన్నుకొనిరాగా నేను అగ్నిని అని, మరల నేను జాతవేదుడను అన్నాడు. అంటే శుభాశుభములను గ్రహించువాడను - అన్నింటిని తెలుసుకోగలవాడను అని.అహంకారమే అలా పలికిస్తున్నది. ఆత్మస్తుతి చేసుకునేట్లు చేసింది.

జాతవేదుడంటే వేదాలనుండి పుట్టిన వాడని మరొక అర్థం - అంటే నేను మంచి గొప్ప ఫ్యామిలీ నుండి వచ్చిన వాణ్ణి. ఫలానా వాళ్ళ అబ్బాయిని అని మనం గొప్పలు చెప్పుకున్నట్లు చెప్పాడు. కొందరు అంటుంటారు, నేనెవరనుకున్నావు? మంత్రిగారి అబ్బాయిని, ఛైర్మన్‌గారి కుమారుణ్ణి... ఇలా గొప్పలు ప్రదర్శిస్తారు. అలాగే అగ్ని తన జన్మస్థానం ఏదో తెలిపి తన గొప్పను వ్యక్తం చేస్తున్నాడు. అహంకారానికి ఎన్ని దారులు మూసినా కొత్తద్వారాలు తెరుచుకుంటూనే ఉంటాయి. అగ్నిని అని ముందు చెప్పినా తన డిగ్రీ - హోదా కూడా చెప్పుకోవాలనుకున్నాడు. అందుకే జాతవేదుణ్ణి అన్నాడు.

## (5 - 6) పంచమ-షష్ఠ మంత్రములు

<u>మం</u>॥ తస్మిం స్త్వయి కింవీర్య మిత్యపీదం సర్వం

దహేయం యదిదం పృథివ్యామితి ॥ 5

ప్రతిపదార్థం :- తస్మిన్ త్వయి - (అలాంటి కీర్తిగల) నీలో; కిమ్ - ఏమి; వీర్యమ్ - శక్తి; ఇతి - అని (అది అడిగింది); పృథివ్యామ్ - భూమ్మీద; యత్ ఇదమ్ - ఏదేది; (అస్తి - ఉన్నదో); ఇదమ్ - ఇది; సర్వం అపి - అంతా కూడా; దహేయమ్ కాల్చివేయగలను; ఇతి - అని (అగ్ని) అన్నాడు.

మం॥ తస్మైతృణం నిదధావేతద్ దహేతి।

తదుపప్రేయాయ సర్వజవేన తన్న

శశాకదగ్ధుం స తత ఏవ నివవృతే నైత

దశకం విజ్ఞాతుం యదేతద్ యక్షమితి॥ 6

ప్రతిపదార్థం :- ఏతత్ - దీన్ని; దహ - కాల్చు; ఇతి - అని (ఉక్త్వా - చెప్పి); తస్మై - అతనికి (ఎదుట); తృణమ్ - గడ్డిపోచ; నిదధౌ - ఉంచింది; (అగ్నిః - అగ్ని), సర్వజవేన - యావచ్ఛక్తితో; తత్ - దాన్ని; ఉప ప్రేయాయ - సమీపించాడు, తత్ - దాన్ని; దగ్ధుమ్ - కాల్చుటకు; నశకాక - అసమర్థుడయ్యాడు; సః - అతడు (అగ్ని); తతః - అక్కడినుండి; నివవృతే ఏవ - మరలిపోయాడు, యత్ - ఏదో, ఏతత్ - ఈ, యక్షమ్ - శక్తి, ఏతత్ - ఇది; విజ్ఞాతుమ్ - తెలుసుకోడానికి, అశకమ్ - నాకు శక్యం కాలేదు; ఇతి - అని (దేవతలకు చెప్పాడు).

భావం :- అంతటి కీర్తిని కలిగి ఉన్న నీలో ఏమి శక్తి ఉన్నది? అని బ్రహ్మము అడుగగా, ఈ ప్రపంచములో ఉన్న సర్వాన్నీ కాల్చి వేయగలను- అని అగ్ని సమాధానం ఇచ్చాడు. 5

అయితే దీన్ని కాల్చు అని బ్రహ్మము అగ్ని ఎదుట ఒక గడ్డిపోచను ఉంచింది. అగ్ని తన సర్వశక్తులను కూడగట్టుకొని గడ్డి పరకను సమీపించాడు. కాని

కాల్చలేకపోయాడు. ఆ అద్భుత రూపం ఏదో తెలుసుకోలేక అగ్ని అక్కడినుండి తిరిగివచ్చాడు. 6

వ్యాఖ్య:- జాతవేదుడనని తన గొప్పను చాటుకున్న అగ్నిని పరీక్షించి అహంకారం అణచాలనుకున్నాడు యక్షుడు. అందుకే నీలో గొప్పతనం ఏమిటి? అన్నాడు. నేను ఈ భూమిలో దేన్నైనా దహించి వేయగలను అని అహంకారంతో చెప్పాడు అగ్ని.

వెంటనే ఒక చిన్న గడ్డిపరక నిచ్చి దీనిని తగులబెట్టమన్నాడు. అంతే అగ్ని వల్లకాలేదు. ప్రయత్నించి ప్రయత్నించి నీరసపడిపోయాడు. అవమాన భారంతో వెనుదిరిగాడు.

అంటే దైవశక్తి లేకపోతే గడ్డిపోచకన్న హీనమైపోతాం. శ్రీకృష్ణుడు అండగా ఉన్నంతకాలం అర్జునుడికెదురే లేదు. ఎంతటి వారినైనా జయించాడు. దేవతలకే అసాధ్యులైన నివాతకవచకాలకేయులను జయించాడు. కాని భగవానుడు అవతారాన్ని చాలించటంతో అర్జునుని బండారం బయటపడింది. అంతఃపురస్త్రీలను, ధనాన్ని, వస్తువాహనాలను ద్వారక నుండి హస్తినాపురానికి తరలిస్తుంటే దొంగలు అడ్డుపడ్డారు. వారి ధాటికి నిలవలేకపోయాడు. గాండీవాన్ని సంధిద్దామంటే దానిని పట్టుకొనే శక్తే లేకపోయింది. ఒక్క అస్త్రమూ గుర్తుకు రాలేదు. ఏమీచేయలేని నిస్సహాయస్థితిలో పడిపోయాడు.

దైవశక్తి వల్లనే మనం ఎన్నో విజయాలు సాధిస్తాం. గొప్పవారమవుతాం. ఆ శక్తే తోడు లేకపోతే గడ్డిపోచకూ కొరగానివాళ్ళమవుతాం. ఇక్కడ అగ్నిదేవుని పరిస్థితీ అంతే. అహంకరించిన వాడు తలదించుకొని అవమానభారంతో వెనుదిరిగాడు. ఆ అద్భుతరూపం ఏదో తెలుసుకోలేకపోయాను అని దేవతలతో చెప్పాడు.

## 7,8,9,10 మంత్రములు

మం॥ అథవాయు మబ్రువన్, వాయవేతద్

విజానీహి కిమేతద్ యక్షమితి; తథేతి॥ 7

ప్రతిపదార్థం :- అథ - అప్పుడు; వాయుమ్ - వాయువుతో; అబ్రువన్ - (దేవతలు) అన్నారు; వాయో - ఓ వాయుదేవా (వ్యు.అ : కదిలేవాడు); కిమ్ - ఏది; ఏతత్ - ఈ; యక్షమ్ ఇతి - శక్తిఅని, ఏతత్ - ఇది; విజానీహి - తెలుసుకో; తథా ఇతి - అలాగే అని (వాయువు అన్నాడు)

మం॥ తదభ్యద్రవత్ తమభ్యవదత్ కోఽసీతి।

వాయుర్వా అహ మస్మీత్యబ్రవీన్మాతరిశ్వా వా అహమస్మీతి॥8

ప్రతిపదార్థం:- (వాయుః - వాయువు); తత్ - దానివద్దకు; అభ్యద్రవత్ - పరుగెత్తిపోయాడు; తమ్ - అతనిని; అభ్యవదత్ - (శక్తి) అడిగింది; కః - ఎవరు; అసి ఇతి - నువ్వు అని; వాయుః - వాయువును; వై అహమ్ అస్మి ఇతి - కదా నేను అని; మాతరిశ్వా - మాతరిశ్వుడను (వ్యు. ఆకాశంలో సంచరించేవాడు); వై అహమ్ ఆస్మి ఇతి - కదా నేను అని, అబ్రవీత్ - అన్నాడు.

మం॥ తస్మిం స్త్వయి కిం వీర్యమిత్యపీదం

సర్వమాదదీయం యదిదం పృథివ్యామితి॥ 9

ప్రతిపదార్థం :- తస్మిన్ త్వయి - (అటువంటి ప్రశస్తిగల) నీలో; కిమ్ - ఏమి; వీర్యం - శక్తి; ఇతి - అని (శక్తి అడిగింది); ఇదం సర్వం - ఇది అంతా; అపి - కూడా; ఆదదీయం - నేను పైకెత్తగలను; యత్ ఇదమ్ - ఏదైనాసరే, పృథివ్యామ్ - భూమిమీద;

ఇతి - అని (అతడు బదులు పలికాడు.)

మం॥ తస్మైతృణం నిదధావే తదాదత్స్వే తి తదుపప్రేయాయ
సర్వజవేన, తన్న శశాకాదాతుం, స తత ఏవ నివవృతే।
నైతదశకం విజ్ఞాతుం యదేతద్ యక్షమితి॥ 10

ప్రతిపదార్థం :- ఏతత్ - ఇది, ఆదత్స్వ - ఎత్తుకో; ఇతి - అని; తస్మై - అతని ఎదుట; తృణమ్ - గడ్డిపోచ; నిదధౌ - ఉంచింది; తత్ - దాన్ని, సర్వజవేన - యావచ్ఛక్తితో; ఉపప్రేయాయ - (వాయువు) సమీపించాడు; తత్ - దానిని, ఆదాతుమ్ - ఎత్తుకోడానికి; నశశాక - శక్తుడు కాలేదు; తతః - అక్కడినుండి; సః - అతడు; నివవృతే ఏవ - మరలిపోయాడు; యత్ - ఎవరు; ఏతత్ - ఈ; యక్షమ్ - శక్తి; ఏతత్ - ఇది; విజ్ఞాతుమ్ - తెలుసుకోవడానికి; న అశకమ్ - నాకు శక్యం కాలేదు; ఇతి - అని; (అతడు మరలిపోయి దేవతలతో అన్నాడు.)

భావం:- అప్పుడు దేవతలు వాయువును సమీపించి ఈ అద్భుతరూపం ఏదో తెలుసుకో-అన్నారు. వాయువు సరే నన్నాడు. 7 వాయువు ఆ రూపం వైపుకు పరుగుతీశాడు. ఆ రూపమే అతనిని అడిగింది-ఎవరునీవు- అని. నేను వాయువును-లేదా మాతరిశ్వుడను అన్నాడు వాయుదేవుడు 8 అంతటి ప్రశస్తిగల నీలో ఏమి శక్తి ఉన్నది? అని యక్షుడు అడుగగా ఈ ప్రపంచంలో ఉన్న సర్వాన్నీ నేను పైకెత్తగలను అని వాయువు అన్నాడు. 9 అయితే దీనిని పైకెత్తుకో అని ఆ యక్షుడు గడ్డిపరకనుంచగా, వాయువు తన సర్వశక్తులతో సమీపించి ఆ గడ్డిపరకను ఎత్తలేకపోయాడు. ఆ యక్షుడెవరో తెలుసుకోలేక వాయువు అక్కడినుండి వెనుదిరిగిపోయాడు.

వ్యాఖ్య:- ఇప్పుడు వాయుదేవుని వంతు వచ్చింది. అగ్నికి సర్వాన్నీ తెలుసుకోగలవాణ్ణి అనే నమ్మకం ఉంటే - వాయుదేవునికి అందరికన్న చాలా బలవంతుడను అనే నమ్మకం ఉంది. వాయుపుత్రులు ఆంజనేయుడు రామాయణంలోను, భీముడు భారతంలోను గొప్ప బలశాలురు. వాయువు యొక్క ప్రభావం మనకు తుఫానుల సమయంలో తెలుస్తూనే ఉంటుంది. అయితే ఎంత బలవంతుడైనా పరమాత్మ శక్తి ఉన్నంతవరకే నీ వైభవం. పరమాత్మశక్తి లేకపోతే గడ్డిపోచకన్న హీనం. అదే మరల ఋజువైంది.

వాయువు కూడా అగ్నిలాగే పరుగెత్తాడు. ఆ యక్షుని చేరగానే ప్రశ్నించలేక పోయాడు. భయపడ్డాడు. ఆ యక్షుడే నీవెవరు? అని అడిగాడు.'నేను మాతరిశ్వుడను' అని అహంకారంతో జవాబిచ్చాడు వాయువు. మాతరిశ్వుడంటే ఆకాశంలో సంచరించేవాడు అని. అగ్ని ఓటమిని అంగీకరించి వచ్చినా లెక్కచేయలేదు వాయువు. తాను అందరికన్న బలం గల వాడిననే గర్వం, దేవతలందరికన్న గొప్పవాడినని నిరూపించుకోవాలనే తహతహ కలిగింది. అందుకే పరుగుతీశాడు. యక్షుని చూచి భయపడినా బింకంగా జవాబిచ్చాడు, నేను దేనినైనా ఎగరగొట్టగలను - అని. యక్షుడు గడ్డిపరకను వేసి కదిలించమన్నాడు. ఎంత ప్రయత్నించినా ఆ గడ్డిపోచను కదిలించలేకపోయాడు. అవమానభారంతో క్రుంగిపోయాడు వాయువు. చేసేదేమీలేక తిరిగి వచ్చాడు. ఆ ఆకృతి ఏదో నాకు తెలియదు అని చెప్పి ఓటమిని అంగీకరించాడు. అగ్నిలాగే వాయువూ చతికిలపడ్డాడు. ఇప్పుడెవరి వంతు? -

## 11,12 మంత్రములు

<u>మం</u>॥ అథేంద్రమబ్రువన్, మఘవన్నే
తద్విజానీహి, కిమేతద్
యక్షమితి; తథేతి; తదభ్య
ద్రవత్; తస్మాత్ తిరోదధే॥ 11

<u>ప్రతిపదార్థం</u> :- అథ - అప్పుడు; ఇంద్రమ్ - ఇంద్రుడితో (దేవతలకు ప్రభువు); అబ్రువన్ - (దేవతలు) అన్నారు; మఘవన్ - ఓ మఘవన్ (వ్యు. అ: పూజ్యుడు మహాధనవంతుడు), కిమ్ - ఏమిటి; ఏతత్ - ఈ; యక్షమ్ - శక్తి; ఇతి ఏతత్ - అని ఇది; విజానీహి - తెలుసుకో; తథా - అలాగే; ఇతి - అని (ఇంద్రుడు పలికాడు); తత్ - దానివద్దకు; అభ్యద్రవత్ - పరుగెత్తిపోయాడు; తస్మాత్ - అతనినుంచి; తిరోదధే - (అది) మాయమైపోయింది.

<u>మం</u>॥ స తస్మిన్నే వాకేశే స్త్రియ
మాజగామ బహుశోభమానాముమాం
హైమవతీం; తాం హోవాచ
కిమేతద్ యక్షమితి॥12

<u>ప్రతిపదార్థం</u> :- సః - అతడు (ఇంద్రుడు); తస్మిన్ - ఆ; ఏవ ఆకాశే - ఆకాశంలోనే (స్థలంలోనే); బహుశోభమానమ్ - అద్భుత సౌందర్యవతియైన; స్త్రియమ్ - యువతిని; ఆజగామ - చూచాడు, తామ్- ఆమెను, హైమ వతీం - బంగారు నగలు గలదానిని (హిమ వంతుని కుమార్తెను); ఉమామ్ - ఉమను; ఉవాచహ - అడిగాడు, కిమ్ - ఏమిటి, ఏతత్ - ఈ; యక్షమ్ - శక్తి; ఇతి - అని.

భావం:- అప్పుడు దేవతలు ఇంద్రుడితో ఓ దేవేంద్రా! ఈ అపురూపమైన శక్తి ఏమిటో తెలుసుకో అన్నారు. ఇంద్రుడు సరేనన్నాడు. ఆ శక్తి వద్దకు త్వరత్వరగా వెళ్లాడు. కాని శక్తి అతని ఎదుటనుండి అంతర్ధానమైంది! 11

యక్షుడు అంతర్ధానమైన ఆ స్థలంలోనే దేవేంద్రుడు అద్భుత సౌందర్యవతియైన ఒక యువతిని, హిమవంతుని కుమార్తె ఉమాదేవిని చూశాడు. ఆమెను అడిగాడు. ఈ అపురూపమైన శక్తి ఏమిటి? అని 12.

వ్యాఖ్య:- అగ్నిదేవుడు, వాయుదేవుడు - ఇద్దరూ ఆ యక్షస్వరూపం ఏదో తెలుసుకోలేక తిరిగివచ్చారు. దేవతలంతా ఇప్పుడు ఇంద్రుని అర్థించారు. 'నీవు తెలుసుకొనిరమ్ము' అని. దేవతలకు అధిపతి ఇంద్రుడు. మఘవన్ అంటే బలవంతుడు అని అర్థం. ఇద్దరు దేవతలు కనుగొనలేకపోయిన విషయాన్ని కనుగొనాలనే ఉద్దేశంతో, తన ఆధిక్యతను ప్రదర్శించాలనే కోరికతో ఇంద్రుడు ఆ రూపం వైపు పరుగులు తీశాడు. ఇంద్రుడు సమీపించగానే యక్షుడు అదృశ్యమయ్యాడు. అహంకారులైన వారికి ఆత్మదర్శనమివ్వదు. ఇంద్రునికి తాను దేవతలకు రాజును అనే గర్వం ఉంది; అహంకారం ఉంది. అట్టి గర్విష్ఠులకు మాట్లాడే అవకాశం కూడా ఇవ్వదలచుకోలేదు యక్షుడు. అందుకే ఏ పరీక్షలు పెట్టకుండా అదృశ్యుడయ్యాడు. తాను కనిపించకుండా ఇంద్రుని సహనాన్ని పరీక్షకు పెట్టాడు.

అగ్నిదేవుడు, వాయుదేవుల లాగా ఇంద్రుడు తిరిగిరాలేదు. తెలుసుకోవాలనే పట్టుదల పెరిగింది. అందుకే ధ్యానపూరిత హృదయంతో అక్కడే చూస్తూ ఉండి పోయాడు. మన ప్రయత్నంలో మనం విజయం సాధించలేకపోతే నిరాశపడి వెనుదిరగగరాదు. ప్రయత్నాన్ని మానుకోరాదు. మరింత పట్టుదలతో ప్రయత్నం

చెయ్యాలి. ఎలాగైనా దారి దొరుకుతుందేమో వెతకాలి. ప్రశాంతంగా ఆలోచించాలి. ఇప్పుడు ఇంద్రుడు ఆ పనే చేశాడు. అప్పుడాయనకు యక్షుడు అదృశ్యుడైన ఆ చోటనే బహుశోభితురాలైన హిమవంతుని పుత్రిక ఉమాదేవి కనిపించింది. ఆమెను అడిగాడు ఇంద్రుడు; ఆ యక్షరూపం ఎవరు? అని.

తృతీయఖండం విశ్లేషణ :

ఈ అధ్యాయం మానవునిలో భగవంతుని తెలుసుకోవాలనే జిజ్ఞాస ఎవరి వల్ల కలుగుతుంది? 'కేన' అనే మరో ప్రశ్నకు సమాధానం ఇస్తున్నది.

ఈ లోకంలో నూటికి తొంభై తొమ్మిది మంది ప్రాపంచిక వ్యవహారాలలోనే మునిగి పోతుంటారు. ఈ పరిమితమైన జీవితాన్ని ఎలా ఉన్నతంగా గడపటమా? అనే ఆలోచిస్తారు. దానికనుగుణంగానే పనులు చేస్తుంటారు. అయితే ఏ ఒక్కడికో పారమార్థికమైన జిజ్ఞాస కలుగుతుంది. భౌతికమైన మన శక్తికి, తెలివికి అతీతమైన శక్తి, తెలివి ఏదో అదృశ్యరూపంలో ఉన్నది. అదే భగవంతుడు, పరమాత్మ. ఎవరాయన? ఎలా ఉంటాడు? ఎక్కడ ఉంటాడు? ఏం చేస్తుంటాడు? ఆయనకు మనకు సంబంధం ఏమిటి? ఆయననెలా తెలుసుకోవాలి? తెలుసుకుంటే ప్రయోజనం ఏమిటి? ఈ సృష్టి ఏమిటి? ఎవరు దీనిని సృష్టించారు? ఎందుకు సృష్టించారు? - ఇలాంటి ప్రశ్నలన్నీ మానవుడిలో తలెత్తుతాయి. అలా సందేహాలు కలగటానికి కారణం మానవుడికి ఆలోచించే బుద్ధి ఉండటం వల్లనే. అయితే అందరూ ఆ బుద్ధిని ఉపయోగించుకొని ఆలోచిస్తున్నారా? అంటే లేదు. నూటికి కోటికి ఏ ఒక్కరో ఇద్దరో అలా ఆలోచించి సమాధానం తెలుసుకోవాలనుకుంటారు. ఇట్టి జిజ్ఞాస ఎందుకు కలుగుతున్నది? ఏదోకాకతాళీయంగా కలుగుతున్నదా? ఎవరి వల్లనైనా కలుగు

తున్నదా? అంటే కాదు అని ఈ అధ్యాయం స్పష్టం చేస్తున్నది. ఇట్టి జిజ్ఞాస కూడా పరమాత్మ వల్లనే. పరమాత్మ అనుగ్రహం కలవారికే ఈ జిజ్ఞాస అని తెలుస్తున్నది.

అంటే మనం పూర్వంలో దైవానికి దగ్గర కావాలని చేసిన దైవకార్యాలు, సత్కర్మల వల్ల, దైవానికి దగ్గర కావాలనే తీవ్ర తపన వల్ల ఈ జన్మలో పరమాత్మ అనుగ్రహం మనపై ప్రసరిస్తుంది. ఆ కారణంగా ఏ మహాత్ముని వల్లనో, ఏ గురువుల వల్లనో, ఏ పెద్దల వల్లనో, ఏ శాస్త్రాధ్యయనం వల్లనో మనలో జిజ్ఞాస కలుగుతుంది. పరమాత్మ తత్వాన్ని తెలుసుకోవాలనుకుంటాం, ప్రయత్నిస్తాం. ఆ ప్రయత్నంలో సఫలీకృతులమవుతాం. పూర్వజన్మ సుకృతం లేకపోతే మనకు అసలు జిజ్ఞాసే కలగదు. పురుషార్థం చెయ్యకపోతే ప్రగతే ఉండదు. కొందరికి పూర్వజన్మ సుకృతం కారణంగా జిజ్ఞాస కలిగి ఈ మార్గంలో ప్రవేశిస్తారు. కాని పురుషార్థంలోపం వల్ల, ఇతర ఆకర్షణల వల్ల, ఆటంకాలనెదిరించ లేకపోవటం వల్ల ఈ మార్గంలో నిలవలేక వెనుదిరుగుతారు, పతనమవుతారు. కనుక ప్రారబ్ధమూ ఉండాలి, పురుషార్థమూ ఉండాలి. ప్రారబ్ధం లేకపోతే అసలు పురుషార్థంతో పనేలేదు. ప్రారబ్ధం నీలో జిజ్ఞాసను కలిగించి మార్గంలో నిలబెడుతుంది. పురుషార్థం నిన్ను ఆ మార్గంలో ముందుకు నడిపిస్తుంది.

మరి భగవంతుని తెలుసుకోవాలనే - దర్శించాలనే జిజ్ఞాస కలిగిన తర్వాత-మోక్షాపేక్ష కలిగిన తర్వాత ఎలా తెలుసుకోవాలి భగవంతుని? అనే ప్రశ్న ఉదయిస్తుంది. మన దగ్గర దేనినైనా తెలుసుకోటానికి ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి అనే పరికరాలున్నాయి. అవి తప్ప మరేమీ లేవు. మరి ఈ పరికరాలేవీ ఆత్మను తెలుసుకోలేవని మొదటి అధ్యాయంలోనే తెలుసుకున్నాం. ఆ విషయాన్నే ఇక్కడ కథారూపంలో చెప్పారు. మనకు 5 కర్మేంద్రియాలు, 5 జ్ఞానేంద్రియాలు, మనస్సు,

బుద్ధి ఉన్నాయి. కర్మేంద్రియాలకు ప్రతినిధి వాక్కు. వాక్కుకు అధిష్ఠాన దేవత అగ్ని. కనుక అగ్నిదేవుడు యక్షుని తెలుసుకోవాలని ప్రయత్నించి విఫలమైనాడు - అంటే వాక్కుద్వారా పరమాత్మను తెలుసుకోలేము అని. అందుకే 'నాయమాత్మాప్రవచనేన లభ్యః' అన్నది ముండకోపనిషత్తు. ప్రవచనాల వల్ల - ఉపన్యాసాల వల్ల ఆత్మ లభించదు అని. కనుక కర్మేంద్రియాలు పరమాత్మను తెలుసుకొనుటకు సమర్థములు కావు అని తేలింది.

ఇక జ్ఞానేంద్రియాలు. జ్ఞానేంద్రియాలకు ప్రతినిధి చర్మం. దానికి అధిష్ఠాన దేవత వాయువు. అదీ ప్రయత్నించింది. కాని విఫలమైంది. అంటే జ్ఞానేంద్రియాల ద్వారా కూడా ఆత్మను తెలుసుకోలేం అని స్పష్టమైంది.

ఇంద్రియాలన్నీ విఫలమైనాయి గనుక ఇంద్రియాలకు రాజు మనస్సు. ఇంద్రియాలే దేవతలు. దేవతలకు రాజు దేవేంద్రుడు. దేవేంద్రుడు ప్రయత్నించాడు. యక్షరూపం అదృశ్యమైంది. ఆ శూన్యంలో బహుశోభితురాలు ఉమాదేవి సాక్షాత్కరించింది. ఆమెనడిగాడు ఎవరీ యక్షుడు? అని.

అంటే మనస్సును ఏకాగ్రం చేసి ధ్యానపూరిత హృదయంతో భగవంతుని కొరకు అన్వేషిస్తే - పట్టుదలతో ప్రయత్నిస్తే మార్గం దొరుకుతుంది. ముందు మనస్సు విషయ శూన్యం కావాలి. ప్రాపంచిక విషయ వాసనల నుండి విడుదల పొంది ప్రశాంతమవ్వాలి, శుద్ధం కావాలి; ఏకాగ్రం కావాలి; అట్టి ఏకాగ్రమనస్సుకు ఉమాదేవి - హిమవంతుని పుత్రిక దర్శనమిస్తుంది. హిమాలయాలలో పుట్టినవే ఉపనిషత్తులు. అంటే ఉపనిషత్తే ఉమాదేవి. ఆ ఉపనిషత్తునే బుద్ధి ప్రశ్నించాలి. విషయశూన్యమై ప్రశాంతమైన మనస్సు వల్ల బుద్ధి సూక్ష్మమవుతుంది. ఆ సూక్ష్మ బుద్ధి ఉపనిషత్తులను

జిజ్ఞాసతో ప్రశ్నిస్తుంది ఎవరీ పరమాత్మ? అని. ఇంద్రియాలు ప్రశ్నించలేవు. ఎందుకంటే వాటి విధులు వేరు. కర్మేంద్రియాలు పనులు చేస్తాయి; జ్ఞానేంద్రియాలు విషయ సేకరణ చేసి మనస్సుకు తెలియచేస్తాయి. కనుక అవి ప్రశ్నించలేవు. అవి పరమాత్మ శక్తితో పనిచేస్తాయి అంతే. ఇక ప్రశ్నించగలిగింది బుద్ధి మాత్రమే. అదీ మనస్సు శాంతించినప్పుడే సాధ్యం.

ఇలా ఉపనిషత్తులను జిజ్ఞాసతో ప్రశ్నించే పరిస్థితిని కల్పించేది భగవంతుడే. అందుకే యక్షరూపంలో సాక్షాత్కరించి వారిలో జిజ్ఞాస కలిగించాడు. మనకూ సమస్యల రూపంలోనో, సంఘటనలరూపంలోనో, గురువులరూపంలోనో కనిపించి జిజ్ఞాస కలిగిస్తాడు. అయితే మనం ఏదో యాదృచ్ఛికంగా ఈరంగంలో ప్రవేశించామనుకుంటాం. కాదు పరమాత్మ అనుగ్రహం వల్లనే అని గ్రహించాలి.

కనుక 'కేన'? ఎవరి వల్ల జిజ్ఞాస కలుగుతుందీ అనే ప్రశ్నకు భగవంతుని వల్లనే - ఆత్మ వల్లనే అని ఈ అధ్యాయం సమాధానం చెబుతున్నది.

# చతుర్థఖండం

## ప్రథమ మంత్రం

<u>మం॥</u> సా బ్రహ్మేతి హోవాచ॥
బ్రహ్మణో వా ఏతద్ విజయే
మహీయధ్వమితి; తతో హైవ
విదాఞ్చకార బ్రహ్మేతి॥1

<u>ప్రతిపదార్థం</u> :- సా - ఆమె; (ఏతత్ - ఇది); బ్రహ్మ - బ్రహ్మం; ఇతి - అని; ఉవాచహ

- అన్నది; బ్రహ్మణః - బ్రహ్మంయొక్క; విజయే - జయంతో; ఏతత్ - ఇది; మహీయ ధ్వమ్వై - మీరు ఘనత వహించారు గదా; ఇతి - అని, తతః - దాన్నుండి; హఏవ - మాత్రమే; ఏతత్ - ఇది; బ్రహ్మ - బ్రహ్మం; ఇతి - అని; విదాంచకార - అతడు తెలుసుకున్నాడు.

భావం :- ఈ అద్భుత శక్తి బ్రహ్మము; ఆ బ్రహ్మము యొక్క మహిమవల్లనే మీరు విజయం సాధించారు గదా! అన్నది ఉమాదేవి. అలా చెప్పటం వల్లనే ఆ యక్ష రూపము బ్రహ్మము అని ఇంద్రుడు తెలుసుకున్నాడు.

వ్యాఖ్య:- ఇంద్రుడు జిజ్ఞాసతో ప్రశ్నించాడు. ఉమాదేవి సమాధానం ఇచ్చింది, అది బ్రహ్మము అని; ఆ బ్రహ్మము వల్లనే మీరు విజయం సాధించారు అని. దానితో అది బ్రహ్మము అని ఇంద్రుడు గ్రహించాడు.

ధ్యానపూరిత హృదయంతో, జిజ్ఞాసతో మనం కూడ ఉపనిషత్తులను ప్రశ్నించాలి. ప్రశ్నించటం అంటే? ఒక సద్గురువు వద్ద శాస్త్ర శ్రవణం చేసి బ్రహ్మమును గురించి తెలుసుకొని - వివేకంతో విచారణ సాగించటమే. ఆ తర్వాత అన్ని ఆలోచనలు కట్టిపెట్టి మనస్సును విషయ శూన్యం కావించి సమాధి స్థితిలో ఉండాలి. అప్పుడే బ్రహ్మతత్వం అవగాహన అవుతుంది. బ్రహ్మ సాక్షాత్కారం కలుగుతుంది. నేను బ్రహ్మమునే అనే అనుభూతి కలుగుతుంది. ఇదే ఉపనిషత్తులు 'తత్' పదార్థాన్ని చెప్పటం.

అంతేగాదు ఉపనిషత్తును ప్రశ్నించేస్థాయికి మనం ఎదగటంలో - ఇప్పటి వరకు మన జీవితంలో జరిగిన సంఘటనలు గాని, మనం పొందిన విజయాలు గాని అన్నీ కేవలం మన బుద్ధిలోని తెలివితేటలవల్లనో, ఇంద్రియాలకు గల శక్తి

వల్లనో కాదని - వీటన్నింటికి వెనుక ఉండి శక్తిని, చైతన్యాన్ని ఇచ్చే ఆత్మవల్ల - బ్రహ్మము వల్లనేనని తెలుస్తుంది.

ఇలా ప్రశాంతమైన మనస్సుతో, సూక్ష్మమైన బుద్ధితో ఉపనిషత్తుల జ్ఞానాన్ని గ్రహించటానికి తగిన అవకాశాలు కల్పించింది ఆ పరమాత్మేనని తెలుసుకోగలగాలి. ఆ బ్రహ్మమువల్లనే ఉపనిషత్తులను తెలుసుకోగలుతున్నానని గత సంఘటనలను నెమరువేసుకోవాలి - విశ్లేషణ చేసి చూసుకోవాలి.

## ద్వితీయ మంత్రం - తృతీయ మంత్రం

<u>మం</u>॥ తస్మాద్ వా ఏతే దేవా అతితరా
మివాన్యాన్ దేవాన్, యదగ్ని ర్వా
యురింద్రస్తే హ్యేనన్నే దిష్ఠం పస్పర్శుస్తే
హ్యేనత్ ప్రథమో విదాంచకార బ్రహ్మేతి॥ 2

<u>ప్రతిపదార్థం</u> :- తే - ఆ; అగ్నిః వాయుః ఇంద్రః - అగ్ని వాయువు ఇంద్రుడు; ఏనత్ - ఈ (బ్రహ్మాన్ని); నేదిష్ఠమ్ - సమీపించి; పస్పరుఃహి - స్పృశించినారు కదా; యత్ - కనుక; తేహి - వారే; ప్రథమః - మొదట; ఏనత్ - ఇది (శక్తి); బ్రహ్మ - బ్రహ్మం; ఇతి - అని; విదాంచకార - తెలుసుకున్నారు; తస్మాత్ - అందుచేత, వై - కదా; ఏతే - ఈ; దేవాః - దేవతలు; అన్యాన్ - ఇతర; దేవాన్ - దేవతలను; అతితరామ్ ఇవ - అతిశయిస్తారుకూడ.

<u>మం</u>॥ తస్మాద్ వా ఇంద్రోఽ తితరా
మివాన్యాన్ దేవాన్; సహ్యేనన్నే
దిష్ఠం పస్పర్శ, స హ్యేన

ప్రథమో విదాంచకార బ్రహ్మేతి॥ 3

ప్రతిపదార్థం :- సఃహి - ఆతడే; ఏనత్ - ఈ (బ్రహ్మాన్ని) నేదిష్ఠమ్ ; సమీపించి; పస్పర్శ - స్పృశించాడు; హి - కనుక; సః - అతడు; ఏనత్ - ఇది, బ్రహ్మ - బ్రహ్మం; ఇతి - అని; ప్రథమః - మొదట; విదాంచకార - తెలుసుకున్నాడు; తస్మాత్ వై - కనుకనే; ఇంద్రః - ఇంద్రుడు; అన్యాన్ దేవాన్ - ఇతర దేవతలను; అతితరామ్ ఇవ - అతిశయిస్తాడు కూడా.

భావం :- అగ్ని , వాయువు, ఇంద్రుడు - వీరు ముగ్గురూ బ్రహ్మాన్ని సమీపించి తాకారు. వారే దీనిని బ్రహ్మము అని మొదటగా తెలుసుకున్నారు. అందువల్ల ఈ ముగ్గురు దేవతలు ఇతర దేవతల కన్న అధికమైనవారు. 2 ఇంద్రుడే ఈ యక్షరూపాన్ని సమీపించి తాకి, అతడు బ్రహ్మమేనని మొదటి సారిగా తెలుసుకున్నాడు. కనుక ఇంద్రుడు ఇతరదేవతల కన్న అధికుడు.

వ్యాఖ్య:- 3. అగ్ని, వాయువు, ఇంద్రుడు - ఈ ముగ్గురు దేవతలు ఇతర దేవతలకన్న అధికులు. ఎందుకంటే వారే ముందుగా బ్రహ్మాన్ని తెలుసుకోవటానికి ప్రయత్నించినవారు, సమీపంగా వెళ్లినవారు, బ్రహ్మాన్ని మొదటగా తెలుసుకున్న వారు.

అగ్ని కర్మేంద్రియాలకు ప్రతినిధి, వాయువు జ్ఞానేంద్రియాలకు ప్రతినిధి, ఇంద్రుడు మనస్సుకు ప్రతినిధి. అగ్నివాయు ఇంద్రులు బ్రహ్మాన్ని తెలుసుకోటానికి ముందుగా ప్రయత్నించిన వారు, సమీపంగా వెళ్ళినవారు, తెలుసుకొన్నవారు - అంటే కర్మేంద్రియాలతో, జ్ఞానేంద్రియాలతో, మనస్సుతో బ్రహ్మాన్ని తెలుసుకోవటానికి ఎవరు ప్రయత్నిస్తారో వారే అధికులు-

అసలు బ్రహ్మాన్ని తెలుసుకోవటానికి మొదట ప్రయత్నం ఎలా జరుగుతుంది?

ఒక సద్గురువును ఆశ్రయించి, ఆయనను సేవించి శాస్త్రాన్ని శ్రవణం చేయడం ద్వారా తెలుసుకోవటం జరుగుతుంది. ఇది జరగాలంటే గురు సమ్ముఖానికి వెళ్ళటానికి, ఆయనకు నమస్కరించటానికి, ఆయనను సేవించటానికి, శాస్త్రాన్ని వినటానికి, కర్మేంద్రియాల, జ్ఞానేంద్రియాల అవసరం ఉన్నది. ఆయన నుండి శాస్త్రాన్ని తెలుసుకోవాలంటే జ్ఞానేంద్రియాలు, మనస్సు బాగా పనిచేయాలి. ఇలా కర్మేంద్రియ, జ్ఞానేంద్రియ, మనస్సులను ఉపయోగించి బ్రహ్మాన్ని గురించి శ్రవణం ద్వారా ఎవరు తెలుసుకున్నారో వారే అగ్ని, వాయు, ఇంద్రులను సరిగ్గా వినియోగించుకొన్నవారు, వారే అందరి కన్న అధికులు. మిగిలినవారు కర్మేంద్రియ జ్ఞానేంద్రియ, మనస్సులు ఉన్నప్పటికీ వాటిని పరబ్రహ్మాన్ని తెలుసుకొనేందుకు వినియోగించక ప్రాపంచిక వ్యవహారాలలోను, విషయ వస్తు వ్యామోహంలోను పడిపోయి, వారి అగ్ని వాయుఇంద్రులను వృథా చేసుకున్నవారు, నిరర్థకం చేసుకున్న వ్యర్థ జీవులు.

ఈ ముగ్గురిలోను ఇంద్రుడు ఇంకా అధికుడు. ఎందుకంటే ఆయనే మొదట బ్రహ్మమును గురించి తెలుసుకోవాలనే జిజ్ఞాసతో ధ్యానపూరిత హృదయంతో మనస్సును నిర్విషయం చేసి ఏకాగ్రచిత్తంతో ప్రయత్నించినవాడు. ఉమాదేవిద్వారా ఆయక్షుడే బ్రహ్మమని తెలుసుకున్నవాడు. ఉపనిషత్తును ప్రశ్నించి తెలుసుకున్నవాడు.

అంటే కర్మేంద్రియ, జ్ఞానేంద్రియ, మనస్సులతో శ్రవణం సాగించి, బ్రహ్మాన్ని గురించి తెలుసుకున్న తర్వాత; ఉపనిషత్తులు (శాస్త్రాలు) తత్వమసి అది నీవే- ఆ పరబ్రహ్మము నీవే అని ఉపదేశించిన తర్వాత సాగించ వలసినది మననం. దీనిని కేవలం మనోబుద్ధులతో సాగించాలి. ఇక్కడ కర్మేంద్రియ, జ్ఞానేంద్రియాలతో పనిలేదు. అంటే ఎవరైతే తమ ఇంద్రుణ్ణి (మనస్సును) ఈ మననంలో ఉపయోగించుకొని

నేను బ్రహ్మమును- అహం బ్రహ్మాస్మి అని అనుభవం పొందే ప్రయత్నం చేస్తాడో అతడే అందరికన్న అధికుడు. తక్కిన వారు విన్న విషయాన్ని మరచి పోయి తమ తమ ఇంద్రులను (మనోబుద్ధులను) వృధాచేసుకున్న వారైపోతున్నారు. ఇలా శ్రవణం వల్ల అగ్నివాయు ఇంద్రుల ఆధిక్యం, మననం వల్ల ఇంద్రుని ఆధిక్యం తెలుస్తున్నది.

## చతుర్థమంత్రం

<u>మం</u>॥ తస్యైష ఆదేశః యదేతద్ విద్యుతో వ్యద్యుతదా

ఇతీన్న్యమీమిషదా ఇత్యధి దైవతమ్॥ 4

ప్రతిపదార్థం :- తస్య - దానియొక్క (బ్రహ్మం యొక్క); ఏషః - ఈ; ఆదేశః - వర్ణన; యత్ ఏతత్ - ఏదైతే; విద్యుతః - మెరుపుయొక్క (వ్యు. అ: ప్రకాశించేది; జ్యోతి) వ్యద్యుతత్ - మెరుపు; ఆ - ఆహో! - న్న్యమీ మీషద్ ఇతి ఆ - రెప్పలు ఆర్చేటట్లు చేస్తున్నది. అహో; ఇతి అధిదైవతమ్ - దేవతలకు లేదా ప్రకృతి శక్తులకు సంబంధించినంతవరకు.

<u>భావం</u> :- బ్రహ్మము యొక్క ఈ ఆదేశం మెరుపు మెరిసినట్లుగా, కంటిరెప్పలువేసి తీసినట్లుగా వస్తుంది. ఇంతవరకు బాహ్య సాధన.

<u>వ్యాఖ్య</u>:- ఎవరి ప్రేరణ వల్ల మనస్సు విషయ ప్రపంచంలో పడుతున్నది ? ఎవరి వల్ల ఈ ఇంద్రియాలు పనిచేస్తున్నాయి అనే ప్రశ్నకు పరమాత్మవల్లనే ఇంద్రియాలు పనిచేస్తున్నాయి, ఆయనే వాటిని వాడుకుంటున్నాడు. అని మొదటి అధ్యాయంలో సమాధానం వచ్చింది.

ఈ బ్రహ్మాన్ని ఎవరి వల్ల తెలుసుకోగలుగుతాం అనే ప్రశ్నకు ఇది ఇంద్రియాల

వల్ల మనోబుద్ధుల వల్ల తెలుసుకోబడేదికాదు, బ్రహ్మం వల్లనే బ్రహ్మాన్ని తెలుసుకోవటం కుదురుతుంది అని రెండవ అధ్యాయంలో సమాధానం వచ్చింది.

అసలు బ్రహ్మాన్ని తెలుసుకోవాలనే జిజ్ఞాస ఎవరి వల్ల కలుగుతుంది ? ఉపనిషత్తును జిజ్ఞాసతో ప్రశ్నించే స్థితి ఒక వ్యక్తిలో ఎవరివల్ల కలుగుతుంది ? అనే ప్రశ్నకు బ్రహ్మము వల్లనే అనే సమాధానం మూడవ అధ్యాయంలో వచ్చింది.

మరి ఇలా అన్నీ బ్రహ్మము వల్లనే అయితే బ్రహ్మాన్ని తెలుసుకొని బ్రహ్మానుభూతి చెందటం కూడా బ్రహ్మము వల్లనే జరుగుతుందా ? మనం ఏ ప్రయత్నం చేయనక్కరలేదా ? సాధకుడు తానుగా పురుష ప్రయత్నం చేయనక్కరలేదా ? ప్రారబ్ధమే చూసుకుంటుందని కూర్చోవచ్చా ? అనే ప్రశ్నకు ఈ 4వ అధ్యాయం సమాధానం ఇవ్వబోతున్నది.

ప్రారబ్ధం వల్ల, పూర్వజన్మ సుకృతం వల్ల భగవంతుని అనుగ్రహం కలుగుతుంది. భగవంతుని అనుగ్రహం సూర్యుని ఎండలాగా, వాయువు ప్రసారం లాగా, నీటి ప్రవాహంలాగా ఎప్పుడూ ఉండనే ఉంటుంది. ఐతే మరి వాటిని పొందేవారెవరు? అర్హత గలవారే- ప్రయత్నించినవారే. మన ఇంటి ప్రక్కనుండే నది ప్రవహిస్తున్నది. మరి మనం నీరు త్రాగాలంటే నది దగ్గరకు వెళ్ళి ఒక బిందెను నీటితో నింపి తెచ్చుకోవాలి. అలాగే పరమాత్మ అనుగ్రహం ఎప్పుడూ ప్రసరిస్తూనే ఉంటుంది. అయితే సత్కర్మల ద్వారా, దైవ కార్యాల ద్వారా, భగవంతుని ప్రార్థించటం ద్వారా ఆయన అనుగ్రహాన్ని పొందాలి.

ఇలా దైవానుగ్రహాన్ని పొందిన వారే బ్రహ్మాన్ని తెలుసుకొని బ్రహ్మాను భూతిని చెందాలనుకుంటారు. వారు అందుకు పురుషప్రయత్నం చేయాలి. ఎందుకంటే

దైవానుగ్రహం మూడు వంతులైతే పురుష ప్రయత్నం ఒక వంతు. ఏమిటా పురుషప్రయత్నం ? ఏం చేయాలి ? అనేదానికి శ్రవణ మననాలు చేయాలి అని ఈ అధ్యాయంలో స్పష్టం చేస్తున్నారు. పురుష ప్రయత్నం అంటే శ్రవణం, ఆ తర్వాత మననం. మననం చేయటం అంటే ఉపనిషత్తు మంత్రాలను వల్లెవేయటం కాదు. పదే పదే వాటి అర్థాన్ని తాత్పర్యాన్ని చదవటం కాదు. ఆ ఉపనిషన్మంత్రాల సారాన్ని గ్రహించి దానివల్ల కలిగిన జ్ఞానంతో తన జీవితంలో జరిగిన సంఘటనలను విశ్లేషించుకోవాలి. పోల్చుకోవాలి. ఎవరి కారణంగా తన జీవితంలో అలాంటి సంఘటనలు జరిగాయో, ఎవరి కారణంగా విజయాలు లభించాయో, ఎవరి కారణంగా బుద్ధి బాగా పనిచేసిందో, ఎవరి కారణంగా తాను ఈ ఆధ్యాత్మిక మార్గంలో ప్రవేశించటం జరిగిందో వాటన్నింటిని విశ్లేషణ చేయాలి.

ఇవన్నీ పరబ్రహ్మం వల్లనే- పరమాత్మ వల్లనే వచ్చినవి అని గ్రహించాలి. యాదృచ్ఛికంగా ఏ సంఘటన జరిగినా దానికి మూలకారణం పరమాత్మయే నని తెలుసుకోవాలి. అప్పట్లో అలా జరగటానికి కారణం అదృష్టం అనుకొని ఉండవచ్చు. ఇప్పుడు ఉపనిషత్తు జ్ఞానంతో పరమాత్మ వల్లనే అలా జరిగిందని గ్రహించాలి.

ఇలా పరమాత్మ వల్లనే జిజ్ఞాస గలిగి, బ్రహ్మాన్ని తెలుసుకోవాలనే తపనగలిగి, ఉపనిషత్తులను ప్రశ్నించి తెలుసుకోవాలనుకొనే సాధకుడు తన సాధనను పట్టు వదలక సాదించాలి. ఈ మార్గంలో ఎన్నో ఆటంకాలు వస్తుంటాయి, నిరాశానిస్పృహలు కలుగుతాయి. అయినా సరే సాధనలు సాగించాలి. అలా సాధన సాగిస్తూ ఉంటే ఆత్మ అనుభవానికి వస్తుంది. అయితే ప్రారంభదశలో ఈ అనుభవం మెరుపు మెరిసినట్లుగా ఉంటుంది. మనం చీకటిలో ప్రయాణం చేస్తున్నాం. దారికనబడటం

లేదు. ముందుకు వెళ్తే అక్కడ ఏముందో తెలియదు. అప్పుడొక మెరుపు మెరిసింది. ఆ కాంతిలో కొంతదూరం దారిని స్పష్టంగా చూస్తాం. ఆ తర్వాత అంత దూరం వరకు చీకటిలోనైనా నడుస్తాం. ఆ తరువాత దారి తెలియదు. కనుక మరల మెరుపు వచ్చే వరకు ఆగాలి. మళ్ళీ మెరుపురాగానే మరి కొంత దూరం వెళ్తాం. ఇలా ప్రారంభ దశలో సాధన ఆగి ఆగి సాగుతుంది. ప్రశాంత స్థితిలో బ్రహ్మానుభవం తళుక్కున మెరిసి మాయమవుతుంది. ఇంద్రుని వలె నిరీక్షించాలి. పట్టు వదలక సాధన సాగించాలి. అలా సాధన సాగుతున్న కొద్దీ నీకు కలిగే బ్రహ్మానుభవం కన్నులు మూసి తెరుచునప్పుడు న్నట్టుగా ఉంటుంది. మనం దారిలో ప్రయాణం చేస్తుంటాం. అనేక వందల, వేల సార్లు కనురెప్పలు వేస్తుంటాం తీస్తుంటాం. అయినా దారి కనిపిస్తూనే ఉంటుంది. అలాగే బ్రహ్మానుభవం నిరంతరాయంగా కలుగుతూనే ఉంటుంది సాధన యొక్క పరిపక్వదశలో. కనుక సాధన మొదటి దశలో మెరుపు మెరిసి నట్లుగ, సాధన యొక్క చరమదశలో కనురెప్పలు వేసి తీసినట్లుగ బ్రహ్మానుభవం కలుగుతుంది. అంటే మొదటి దశ వెలుగుకూ చీకట్లకూ మధ్య నడుస్తుంటే చివరిదశ అనాయాసంగా- నిరాటంకంగా నడుస్తుంది.

ఈ మననం, విచారణ ఎంత కాలం సాగాలి ? బ్రహ్మాను భూతి కలిగేవరకు, అహం బ్రహ్మాస్మి అనే అపరోక్ష అనుభూతి కలిగేంత వరకు. దైవానుగ్రహం నిన్ను ఎలాగో ఒకలాగా గురు సమ్ముఖంలో కూర్చోబెడుతుంది. పూర్వజన్మల సుకృతం కారణంగానే దైవానుగ్రహం లభిస్తుంది. ఆ దైవానుగ్రహం వల్లనే- నీ అంతట నీవో, ఎవరో చెబితేనో, యాదృచ్ఛికంగానో, ప్రయత్నం చేసో, ఏ ప్రయత్నం లేకుండా గురువే నీ దగ్గరకు వచ్చో- నీవు శాస్త్ర శ్రవణానికి గురుసమ్ముఖలో కూర్చుంటావు. ఇంత

వరకు ప్రారబ్ధం. ఇక శాస్త్రాన్ని శ్రద్ధగా శ్రవణం చేయటం, గురువు అనుగ్రహాన్ని పొందటం, సాధనలు చేయటం ఇదంతా పురుష ప్రయత్నం వల్ల సాగుతుంది. నీవు ప్రయత్నం చేస్తుంటే మొదట మెరుపులాగా, తరువాత కనురెప్పలు వేసి తీసినట్టు నీకు దైవ నిర్దేశం అందుతూ ఉంటుంది. ఇంతవరకు బాహ్య సాధన- అధి దైవతం. ఇక తరువాత సాధన పూర్తిగా అంతర్ముఖం.

## పంచమ మంత్రం

మం॥ అథాధ్యాత్మం యదేతద్ గచ్ఛతీవ చ

మనోఽనేన చైతదుపస్మరత్యభీక్ష్ణం సంకల్పః॥ 5

ప్రతిపదార్థం :- అథ - ఇక; అధ్యాత్మమ్ - అంతర్గత సాధన; యత్ ఏతత్ అనేన - ఈ బ్రహ్మం వల్లనే; మనః - మనస్సు; ఏతత్ - దీనిని (ఈ ప్రపంచాన్ని); గచ్ఛతి ఇవ చ - పరుగెడుతున్నట్టుగా ఉంటుంది; అభీక్ష్ణమ్ - ఎల్లప్పుడు; ఉపస్మరతి - జ్ఞాపకం ఉంచుకుంటుంది; సంకల్పః (క్రియతే) చ - ఊహిస్తుంది కూడా.

భావం :- ఇప్పుడు అంతర్గత సాధన. దేనివల్ల మనస్సు ప్రపంచంలోకి పరుగెడుతున్నట్టుగా ఉంటుందో, జరిగిపోయిన విషయాలను జ్ఞాపకం చేసుకుంటుందో, క్షణక్షణమూ క్రొత్త సంకల్పాలు చేసుకుంటుందో - అదే బ్రహ్మము.

వ్యాఖ్య;- ఇక ఇపుడు పూర్తిగ అంతర్గతమైన సాధన ఎలా చేయాలో సూచన ఇస్తున్నారు. ఇదే నిధి ధ్యాసన. (ధ్యానం). ధ్యానంలో కూర్చోగానే మనస్సు ఒక విషయం మీదనుండి మరొక విషయం మీదకు పరుగులు తీయటం కనిపిస్తుంది. అలలు అలలుగా ఒక దాని వెంట మరొకటిగా ఆలోచనలు వస్తూనే ఉంటాయి.

అలలు అలజడి కలిగిస్తుంటే సముద్రం యొక్క పూర్ణరూపాన్ని దర్శించలేం. అలాగే ఆలోచనలు, సంకల్పాలు అలజడి రేపుతుంటే పరిపూర్ణ ఆత్మను దర్శించలేం. కనుక ఆలోచనలు ఆగాలి.

మనస్సులోని ఆలోచనలు 3 విధాలుగా ఉంటాయి. కొన్ని ఆలోచనలు వర్తమానంలోకి దూసుక పోతాయి. ఇప్పుడు జరుగుతున్న విషయాలగురించి ఆలోచనలు సాగిపోతుంటాయి. మరికొన్ని ఆలోచనలు భూతకాలంలోకి తొంగి చూస్తాయి. అంటే గతకాలపు సంఘటనలకు సంబంధించిన స్మృతులను నెమరు వేసుకుంటూ ఉంటాయి. మరికొన్ని ఆలోచనలు భవిష్యత్తులోనికి పరుగెడతాయి. అలా చేయాలి, ఇలా చేయాలి అని క్షణక్షణం సంకల్పాలు చేసుకుంటుంది.

ఈ ప్రకారంగా మనస్సు 3 కాలాలలోకి పరుగెడుతున్నది. అంటే నిజంగా మనస్సెక్కడికీ పరుగెత్తదు. ఆలోచనల తీరునుబట్టే భూత, భవిష్యత్ వర్త మానాలని విభాగిస్తాం. సముద్రంలో లేచిన అల ఎంత దూరం ప్రయాణం చేసినా సముద్రంలోనే విరిగి పడినట్లు ఆత్మలో లేచిన ఆలోచనలనే అలలు ఆత్మలోనే అంతమవుతాయి.

ఈ ఆలోచనలనే అలలు అంతమైతేనే ఆత్మ దర్శనం. ఆత్మ దర్శనానికి అనుకూల వాతావరణాన్ని ఆంతర్యంలో తయారుచేసుకోవాలి. అప్పుడే ఆత్మ తనంతట తానుగా వ్యక్త మవుతుంది. మరి ఆలోచనలు అంతమయ్యేదెలా ?

అసలు ఆలోచనలకు, సంకల్పాలకు ఆధారం ఏమిటి ? కారణం ఏమిటి ? ఏది ఉండటం వల్ల ఆలోచనలు కదులుతున్నాయి ? సంకల్పాలు చేసుకోగలుగు తున్నాం ? ఆత్మ వల్లనే. పరుగులెత్తే మనస్సుకు కారణం పరబ్రహ్మమే. ఆత్మచైతన్యం వల్లనే సంకల్పాలు కదులుతున్నాయి. ఒకదాని తర్వాత మరొకటిగా సంకల్పాలు

చేసుకుంటున్నాం. అంటే ఆలోచనల వెనుక, మనస్సుకు వెనుక ఉన్నది ఆత్మ చైతన్యమే - పరబ్రహ్మమేనని ముందు తెలుసుకోవాలి. ఇలా తెలుసుకుంటే ఇప్పుడు మనస్సుయొక్క కదలికలకు ఆధారమైన పరబ్రహ్మం వైపుకు దృష్టిని మరల్చవచ్చు. అలా మరల్చాలి.

రైలు పెట్టెలు కదులు తున్నాయంటే వాటికి ఆధారంగా పట్టాలున్నాయి. ఈ విషయం తెలుసుకుంటే రైలు పెట్టెలు కదిలేటప్పుడు కూడా పట్టాలపై దృష్టిని నిల్పవచ్చు. సినిమాతెరపై బొమ్మలు కదులుతున్నాయంటే వాటికాధారంగా తెర ఉన్నది. తెర ఉన్నదని గుర్తుంటే బొమ్మలు కదులుతున్నా దృష్టిని ప్రయత్నంతో తెరమీద నిలపవచ్చు.

అలాగే ఆలోచనలు కదులు తున్నప్పటికి వాటికి ఆధారం ఆత్మచైతన్యమని (పరబ్రహ్మమని) తెలుసుకొని మన దృష్టిని ఆలోచననల మీద కాక, వాటి కాధారమైన ఆత్మమీద నిలపటానికి నిరంతర సాధన సాగించాలి. ఇదే అంతర్గత సాధన. నిధిధ్యాసన.

నిధి ధ్యాసన అంటే పరుగులెత్తుతున్నట్లుండే మనస్సును నిరంతరం గమనిస్తూ ఆ మనస్సుకు ఆధారం ఏదో దానిపై దృష్టి నిలపటానికి ప్రయత్నం చేయటమే.

ఎలా?

గతకాలంలోని సంఘటనలకు సంబంధించిన జ్ఞాపకాలు వచ్చినాయి. ఆ జ్ఞాపకాలలో మునిగిపోక ఒక్కసారి ఇవి ఎలావస్తున్నాయి? దేని ఆధారంగా వస్తున్నాయి? అని ప్రశ్నించుకోవాలి. ఆత్మ చైతన్యం యొక్క స్పర్శవల్లనే ఈ జ్ఞాపకాలు కదులుతున్నాయి అని ఆత్మవైపుకు దృష్టి సారించాలి. అలాగే వర్తమానంలోని

విషయాలు, ఆలోచనలు చేస్తుంటే వీటికి ఆధారం ఏమిటి? అని ప్రశ్నించుకొని ఆ విషయాలకు గాక వాటికి ఆధారమైన ఆత్మకు ప్రాధాన్యమివ్వాలి. అలాగే భవిష్యత్తుకు సంబంధించిన సంకల్పాలు చేసుకుంటున్నప్పుడు కూడా ఆ సంకల్పాలలో మునిగిపోక వాటికి ఆధారమైన ఆత్మవైపుకు దృష్టి సారించాలి.

ఇలా అన్ని సందర్భాలలోను ఆత్మ చైతన్యం వైపుకు దృష్టి సారించి జ్ఞాపకాలను, ఆలోచనలను, సంకల్పాలను పట్టించుకోకుండా ఉండగలిగితే- వాటికి ప్రాధాన్యత ఇవ్వకుండా ఉండగలిగితే చివరకు అవి అన్నీ ఆగిపోతాయి. సంకల్ప రహిత స్థితి- నిస్సంకల్పస్థితి లేదా ఆలోచనారహిత స్థితి- భావాతీత స్థితి వస్తుంది. అప్పుడు ఆత్మ తనంతటతానుగా దర్శనమిస్తుంది. బ్రహ్మానుభవం కలుగుతుంది.

## షష్టమంత్రం

<u>మం</u>॥ తద్ధ తద్వనం నామ
తద్వనమిత్యుపాసితవ్యం;
సయ ఏతదేవం వేదాభిహైనం
సర్వాణి భూతాని సంవాఞ్ఛన్తి॥

<u>ప్రతిపదార్థం</u> :- తత్‌హ - అది (బ్రహ్మం); తద్వనమ్ నామ - తద్వనం (వ్యు.అ. అన్నింటిలోని ఆత్మ అవడంచేత ప్రియమైనది) అని పేరు; (తస్మాత్ బ్రహ్మ - అందుచేత బ్రహ్మం); తద్వనమ్ ఇతి - తద్వనమ్ అని; ఉపాసితవ్యమ్ - ఉపాసన చేయబడాలి; సః - అతడు; యః - ఎవరైతే; ఏతత్ - ఇది (బ్రహ్మం); ఏవమ్ - ఇలా; వేద - తెలుసుకుంటాడో; ఏనమ్ - ఇతనిని (ఉపాసకుడిని); సర్వాణి భూతాని - అన్ని

జీవాలూ, అభిసంవాఞ్ఛన్తి - ప్రేమిస్తాయి.

భావం :- బ్రహ్మము తద్వనం అనే పేరు గలది. అంటే ప్రియమైనది అని. అది సర్వులకు ఆరాధనీయమైనదని ఉపాశించాలి. అలా ఉపాశించి ఎవరైతే బ్రహ్మాన్ని ఇలా తెలుసుకున్నారో అతడిని అందరూ ఆరాధిస్తారు.

వ్యాఖ్య:- బ్రహ్మమునకు తద్వనం అనే పేరు ఉన్నది. అందరిచేత ఉపాసింపబడేది అదే గనుక; అందరూ దానికొరకే ప్రయత్నిస్తుంటారు గనుక దానిని తద్వనం అన్నారు. తద్వనం అంటే ఆరాధనీయమైనది అని అర్థం. ఆ భావంతోనే అందరూ దీనిని ఆరాధిస్తారు. ఉపాసిస్తారు.

నిజంగా ప్రపంచంలో అందరూ ఆరాధించేది ప్రేమించేది ఆత్మనే గాని దేహాన్ని కాదు. కాని మనం దేహాన్నే ప్రేమిస్తున్నాం అనుకుంటున్నాం. అది నిజమేనని మనకు భ్రమకలగటానికి కారణం అందమైన దేహాన్ని ప్రేమిస్తాం, ఆరాధిస్తాం. ఐతే అదే దేహం అంద విహీనమైనపుడు ఆ ప్రేమ, ఆరాధనా భావం తగ్గి పోతుంది. ఇది కొంతవరకు నిజమే అయినా పూర్తి నిజం కాదు. ఎంతో అందమైన దేహాన్ని ప్రేమిస్తాం. కాని ఆదేహంలో ఆత్మ చైతన్యం లేక పోతే ఆ దేహాన్ని ప్రేమిస్తామా ? అంత అందమైన దేహాన్ని ముట్టుకోవటానికి కూడా భయపడతాం. అంత అందమైనదేహాన్ని కాల్చి బూడిదచేస్తాం. కనుక మనం ఇంతకాలం ఆరాధించినది ఆ దేహాన్ని కాదు. ఆ దేహానికి ఆధారంగా ఉన్న ఆత్మనే. దేహరూపంలో, ప్రాణరూపంలో కనిపించే ఆ పరమాత్మనే. అందువల్ల ఆరాధించేది, ప్రేమించేది, ప్రేమించదగినది ఆత్మనే. ఇలా సూటిగా ఎవరైతే ఆత్మను ఆరాధిస్తారో, ఉపాసిస్తారో అలా ఉపాసన చేసి ఆత్మను తెలుసు కుంటారో, తాము ఆత్మ స్వరూపమేనని అనుభూతి చెందుతారో అట్టివారు ఆ

ఆరాధనీయమైన దానిలో ఐక్యమైనందువల్ల అందరికీ ఆరాధనీయులౌతారు. లోకంలో అందరూ వారిని పూజిస్తారు.

## సప్తమ మంత్రం

<u>మం॥</u> ఉపనిషదం భో బ్రూహీత్యుక్తా త ఉపనిషద్

బ్రాహ్మీం వావ త ఉపనిషదమబ్రూమేతి॥ 7

<u>ప్రతిపదార్థం</u> :- భోః - అయ్యా; ఉపనిషదమ్ - ఉపనిషత్తును; బ్రూహి - (నాకు) చెప్పండి; ఇతి - అని (అతడు అడిగాడు); తే - నీకు; ఉపనిషత్ - ఉపనిషత్తు; ఉక్తా - చెప్పబడింది; బ్రాహ్మీమ్ - బ్రహ్మానికి సంబంధించిన; ఉపనిషదమ్ - ఉపనిషత్తును; వావ - కదా; తే - నీకు, అబ్రూమ - చెప్పాం, ఇతి - అని; (అతడు బదులుచెప్పాడు).

<u>భావం</u> :- శిష్యుడు అడిగాడు "స్వామీ! నాకు ఉపనిషత్తును బోధించండి" అని. గురువు సమాధానం ఇచ్చాడు "నీకు బ్రహ్మానికి చెందిన ఉపనిషత్తు చెప్పబడింది. కనుక ఉపనిషత్తును బోధించడమైనది" అని.

<u>వ్యాఖ్య</u>:- నాలుగు అధ్యాయాలతో కూడిన ఉపనిషత్తు చెప్పటం ముగిసింది. శిష్యుడు అడిగిన లోతైన ప్రశ్నలకు వివరంగా, ఉపమాన సహితంగా సమాధానం ఇవ్వటం పూర్తయింది. ఇప్పుడు వింటున్న శిష్యులలో ఒకరు అడుగుతున్నారు. ఆచార్యా! మాకు ఉపనిషత్తుని బోధించండి అని. అదేమిటి? ఇంతవరకు చెప్పినది ఉపనిషత్తు కాదనుకున్నాడా? లేక అర్థం కాలేదా? లేక ఉపనిషత్తును బోధిస్తుంటే చక్కగా నిద్రపోయాడా? ఇంతవరకు చెప్పిన అద్భుతమైన జ్ఞానాన్ని విననివాడైతే ఉపనిషత్తును చెప్పమని మళ్ళీ అడిగేంత శ్రద్ధ ఉండదు. తన దురదృష్టానికి తనను తానే తిట్టుకుంటూ

మౌనంగ వెళ్ళిపోతాడు. ఎందుకంటే ఇంత గొప్ప జ్ఞానాన్ని తన అలసత్వం వల్ల పోగొట్టుకున్నానే అని.

కానీ శిష్యుడు  ఆ రకం కాదు. ఆనాడు సాధన చతుష్టయ సంపన్నులై అర్హత గలిగిన శిష్యులే గురువును వెతుక్కుంటూ వెళ్ళి ఆయనను ఎంతో కాలం సేవించి, ఆయన అనుగ్రహాన్ని పొంది, ఎంతో అరుదుగా ఈ ఉపనిషత్ జ్ఞానాన్ని పొందేవారు. ఇలా అపురూపంగా లభించే ఈ అదృష్టాన్ని చేజేతులా జారవిడుచుకునే సోమరి, దురదృష్టవంతుడు సాధారణంగా ఒక్కడు కూడా ఉండడు. అందువల్ల అతడు అర్థంకాకగాని, అసలు వినకపోవటం వల్లగానీ ఉపనిషత్తును చెప్పమనటం లేదు. అలా చెప్పమంటే మళ్ళీ ఒకసారి ఉపనిషత్తును చెప్పండి అని అడగాలి. అలా అడగలేదు. ఉపనిషత్తును బోధించండి అన్నాడు. అలా అడిగినందువల్ల ఇంకా ఏదో చెప్పమన్నట్లే. ఇంకా ఏం చెప్పమన్నట్లు ? ఏం చెప్పాలి ?

ఉపనిషత్తు రెండు పనులు చేస్తుంది.

1. పరబ్రహ్మమును గురించి - పరమాత్మ గురించి సరియైన జ్ఞానాన్ని మనకు కలిగించేది ఉపనిషత్తు. దీనిని బ్రాహ్మీ ఉపనిషత్ అంటారు.

2. అట్టి పరబ్రహ్మమును- పరమాత్మను చేరుకోవాలంటే లేదా ఆ పరబ్రహ్మముతో ఐక్యమై 'అహం బ్రహ్మాస్మి' అనుభవం కలగాలంటే మన ప్రాపంచిక బంధాలను, అజ్ఞాన బంధనాలను ఛేదించే ఉపాయాలను సాధనలను తెలియజెప్పేది ఉపనిషత్తు - అంటే ఉపనిషత్తు అనేది ఇలా బ్రహ్మమునకు చెందిన జ్ఞానాన్నీ బోధించాలి, ఆ బ్రహ్మముతో ఐక్యమగుటకు మన అజ్ఞాన బంధాలను ఛేదించే సాధనలను, ఉపాయాలనూ తెలియ జెప్పాలి.

ఇప్పటివరకు చెప్పినది బ్రాహ్మీ ఉపనిషత్తు. అంటే బ్రహ్మమునకు సంబంధించిన జ్ఞానాన్ని చెప్పటం పూర్తయింది. అందుకే గురువు అంటున్నాడు. నాయనా ! బ్రహ్మానికి చెందిన ఉపనిషత్తు నీకు చెప్పటమైనది. ఉపనిషత్తును బోధించాను- అని. అయితే అజ్ఞాన బంధాలను చేధించి ప్రాపంచిక వ్యామోహాలనుండి విడుదల చేసి బ్రహ్మాన్ని చేరుకోవటానికి తగిన సాధనలను, ఉపాయాలను ఇక చెప్పాలి. ఇది ఇంతవరకు చెప్పలేదు. దానిని చెప్పాలనే గురువు ఆలోచిస్తున్నాడు. ఇంతలో శిష్యుడు ప్రశ్న వేశాడు. శిష్యుని యొక్క ఉత్సాహానికి, శ్రద్ధకు ఆనందించిన గురువు అజ్ఞానబంధాలను, ప్రాపంచిక వ్యామోహాలను ఛేదించే ఉపాయాలను ఉపదేశించబోతున్నాడు. శిష్యుని అవసరాన్ని గుర్తించి ఆ ఉపనిషత్తును బోధిస్తున్నాడు.

## అష్టమ మంత్రం

మం॥ తస్యై తపోదమః కర్మేతి ప్రతిష్ఠా
వేదాః సర్వాఙ్గాని సత్య మాయతనమ్॥ 8

ప్రతిపదార్థం :- తపః - తపస్సు; దమః - నిగ్రహం; కర్మ ఇతి - యజ్ఞవిధులు (ఏకనిష్ఠమైన కర్మ); తస్యై- దానియొక్క (ఉపనిషత్తుయొక్క); ప్రతిష్ఠా - పాదాలు; (వాటిపైన అది నిలుస్తుంది); వేదాః - వేదాలు; సర్వాంగాని - అన్ని అవయవాలు; సత్యం - సత్యం; ఆయతనమ్ - నివాసస్థానం.

భావం :- బ్రహ్మమునకు పునాది తపస్సు, ఇంద్రియనిగ్రహం, నిష్కామకర్మ. అన్ని వేదాలు (శాస్త్రాలు) దాని అంగాలు, సత్యమే బ్రహ్మానికి నివాసస్థానం.

వ్యాఖ్య:- ఆచరణాత్మక బోధకై ఎదురుచూస్తున్న శిష్యునికి గురువు ఉపదేశం చేస్తున్నాడు. బ్రాహ్మీ ఉపనిషత్తు ద్వారా బ్రహ్మమును గురించి తెలుసుకున్నావు.

ఇప్పుడా బ్రహ్మముతో ఐక్యతను సాధించాలంటే నీవు చేయవలసినది తపస్సు, దమము, నిష్కామ కర్మ. ఈ మూడూ ఉపనిషత్తుకు పునాది వంటివి.

అంటే బ్రహ్మజ్ఞానం అనుభవానికి అందాలంటే- బ్రహ్మాను భూతి కలగాలంటే ముందుగా నీ పరికరాలను శుద్ధం చేసుకోవాలి. దానికే తపస్సు, దమం, కర్మ అనేవి. వీటిద్వారా ప్రాపంచిక బంధనాలు వదిలిపోతాయి.

1. శారీరకమైన తపస్సు చేయటం వల్ల శారీరక అవసరాలు తగ్గిపోతాయి. శరీర శుద్ధి జరుగుతుంది.

2. ఇంద్రియనిగ్రహం వల్ల మనస్సులోని కోరికలు తగ్గిపోతాయి.

3. నిష్కామ కర్మ వల్ల ఇంతకు ముందు జన్మలలో పోగుచేసుకున్న వాసనలు క్షయమై పోతాయి. చిత్తం శుద్ధ పడుతుంది.

ఈ విధంగా మనస్సులోని వత్తిడి, ప్రేరణలు తగ్గిపోతాయి. ప్రపంచం పట్ల, విషయాలపట్ల నిర్లిప్తభావం, విరక్తి భావం ఏర్పడుతుంది. దేనిపట్లా ఆసక్తి, కోరిక, వాంఛ ఉండదు. దానితో కర్మలు చేయాలనే తపన తగ్గి నైష్కర్మ్య సిద్ధి కలుగుతుంది. మనస్సు ఇలా ఆలోచనలకతీతంగా శాంతించినప్పుడు బ్రహ్మానుభవం కలుగుతుంది. బ్రహ్మాను భవం కలగటానికి ఈ పైన చెప్పిన 3 సాధనలు మాత్రమే గాక శాస్త్రాలను తెలుసుకోవటం కూడా అవసరమే. అందుకే శాస్త్రాలన్నీ బ్రహ్మమునకు అంగాలు అని చెప్పటం జరిగింది. శాస్త్రాలద్వారానే భగవంతుని తెలుసుకోవాలి. భగవత్తత్వాన్ని- ఆత్మ తత్వాన్ని తెలుసుకోవాలి.

అంతేగాక సత్యమే బ్రహ్మము యొక్క నివాస స్థానము అంటున్నారు. అంటే త్రికరణ శుద్ధిగా మనోవాక్కాయముల ద్వారా సత్యవ్రతాన్ని పాటించాలి.

మనస్సుతో భావించినదానినే వాక్కుద్వారా వెల్లడించటం, అలా వెల్లడించిన దానినే ఆచరణ చేయటం. ఇలా 3 పరికరాలను సత్యమనే వ్రతంతో శుద్ధిగా వించుకోవాలి.

ఇలా ఆచరణ చేసిన వారు బ్రహ్మాను భూతికి సిద్ధమైనట్లే. అందుకే బ్రహ్మాన్ని చేరుకోవాలంటే దాని నివాసస్థానం సత్యమని, దాని అంగాలు శాస్త్రాలని, దానికి పునాది తపస్సు, దమము, నిష్కామ కర్మ అని చెప్పటం జరిగింది.

కేవలం బ్రహ్మాన్ని తెలుసుకున్నంత మాత్రాన అనుభూతి కలగదు. జబ్బుకు సరైన ఔషధమేదో తెలుసుకున్నంత మాత్రాన జబ్బు తగ్గదు. దానిని సేవించినప్పుడే ఫలితం. అలాగే ఎంత చక్కగా ఆత్మను గురించి తెలుసుకున్నా అనుభవానికి అందదు. దానిని ఆచరణలోకి తెచ్చుకోవాలి. అలా అనుభవానికి తెచ్చుకోవాలంటే

1. సత్యవ్రతాన్ని పాటించాలి.
2. శ్రద్ధతో శాస్త్రాన్ని శ్రవణం చేసిమననం చేయాలి.
3. తపస్సు దమం, నిష్కామ కర్మ ఆచరించాలి.

అని చెప్పి గురువు ఉపనిషత్తును ముగిస్తున్నాడు.

## నవమమంత్రం

## ఫలశ్రుతి

మం॥ యోవా ఏతామేవం వేదాపహత్య పాప్మానం
అనన్తే స్వర్గేలోకే జ్యేయే ప్రతితిష్ఠతి ప్రతితిష్ఠతీతి। 9

ప్రతిపదార్థం:- యఃవా = ఎవరైతే; ఏతాం = ఈ ఆత్మను; ఏవం = ఈ ప్రకారంగా ఆచరించి; వేద = తెలుసుకుంటాడో; పాప్మానం = పాపాలను; అపహత్య =

నశింపజేసుకొని; అవనంతే = అనంతమైన; సర్గేలోకే = సర్గలోకంలో; జ్యేయే = జయించి; ప్రతితిష్ఠతి = ప్రతిష్ఠపొందుతాడు; ఇతి = అని (ఉపనిషత్తు)

భావం:- ఎవరైతే ఈ ప్రకారంగా ఆచరించి బ్రహ్మమును తెలుసుకుంటారో, వారు అన్ని పాపాలను నశింపజేసుకొని అనంత స్వర్గంలో (బ్రహ్మములో) జయంపొంది ప్రతిష్ఠితుడౌతాడు - అని ఉపనిషత్తు.

వ్యాఖ్య:- ఈ ప్రకారంగా అంటే బ్రాహ్మీ ఉపనిషత్తు ద్వారా బ్రహ్మమును తెలుసుకొని, ఆచరణాత్మక సాధనలు ఆచరించి ఎవరైతే బ్రహ్మమును తెలుసుకుంటారో వారి పాపాలన్నీ నశించిపోతాయి.

పాపాలంటే వాసనలే. ఇతరులకు హానిచేసే పనులను పాపాలంటారు. అలా ఎందుకు చేస్తారు ? చేయాలని మనస్సులో ప్రేరణలు కలుగుతుంటాయి. అవెందుకు కలుగుతాయి ? అటువంటి స్వభావం గనుక. ఆ స్వభావం ఎలా వచ్చింది ? అలాంటి ఆలోచనలు, అలాంటి పనులు ఇంతకు ముందు చేసి ఉండటం వల్ల. కనుక ఇంతకు ముందు జన్మలలో చేసిన పనుల వల్ల, ఆలోచనలవల్ల వాసనలు కూడుకున్నాయి. ఆ వాసనలే ఇప్పుడు స్వభావంగా ఏర్పడి,. ఆ స్వభావాని కనుగుణంగా ప్రేరణలు వస్తున్నాయి. ఆ ప్రేరణల కనుగుణంగా నడవటమే పాపం. ఈ పాపాలన్నీ ఉపనిషత్తుల జ్ఞానాన్ని తెలుసుకుంటే ఆచరణ చేస్తే పోతాయి. ఎలా పోతాయి ?

నిష్కామ కర్మాచరణ చేస్తున్నప్పుడు శాస్త్రాన్ని శ్రవణం చేస్తున్నపుడు పాతవాసనలు ఖర్చై పోతుంటాయి. చిత్తం శుద్ధపడుతుంది. దానితో స్వభావం మారిపోతుంది. ప్రేరణలు రావు. అలా పాపాలు నశిస్తాయి. పాపాలు నశిస్తే కోరికలు అంతమై పోతాయి. ఇంద్రియ నిగ్రహం కలుగుతుంది. దానితో పాపపు పనులు, స్వార్థ పూరిత

కర్మలు చేయటం ఆగిపోతుంది. ఈ విధంగా ఉపనిషత్తు శ్రవణం వల్ల, ఆచరణ వల్ల సమస్త పాపాలు నశించి పోతున్నాయి.

అలా పాపాలు నశించిన వాడు అనంత స్వర్గంలో ప్రతిష్ఠితుడౌతాడు.

అనంతమైన స్వర్గం అంటే మామూలు స్వర్గలోకం కాదు. మామూలు స్వర్గం పుణ్యకార్యాలు చేసినవారు పొందుతారు. వారి పుణ్యాల ఫలం ఖర్చు అయ్యేంత వరకు అక్కడ వివిధ భోగాలు అనుభవిస్తారు. ఖర్చైపోగానే మళ్ళీ భూలోకాన్ని వెతుక్కుంటూ రావాల్సిందే. అంటే అది అంతంతో కూడుకున్న స్వర్గం. అనంత స్వర్గం అంటే అంతం లేనిది. తిరిగిరావాల్సిన పనిలేదు. ఆ లోకాన్ని ఖాళీ చేయాల్సిన పనిలేదు. అది శాశ్వతస్థానం. అదే పరబ్రహ్మస్థానం. పరమాత్మస్థానం. స్వర్గ అనేపదాన్ని విడదీస్తే స్వః+ గ అంటే స్వస్వరూపం వైపు గమించటం. అంటే ఆత్మవైపుకు పయనించటం. అదే మోక్షం. బ్రహ్మానుభూతి జన్మరాహిత్యం.

ఇలా ఉపనిషత్తును బోధించి ఆచరణాత్మకమైన సందేశాలను, ఉపాయాలను తెలియజెప్పి ఫలశ్రుతిని తెలియజేసి ఉపనిషత్తును ముగిస్తున్నాడు గురువు. ఉపనిషత్తు ముగిసింది అనటానికి గుర్తు చివరి పదాన్ని రెండుసార్లు చెప్పటం. అలా చెప్పటంవల్ల ఉపదేశం పూర్తయిందని శిష్యులు గ్రహించేవారు.

ఈ ఉపనిషత్తు మనకు అపరోక్ష బ్రహ్మ జ్ఞానాన్ని అందిస్తుంది. కనుక మననం చేయండి. పునః పునః స్మరించండి.

పూర్వ జన్మ సుకృతం వల్లనే ఈ ఉపనిషత్తును శ్రద్ధగా శ్రవణం చేయడం సంభవించింది. ఆ సుకృతం వల్లనే ఈ ఉపనిషత్తు పై ప్రవచనములు చేసే భాగ్యం దీనికి కలిగింది.

-స్వస్తి -